ఆంధ్రపత్రిక

సచిత్రవారపత్రిక



4 అణాలు

28-3-'51

విషయానుక్రమణిక

28 మార్చి 1951

ఆంధ్రపత్రిక

సంవత్సరచందా
రు. 12-0-0
విడిపత్రిక
4 అణాలు

ప్రతి బుధవారము
ప్రకటింపబడును

Founder : K. NAGESWARA RAO

సంపుటము 43
సంచిక 28

వికృతి సంవత్సర ఫాల్గున బహుళ పంచమి బుధవారము

పర్షియా నూనెపరిశ్రమ. ★ [సీతారామ్]

మార్చి 7 వ తేదీని పర్షియా ప్రధానమంత్రి జనరల్ రజ్మారా హత్య గావించబడ్డాడు. మార్చి 15 వ తేదీని పర్షియన్ మజ్లిస్ (ప్రజాప్రతినిధుల సభ) నూనె పరిశ్రమను ప్రభుత్వం అధీనం చేసుకోవాలని ఏకగ్రీవంగా తీర్మానించింది. మార్చి 19 వ తేదీని పూర్వవిద్యాశాఖామంత్రిపైన హత్యాప్రయత్నం జరిగింది. మార్చి 20 వ తేదీని పర్షియాలో సైనిక శాసనాన్ని రెండు మాసాలవరకూ అమలు జరుపుతూ, జనరల్ అబ్దుల్ హుస్సేన్ హెజాజీని మిలిటరీ గవర్నర్‌గా నియమించాడు. మార్చి 20 వ తేదీనే పర్షియన్ సెనేట్ (ఎగువ శాసనసభ) నూనె పరిశ్రమపై మజ్లిస్ తీర్మానాన్ని ఏకగ్రీవంగా ఆమోదించింది.

పర్షియాలో పరిణామాలను ఇప్పుడే కాదు, చాలకాలంగా బ్రిటన్, అమెరికా, రష్యాలు అతిశ్రద్ధగా గమనిస్తున్నాయి. ఈ దేశపు రాజకీయాలకు ఆదినుంచీ అగ్రరాజ్యాల దుస్తంత్రాలు, గూఢచర్యలు ప్రధానాశ్రయాలుగా ఉన్నాయి.

పర్షియా సర్వస్వతంత్రమైన దేశమైనప్పటికీ, వాస్తవంగా అగ్రరాజ్య రాజకీయాలలో కీలుబొమ్మైపోయింది. పర్షియన్ రాజకీయ పార్టీలలో ప్రతి పార్టీకీ ఏదోఒక అగ్రరాజ్యం మద్దతు ఇస్తుంది. పర్షియాను ఏ అగ్రరాజ్యం ఆక్రమించుకున్నా ఇతర అగ్రరాజ్యాలు ఊరుకోవు. ప్రపంచయుద్ధం వెంటనే ప్రజ్వలిస్తుంది. అందువల్లనే ఇంతవరకూ పర్షియా స్వతంత్రదేశంగా ఉంది. లేనట్లయితే, రష్యా, బ్రిటన్లలో ఏదోఒక దేశం ఎప్పుడో ఆక్రమించుకుని ఉండేది.

ప్రపంచ రాజకీయాలలో పర్షియా ప్రాధాన్యం, నైసర్గిక స్థితివల్లనూ, నూనె గనులవల్లనూ పరిగణించబడుతోంది. పర్షియా రష్యాకు పొరుగుదేశం. రష్యాలోని నూనెగనులకు అతి సమీపంలో ఉంది. పర్షియన్ నూనెగనులు, అమెరికా, వెనిజూలా, రష్యాల గనుల తరవాత పెద్దవి. పర్షియా నూనెపైన తేలుతున్న పెద్ద తెప్ప అని ఒక ఖనిజశాస్త్ర నిపుణుడన్నాడు. బ్రిటిష్ వైమానిక, నౌకాశాఖలకూ, టాంకులు మొదలైనవానికీ పెట్రోల్ సప్లయి అత్యధికంగా పర్షియా నుంచేవస్తుంది. అందువల్ల బ్రిటిష్ సైన్యాలిప్పుడు పర్షియాపైన దాడిచేస్తే (మూడువంతులు ఇలా జరిగే అవకాశం లేదు.) వెంటనే ప్రపంచ యుద్ధం ప్రజ్వలిస్తుంది.

పర్షియాలో నూనె ఉందని మొదట కనిపెట్టినది ఒక బ్రిటిష్ పారిశ్రామికుడు. అప్పటి పర్షియన్ షా (రాజు) వద్ద అనుమతి పొంది 1909 లో విలియం నాక్స్ డిఆర్సీ అనే బ్రిటిష్ పారిశ్రామికుడు గొట్టపు నూతులు తవ్వి నూనె తీశాడు. 1912 లో అతను తన హక్కుని ఆంగ్లో-పర్షియన్ ఆయిల్ కంపెనీకి అమ్మాడు. పర్షియాలో నూనె తీసి అమ్మడానికి ఈకంపెనీకి గుత్త ఇవ్వబడింది. అప్పటినుంచీ ఈకంపెనీ పశ్చిమ పర్షియాలో నూతులు తవ్వి పెద్ద గొట్టాలద్వారా పర్షియన్ సింధుశాఖకు తీసుకుపోతోంది. అక్కడ సముద్రతీరాన రిఫైనరీలు (ముడి నూనెను పరిశుభ్రంచేసేయంత్రాగారాలు). నిర్మించింది. కంపెనీ మూలధనం 21 కోట్ల పౌనులు. బ్రిటిష్ ప్రభుత్వం ఇందులో నూటికి 53 వంతులు వాటాలు తీసుకుంది. బ్రిటిష్‌యుద్ధ బలానికి ఈనూనె పరిశ్రమ ప్రాణం వంటిది. ఈనూనె అమ్మి బ్రిటన్ డాలర్లుకూడా సంపాదిస్తుంది. పర్షియన్ ప్రభుత్వానికి కూడా ఈనూనె పరిశ్రమవల్ల అపారమైన ఆదాయం లభిస్తుంది.

పర్షియాలో ఇంకొక కంపెనీతో పోటీ బాధలేకుండా, నూనె తీసేహక్కుని కేవలం ఆంగ్లో - పర్షియన్ ఆయిల్ కంపెనీకి ఒక్కదానికే (గుత్తగా) ఇచ్చినందుకు, విదేశీవాణిజ్యసంస్థ అయినప్పటికీ అవకాశమిచ్చినందుకు, పర్షియన్ ప్రభుత్వానికి ఈకంపెనీ చెల్లించవలసిన కప్పం (రాయల్టీస్) మొత్తం లాభంలో నూరింట 11 వంతులుకూడా ఉండేదికాదు.

తరవాత మిగతా అరబ్ దేశాలలో నూనె పరిశ్రమ ఒడంబడికలతోపాటు ఇక్కడకూడా కప్పంకట్టే పద్ధతి సవరణ చెయ్యబడింది. కాని పర్షియా ప్రభుత్వం లాభాలలో ఎక్కువపాలు కావాలనిపట్టు బట్టి, ఆంగ్లో-ఇరానియన్ ఆయిల్ కంపెనీ (పర్షియా పేరు ఇరాన్‌గా మార్చుకున్నప్పుడే, కంపెనీ పేరు ఆంగ్లో - పర్షియన్ ఆయిల్

కంపెనీనుంచి ఆంగ్లో - ఇరానియన్ ఆయిల్ కంపెనీగా మారింది) ప్రతిపాదించిన షరతుల్ని నిరాకరించింది. 1933 లో రాయబారాలు జరిగాయి. రాయబారాల సమయంలో బ్రిటిష్ నౌకాదళం ఒకటి పర్షియన్ సింధుశాఖలో నిలిచింది. ఒత్తిడికిలొంగి పర్షియన్ ప్రభుత్వం కంపెనీ షరతులకు సమ్మతించింది. కొత్త షరతుల ప్రకారం ఉత్పత్తిఅయ్యే నూనె టన్నుల్ని బట్టి, కప్పం నిర్ణయించబడింది. ఈ ఒడంబడిక 60 సంవత్సరాలు అమలులో ఉండాలని నిర్ణయించబడింది.

తరవాత ద్వితీయ ప్రపంచ యుద్ధానంతరం ఈ ఒడంబడిక తమకు సమ్మతంగా లేదనీ, సవరణ చెయ్యాలనీ పర్షియన్ ప్రభుత్వం బ్రిటిష్ ప్రభుత్వంపైనా ఆయిల్ కంపెనీపైనా ఒత్తిడితెచ్చింది. 1949 వ సంవత్సరంలో దాదాపు తొమ్మిదిమాసాల పాటు రాయబారాలు నడిచాయి. చివరికి కుదిరిన ఒడంబడికలో కప్పం రెట్టింపు పెంచడానికీ, హెచ్చురేటు ప్రకారం, జరిగిపోయిన సంవత్సరానికికూడా లెక్కగట్టి, దానిప్రకారం చెల్లించిన ధనానికి పైన ఎంత ఎక్కువ ఉంటుందో, అంతా ఏకమొత్తంగా ఇవ్వడానికీ నిర్ణయమయింది. సాలీనా 2 కోట్ల 20 లక్షల పౌనులకు తగ్గని ఆదాయం ఇవ్వడానికి గ్యారంటీ ఇవ్వబడింది. కాని 1949 లెక్కల ప్రకారం ఆంగ్లో-ఇరానియన్ ఆయిల్ కంపెనీకి వచ్చిన లాభంలో ఇవ్వవలసిన కప్పం 24% మాత్రమే ఉంటుంది. పర్షియన్ ప్రభుత్వం సమ్మతించినప్పటికీ పార్లమెంట్ ఈ ఒడంబడికను ఆమోదించలేదు. బ్రిటిష్‌వారు తమ దేశాన్ని దోచివేస్తున్నారని పర్షియన్ ప్రజలు, రాజకీయపార్టీలు భావించాయంటే తప్పులేదు. అయితే బ్రిటిష్‌వారి దోపిడికి మూలం, అగ్రరాజ్యాల దుస్తంత్రాలలో తలదూర్చిన పర్షియన్ రాజకీయపార్టీల వ్యవహారవిధానమే.

1933 లో నౌకాబలం చూపి బెదిరించి ఒడంబడిక నంగీకరింపచేసిన బ్రిటిష్‌వారిపైనా, ఆయిల్ కంపెనీ పైనా దేశంలో అసంతృప్తి చెలరేగింది. కాని పొరుగునున్న రష్యా భీతివల్ల పర్షియన్‌ప్రభుత్వం బ్రిటన్ అమెరికాలపైన ఆధారపడక తప్పలేదు.

విదేశీయుల ప్రాబల్యానికి ఎప్పటికప్పుడు లొంగవలసి వస్తున్నందువల్ల, పర్షియన్ ప్రజల్లోనూ, రాజకీయపార్టీలలోను విదేశీయులందరిపట్లనూ ద్వేషభావం [illegible] రాజకీయ తంత్రాలంలో ఆరితేరిన పార్టీలవారు బ్రిటిష్‌వర్గంతో చేరి రష్యాపైనా, రష్యాతో చేరి బ్రిటిష్‌వారిపైనా, అమెరికాతో చేరి రష్యా బ్రిటన్‌లపైనా ఈరీతిగా అగ్రరాజ్యాల తగవులు నాధారంచేసుకుని స్వదేశంలో రాజకీయ ప్రాబల్యానికీ, విదేశీయులపైన పగసాధించడానికీ యత్నాలు చేస్తున్నారు. ఉత్తర పర్షియాలో నూనె తియ్యడానికి1946 లో అనుమతి కోరి, రష్యా అప్పటి ప్రధాని ఘవాం సుల్తాన్‌తో ఒక ఒడంబడిక చేసుకుంది. పాతిక సంవత్సరాలకు ఒడంబడిక చేసుకోడానికి నిర్ణయమయింది.

కాని ఈఒడంబడికను పర్షియన్ పార్లమెంట్ నిరాకరించింది. అప్పుడు అమెరికాతో చేరి, ద్రవ్యసహాయంపొంది, పర్షియా ప్రభుత్వం రష్యాను ధిక్కరించింది. అజర్బైజాన్‌లో కొండ జాతివారి తిరుగుబాటు (1946-47) లో అణిచివేసినతరవాత కమ్యూనిస్టు ప్రాబల్యంకల టూడే పార్టీ నిషేధించబడింది.

విదేశీయుల ప్రమేయాన్ని నిరసించే పర్షియన్ పార్లమెంటు 1944 లో ఒక శాసనంచేసింది. ఈ శాసనంప్రకారం పార్లమెంట్ అనుమతిలేనిదే నూనె గనులవిషయమై ప్రభుత్వం ఏ ఒడంబడికలు చేసుకున్నా చెల్లవు. అయిదేళ్లవరకూ కొత్త గనులు విదేశీయులెవ్వరికీ ఇవ్వరాదని కూడా నిషేధించబడింది.

తరవాత రష్యా పర్షియాపైన ఒత్తిడి చెయ్యడం విరమించుకుంది. అది మొదలు పర్షియాలో బ్రిటిష్‌వారిపైనా అమెరికన్ల పైనా ద్వేషం చెలరేగింది. దీనికి ఫలితంగానే 1949 లో ఆయిల్ కంపెనీతో ప్రభుత్వం చేసుకున్న ఒడంబడికను పార్లమెంట్ నిరాకరించింది.

పర్షియారాజు అమెరికా సందర్శనం అనంతరంకూడా, పర్షియా ఆర్థికాభివృద్ధికి ద్రవ్యసహాయం చెయ్యడానికి అమెరికా సక్రమంగా కలిసిరాకపోడంతో విదేశీయులపట్ల ద్వేషం ఇనుమడించింది.

దీనికితోడు పాశ్చాత్య సంపర్కంవల్ల జాతీయసంస్కృతీ, ఇస్లాం మతాచార అనువర్తనా క్షీణిస్తున్నదనేభావం ముస్లిం మతావేశపరులకు అధికమయింది. క్రమంగా పర్షియాలో మతప్రధానమైనపార్టీ ఫెదయా ఇస్లాం బలపడుతోంది. ఇప్పటికే అరబ్ దేశాలలో రాజకీయ హత్యలకు దాదాపు అన్నిటికీ మతావేశపరులే కారకులు. విదేశీయులందరిపట్లనూ ద్వేషమే ప్రధాన సిద్ధాంతంగా పెట్టుకున్న నేషనల్ ఫ్రంట్ పార్టీ బలం దేశంలో అధికమయింది.

మతావేశపరుల బెదిరింపులు, నిరంకుశ వర్తన, పర్షియన్ రాజకీయాలలో నేడు ప్రధానమైనాయి. బ్రిటన్ అమెరికాలవల్ల లభించగల సహాయంకాని, పరస్పర వ్యవహారాలలో న్యాయంకాని స్వల్పమని తెలియగానే పర్షియన్ ప్రభుత్వం రష్యాతో వాణిజ్యపు టొడంబడిక చేసుకుంది. గూఢచర్యలలో పాల్గొంటున్న అమెరికన్లను దేశంనుంచి వెళ్లగొట్టింది. అమెరికన్ సలహాదారుల్ని (మిలిటరీ, ఆర్థికశాఖలకు చెందినవారు) వెళ్ళగొట్టింది. రష్యా ప్రతికూలప్రచారంచేసే అమెరికా వాణి రేడియో ప్రచారాన్ని నిషేధించింది.

చివరకు దేశంలోని సంపద దేశీయులకే చెందాలనేభావం అధికమై, ఆంగ్లో-ఇరానియన్ ఆయిల్ కంపెనీ పరిశ్రమని ప్రభుత్వం వశం చేసుకోవాలని నేషనల్ ఫ్రంట్‌పార్టీ ప్రచారం ప్రారంభించింది. వ్యతిరేకులైన వారిని శిక్షించగలరని పార్టీనాయకులూ, ఫెదయా-ఇస్లాం సభ్యులూ ప్రకటించారు. ఆయిల్ కంపెనీని జాతీయం చెయ్యకపోయినట్లయితే ప్రాణాలు తియ్యగలరని ఫెదయా ఇస్లాం సమాజసభ్యులు ప్రధాని జనరల్ రజ్మారానూ, పర్షియా రాజునూ బెదిరించారు. కాని జాతీయంచేస్తే నష్టపరిహారం చెల్లించడానికి 80 కోట్ల డాలర్ల ధనం ప్రభుత్వంవద్ద లేదు. యంత్రాగారాల్ని నడపగల పర్షియన్ నిపుణులు లేరు. నూనె అమ్మడానికి తగిన వాణిజ్య సంస్థలు కాని, రవానా చెయ్యడానికి టాంకర్ నౌకలుకాని పర్షియాకు లేవు. ఈ కారణాలవల్ల ఆయిల్ పరిశ్రమను జాతీయం చెయ్యరాదని ప్రధాని రజ్మారా ప్రతిఘటించాడు. కాని నానాటికీ నేషనల్ ఫ్రంట్‌పార్టీ, ఫెదయా ఇస్లాం సమాజాలు దేశంలో రెచ్చగొడుతున్న విద్వేషజ్వాలలను గమనించిన పార్లమెంట్, రజ్మారా మాట వినలేదు. పరిశ్రమను జాతీయం చెయ్యవచ్చునని పార్లమెంట్ నియమించిన కమిటీ నివేదించింది. దీనిని నిరోధిస్తున్న, పర్షియన్ ప్రధాని రజ్మారాను ఫెదయా ఇస్లాం సమాజసభ్యుడొకడు మార్చి 7 వ తేదీని హత్యచేశాడు. హంతకుని అరెస్టు చేశారు. అతన్ని విడుదలచెయ్యకపోతే రాజును చంపగలరని ఇస్లాం సమాజ సభ్యులు బెదిరిస్తున్నారు. బెదిరింపులవల్ల షా భవనంవద్ద కాపుదల పెంచబడింది.

దేశమంతటా సైనికశాసనం అమలు జరిగింది.

కమిటీ నివేదికను మజ్లీస్ ఏకగ్రీవంగా ఆమోదించింది. రెండురోజుల్లో సెనేట్ కూడా ఏకగ్రీవంగాఆమోదించింది. ఆయిల్ పరిశ్రమనే రీతిగాప్రభుత్వం వశపరచుకోవాలో కార్యక్రమాన్ని నిర్ణయించాలని అదే కమిటీకికర్తవ్యం విధించబడింది.

పరస్పరం సమాధానపడి చేసుకున్న ఒడంబడికను, ఒకపక్షం ఈరీతిగా రద్దుపరచగదని చెప్తూ పార్లమెంట్ చర్య పట్ల బ్రిటిష్ ప్రభుత్వంతీవ్ర అసమ్మతిప్రకటించింది. బ్రిటిష్ ప్రభుత్వం తన అభిప్రాయాన్ని టెహరన్‌లోని తమ రాయబారి ద్వారా పర్షియాప్రభుత్వానికి అందచేసింది. కాని పర్షియా ప్రభుత్వం ఇంతవరకూ సమాధానమివ్వలేదు. అంతర్జాతీయ న్యాయసంస్థలో బ్రిటిష్ ప్రభుత్వం ఫిర్యాదుచేస్తుందని కొందరు బెదరిస్తున్నారు. కాని వాస్తవానికి ఈవిధంగా జోక్యం చేసుకునే హక్కు బ్రిటన్‌కిలేదు. స్వదేశంలో బొగ్గు, ఇనుము, ఉక్కు పరిశ్రమల్ని జాతీయంచేసిన బ్రిటిష్ ప్రభుత్వం, మరొకదేశంలో ప్రభుత్వం పరిశ్రమల్ని జాతీయం చేస్తున్నందుకు ఆక్షేపణ తెలపడం వింతగా కనిపిస్తుంది. కాని బ్రిటిష్‌రాజనీతి ఎప్పుడూ ఇదే విధంగా ఉంది. స్వదేశంలో సామ్యవాదాన్ని అమలు జరుపుతూ, సామ్యవాద తత్వానికి విరుద్ధంగా ఆఫ్రికామలయాలలో సామ్రాజ్యతత్వాన్ని అవలంబిస్తోంది. బర్మాలో బియ్యపుఅమ్మకాన్ని ప్రభుత్వం స్వాధీనపరుచుకొన ప్రయత్నించినప్పుడు అభ్యంతరపెట్టి, బర్మాలో కైరిస్తవసర్గాన్ని విప్లవానికి పురికొల్పింది.

ఎన్ని కంట్రాక్టులున్నా, ఎటువంటి ఒడంబడికలున్నా సరే, పరిశ్రమల్ని అధీనంచేసుకునే హక్కు ప్రతిదేశ ప్రభుత్వానికీ ఉంది. ఆ హక్కుని ఇప్పుడు బ్రిటన్ ఆక్షేపించడంవల్ల, బ్రిటిష్ దుర్నీతి పట్లపర్షియన్ ప్రజలకు ఆగ్రహం మరింత అధిక మౌతుందేకాని ప్రయోజనమేమీ ఉండదు.

పర్షియన్ మజ్లిస్ సభ్యుడొక డిలా అన్నాడు: "1933 లో బ్రిటన్ బెదిరింపులకు జడిసి ఒడంబడికను ఒప్పుకున్నాం. ఇప్పుడు దేశంలో దౌర్జన్యవాదులకు భయపడి ఆయిల్ పరిశ్రమని జాతిపరం చేస్తున్నాం."

నిజానికి పార్లమెంట్ సభ్యులందరూ ఏకగ్రీవంగా పరిశ్రమని జాతీయం చెయ్యడానికి తీర్మానించారేకాని, ఇంతపెద్ద పరిశ్రమని తీసుకుని ఏంచెయ్యాలో, ఏం చెయ్యగలరో ఎవరికీ తెలియదు. దేశంలో అంతకంతకు అధికమౌతున్న కల్లోలాన్ని అరికట్టడానికీ, విదేశీయులపట్ల, ముఖ్యంగా బ్రిటిష్‌వారిపట్ల, ద్వేషం కక్కుతున్న అతివాద రాజకీయవర్గాల్ని సంతృప్తిపరచడానికీ మాత్రమే పార్లమెంట్ ఈ తీర్మానాన్ని ఆమోదించింది.

రజ్మారా హత్యకీ, ఆయిల్ పరిశ్రమని జాతీయం చేయించడానికీ సంబంధం ఉందనీ, దీని కంతటికీ రష్యా కుట్ర మూలమనీ అమెరికన్ పత్రికలు కొన్ని వ్రాశాయి. కాని రజ్మారా హత్యకు అమెరికన్ల కుట్ర హేతువని రష్యన్ కమ్యూనిస్టుపార్టీ పత్రిక ప్రావ్దా వ్రాసింది. ఈ హత్యవల్ల అమెరికన్లకే రెండువిధాల లబ్ధి ఉంటుందని ఆ పత్రిక వ్రాసింది. 1. ఇరవయ్యో శతాబ్దం ఆదినుంచీ పర్షియాలో పీఠం వేసుకుని కూచుని అక్కడ నూనెపరిశ్రమని గుత్త తీసుకున్న బ్రిటిష్ కంపెనీకి స్వస్తి చెప్పి నారు ప్రవేశించ వచ్చును. 2. రష్యాతో వాణిజ్యపు టొడంబడిక చేసుకుని, అమెరికన్ సలహాదార్లని వెళ్ళగొట్టి, అమెరికన్ ప్రచారాన్ని నిరోధించి అమెరికన్ల తంత్రాలకి కంటక ప్రాయంగా ఉన్న రజ్మారాని తొలగించ వచ్చును.

రష్యన్ పత్రిక వ్యాఖ్యాన్ని నమ్మగలిగినా నమ్మలేకపోయినా, అన్నిరకాల దుస్తంత్రాలకూ ముస్లిందేశాలలో వీలుందని ఒప్పుకోవాలి. పర్షియాలో నూనెగనులపైన అమెరికన్లకి ఆశఉందంటే నమ్మవచ్చును. సాదీఅరేబియాలో నూనె తియ్యడానికి అనుమతించినందుకుగాను అరేబియారాజు ఇబన్ సాద్‌కి అరబ్ అమెరికన్ ఆయిల్ కంపెనీ బంగారుపళ్లకీ బహుమతి నిచ్చింది. వచ్చిన లాభంలో సగానికి సగం అరేబియన్ ప్రభుత్వానికి కప్పం కట్టుతోంది. బ్రిటిష్ వారికంటె ఉదారబుద్ధితో స్వంతఖర్చులపైన అరబ్బీఉద్యోగులికి వారిసంసారాలకి విద్య, వైద్యం, జీవన సదుపాయాలు ఇస్తోంది. అరబ్బీలని ఎక్కువమందిని నియమించి కొన్నికొన్ని యంత్రాగారపు శాఖల్లో శిక్షణ నిస్తోంది. అంతమాత్రానికి యంత్రాగారాల్ని నడపగల విజ్ఞానాన్నిస్తోందని కాదు. బ్రిటిష్‌వారికంటె కొంచెం మేలు.

ఇవన్నీ చూసిన తరవాతనే ఇరాక్, పర్షియా ప్రభుత్వాలకి బ్రిటిష్‌వారిపైన కోపం వచ్చింది. బ్రిటిష్‌సామ్రాజ్యవాదులు తమకు అన్యాయం చేస్తున్నారని పర్షియా ప్రజలు భావించారు. ఇప్పుడు పర్షియాకీ అమెరికన్లకీ సామరస్యం సాధ్యమైతే, బ్రిటిష్ కంపెనీని వెళ్లగొట్టి, అమెరికన్లకిచ్చి, కంట్రాక్టులి అమెరికావల్ల ఆర్థికాభివృద్ధి ద్రవ్యసహాయం పొందవచ్చును. అమెరికన్లకికూడా రష్యన్ నూనెగనుల కతిసమీపంలో స్థావరాలు లభించవచ్చును.

రష్యన్లకి నూనెగనుల్ని ఒప్పగించి నట్లయితే, పర్షియన్ ప్రభుత్వం తెరఫున కంట్రాక్టు పద్ధతిపైన నూనెతీసి వారే ఆ నూనెని ప్రభుత్వంవద్దనుంచి కొనవచ్చును. దీనివల్ల ఉభయదేశాలకీ లాభమే. నూనె అమ్మకంపైనవచ్చే లాభం, బ్రిటిష్ అమెరికన్ కంపెనీలకి వచ్చినంత రాకపోయినా, వచ్చేదంతా పర్షియా ప్రభుత్వానికే లభిస్తుంది. రష్యన్లకి చౌకలో నూనె లభిస్తుంది. నూనె పరిశ్రమ విదేశీయులచేతిలో ఉన్నట్లు కాక దేశీయులకే, ప్రభుత్వానికే, చెందినదౌతుంది.

అయితే విదేశీయుల ప్రమేయాన్ని సహించని పర్షియన్ ప్రజలు, ముఖ్యంగా పాశ్చాత్య సభ్యతా సంపర్కాన్ని కాని మతాన్ని ధిక్కరించే కమ్యూనిస్టుల సంపర్కాన్ని కాని సహించని ఇస్లాం పార్టీ, నేషనల్ ఫ్రంట్‌పార్టీ (ఫ్రంట్ పేరు వింటే కమ్యూనిస్టులు మోసంచేసి తయారుచేసిన పార్టీ అని అనుమానం కలగవచ్చును. కాని ఈఫ్రంట్ అటువంటిది కాదు.) ఈమార్గాంతరాలకి సమ్మతించడం సందేహం.

పర్షియన్ పార్లమెంట్ వాస్తవంగా ఏం చెయ్యడానికి తల పెట్టిందో, అసలు రాజకీయద్వేషం తప్ప ఏదైనా కార్యక్రమం ఉందో లేదో తెలియదు.

యంత్రాగారాల్ని పర్షియన్ ప్రభుత్వం స్వాధీనపరుచుకునే పక్షంలో, బ్రిటిష్ ప్రభుత్వం పర్షియాపైకి సేనల్ని పంపడం అసంభవం. సేనల్ని పంపడం అంటే ప్రపంచయుద్ధానికి సిద్ధపడి ఉండాలన్నమాట. పర్షియాలో బ్రిటిష్ సేనలు ప్రవేశిస్తేరష్యా ఊరుకోదు. అప్పుడు రష్యా బ్రిటన్‌ల మధ్య పర్షియాలో యుద్ధం జరిగి తీరుతుంది.

అసలి దంతా కేవలం బెదిరింపేనని బ్రిటన్ అమెరికాలలో కొందరి భావన. లాభాలలో ఎక్కువ పాలుకోసం, పర్షియన్ ఉద్యోగుల్ని అధికంగా నియామించి యంత్రాగారాలు నిర్వహించడానికి శిక్షణనిప్పించడంకోసం పర్షియన్ పార్లమెంట్ ప్రయత్నిస్తోందని బ్రిటిష్‌వర్గాల భావన.

ఈసమస్య సామరస్య ధోరణిలో పరిష్కారం కాకపోయినట్లయితే, ప్రపంచయుద్ధానికి దారితీసే ప్రమాదం ఉంది. ఆయిల్ కమిటీవిదేశీనిపుణుల్ని సంప్రదించి,

కొరియా రక్షణ

★

అంతా కలిసి కొరియాని రక్షిస్తున్నారు—
అందుకే గతవారంలో,
అమెరికన్లు కొరియాలో,
అన్ని వేల టన్నుల బాంబులేశారు.

కొరియాలో మానవుణ్ణి రక్షిస్తున్నారు—
అందుకే పచ్చి బాలింతరాళ్లూ,
అశుభం శుభం తెలియని పసివాళ్లూ,
జయప్రదంగా హతం చెయ్యబడుతున్నారు.

కొరియాలో ఆసియాని రక్షిస్తున్నారు—
కొరియా సర్వనాశనమైతేగాని,
కొరియా నిర్మానుష్యమైతేగాని,
ఆసియాకు ప్రజాస్వామ్యం తెలిసిరాదు.

"భయపడకండి ఆసియానివాసులార!
అవసరమైతే శాంతిరక్షణకు
ఆటంబాంబు లున్నాయి మనకు.
ఆసియా నశించినా శాంతి సురక్షితమౌతుంది."

కొరియాలో అమెరికాని రక్షిస్తున్నారు—
అక్షాంశరేఖ ముప్పయ్యేంది
అమెరికాగుండా పోతుంది.
'కుడ్యవీధి' సరిహద్దులు ప్రపంచాంచలాలు.

—సవ్యసాచి

పరిశ్రమనెలా జాతీయంచెయ్యాలో నివేదించడానికి ఇవ్వబడిన రెండు మాసాల వ్యవధిలో పర్షియన్ ప్రభుత్వంపైన బ్రిటన్ అమెరికాలు ఒత్తిడి తేవడానికి నిర్ణయించాయి.

కొరియా యుద్ధం:

కమ్యూనిస్టుచీనా సైనికబలం కుంగిపోడానికి తరవాయిగా ఉందనీ, యుద్ధాన్ని కొరియాకే పరిమితం కానివ్వక చీనా దేశానికి కూడా వ్యాపింపచెయ్యడానికి ఐక్యరాజ్య సమితి అనుమతించినట్లయితే, చీనా కమ్యూనిస్టు సేనల్ని జయించడానికి అట్టే సేపుపట్టదనీ, అది ఇష్టంలేని పక్షంలో కొరియాలో యుద్ధం విరమించడానికి తాను సిద్ధమేననీ జనరల్ మెకార్థర్ టోకియోలో ఒక ప్రకటన చేశాడు. కొరియాలో ఏ రాజకీయ లక్ష్యాన్ని సమితి సాధించకోరిందో, ఆ లక్ష్యాన్ని రక్తపాతం ఇంక ఎంత మాత్రం అవసరంలేకుండా, సాధించగల తరుణం వచ్చిందని కూడా చెప్పాడు.

మెకార్థర్ కొరియా యుద్ధరంగాన్ని దర్శించడానికి బయలుదేరుతూ టోకియోలో చేసిన ప్రకటనలో ఈరెండు అంశాలూ ప్రధానమైనవి.

ముందుగా రెండో అంశాన్ని పరిశీలించడం అవసరం. కొరియాలో ఏ రాజకీయ లక్ష్యాన్ని సాధించడానికి సమితి కోరిందో అది అందుబాటులోకి వచ్చిందనీ, కొరియాలో ఐక్యమే సమితి ప్రధాన లక్ష్యమైతే ఇంక ఇంతటితో యుద్ధాన్ని ఆపివెయ్యవచ్చుననీ మెకార్థర్ అభిప్రాయం. ఉత్తర, దక్షిణ కొరియాలమధ్య సరిహద్దయిన 38 వ అక్షాంశాన్ని దాట నవసరం లేకుండానే అనుకున్న లక్ష్యం సాధ్యమౌతుందన్నమాట. ఇంక చీనా కమ్యూనిస్టులు మళ్ళీ దిగిరారనికూడా మెకార్థర్ విశ్వసిస్తున్నాడని దీన్నిబట్టి భావించాలి. వారి బలం క్షీణించిపోయినందువల్ల, ఫార్మోజా మొదలైన సమస్యల్ని తీసుకురానవసరం లేకుండానే కొరియాలో యుద్ధ విరమణకు చీనా కమ్యూనిస్టులతో ఇప్పుడు రాయబారాలు జరపడానికి వీలుపడుతుందని అతని అభిప్రాయం.

38 వ అక్షాంశరేఖని దాటకపోయినా సమితి లక్ష్యం సాధ్యమౌతుందని మొదటే భావించిఉన్నట్లయితే, మెకార్థర్‌కి చీనా కమ్యూనిస్టుల చేతిలో పరాభవం తప్పేదే. పండిట్ నెహ్రూ సరిహద్దు దాటవద్దని అప్పుడు చేసిన హెచ్చరికను మెకార్థర్ కాని అమెరికన్ ప్రభుత్వం కాని లక్ష్యపెట్టలేదు. ప్రత్యక్షానుభవంవల్ల కాని, ఇంత దీర్ఘకాలం యుద్ధం అనంతరం కాని, ఈ విషయం మెకార్థర్‌కి తెలిసిరాలేదు. అంతేకాదు. మెకార్థర్ లక్ష్యం కొరియాలో రాజకీయసమస్య పరిష్కారం ఒక్కటేఅయితే, అప్పుడే 38 వ అక్షాంశాన్ని దాటేవాడుకాదని తెలుపుతున్నాడన్నమాట. కొరియాలోనూ చీనాలోను మెకార్థర్ లక్ష్యాలు వేరే ఉన్నాయనీ అన్నిరాజ్యాలకూ ఇదివరకే తెలుసును.

ఇప్పుడీ ప్రకటన చెయ్యడంలో మెకార్థర్ అటో ఇటో తేల్చి వెంటనే చెప్పెయ్యాలని సమితిని కోరుతున్నాడన్న మాట. ఇప్పుడు సమితి అదనంగా సైన్యాలనైనా పంపాలి, లేదా రాయబారాలకు దిగాలి.

"ఈ సరిహద్దువద్ద నిలిచి, తిరిగి ఉత్తరం నించి దండయాత్ర జరక్కుండా కాపాడాలంటే, ఎంత సైన్యం అవసరముంటుంది ?" అని అమెరికన్ యునైటెడ్ ప్రెస్ వార్తా సంస్థ అధ్యక్షుడు పంపిన ప్రశ్నకు జనరల్ మెకార్థర్ మార్చి 16 వ తేదీని సమాధానమిస్తూ ఇలా చెప్పాడు :

"38 వ అక్షాంశం వద్ద సరళమైన రక్షణ శ్రేణిని నిర్మించడం అసాధ్యం. ఈ ప్రదే

కంలో సహజంగా రక్షణనిచ్చే నైసర్గిక లక్షణా లేవీ లేవు. చీనా కమ్యూనిస్టుల్ని ఉత్తరకొరియానుంచి యాలూనది ఆవతలకి, అనగా మంచూరియాలోకి తరిమివేసి, యాలూనదివద్ద రక్షణశ్రేణి నిర్మించుకోడానికి ఎంత సైనిక బలం అవసరముంటుందో, 38 వ అక్షాంశంవద్ద రక్షణశ్రేణి నిర్మించి దురాక్రమణ జరక్కుండా కాపాడ్డానికికూడా అంత సైనికబలమూ అవసరముంటుంది. ఈపరిస్థితిలో రణరంగం ఆట్టే ముందుకీ వెనక్కీ కదలకుండా, ఎంతసేపూ ఈప్రాంతంలోనే దెబ్బతీసి దెబ్బ కాసుకుంటూ గడపవలసివస్తుంది. ఈప్రతిష్టంభన తొలగిపోవాలంటే, అదనపు బలాలు విస్తారం కావాలి; మంచూరియాలోని చీనా కమ్యూనిస్టుల స్థావరాలపైనబాంబులు వెయ్యకూడదనే షేపంధంతొలగి పోవాలి."

ఈరెండు ప్రకటనలూ చేర్చి చూస్తే మెకార్థర్ ఉద్దేశం స్పష్టమాతుంది. చీనాపైన యుద్ధం చెయ్యడానికి భయపడ నవసరంలేదని ఐక్యరాజ్యసమితికి హామీ ఇస్తున్నాడు. హామీ ఇస్తూ, అదనపు సైన్యాల్ని పంపడం కాని, మంచూరియాపైనా చీనాతీరంపైనా విమానదాడులు. జరపడం కాని, ఇష్టం లేకపోయినట్లయితే, వెంటనే యుద్ధం విరమించడానికీ, కమ్యూనిస్టుల సర్వసైన్యాధిపతితో సంప్రతింపులు జరపడానికీ సిద్ధపడుతున్నాడు. ఎటూ తేల్చకుండా ఉన్నట్లయితే, సమితిసేనలు ఇంక ఆట్టే ముందుకి వెళ్లలేవు. సరిహద్దుకి అటూ ఇటూ ఊగిసలాడుతూ ఉండిపోవలసి వస్తుంది. అనవసరమైన రక్తపాతం సంభవిస్తుంది.

చీనా పైన దాడిచెయ్యడానికి అనుమతించినట్లయితే, ఉత్తరకొరియాలో కమ్యూనిస్టుసైన్యాలకీ ప్రజలకీ రుచిమాపిస్తున్నట్లే, చీనాలో సైన్యాలకీ, ప్రజలకీ అమెరికన్ విమానాల బలం, మారణాయుధాల బలాన్ని రుచి చూపించగలడు. కొరియాలో చీనా కమ్యూనిస్టుసేనల బలం భగ్నమైపోవడం తరవాయిగా క్షీణించిపోడానికి రెండు ముఖ్యకారణాలు చెప్పాడు. 1. చీనా సైనికులు ఎంతమంది మీద ఎంతమంది బలగం వచ్చిపడినా, ఎంత దుస్సాహసం చూపించినా సరే, అమెరికన్ మారణాయుధాల బలంముందు నిలవలేక ఆహుతైపోయారు. 2. చచ్చిపవారు చావగా బలగాన్ని పూరించడానికి సైనికుల్ని తీసుకువచ్చే సౌకర్యాల్ని, అవసరవస్తు సామగ్రి రవానా సౌకర్యాల్ని, సరఫరా కేంద్రాల్ని రూపు లేకుండా అమెరికన్ విమానాలు మాపుచేసేశాయి. ఇప్పుడు చీనామీదికి కూడా యుద్ధాన్ని వ్యాపింపచేసినట్లయితే, ఇవే రెండుకారణాలవల్లా చీనా కమ్యూనిస్టుల యుద్ధబలం క్షణంలో కూలిపోయితీరుతుందని మెకార్థర్ ఐక్యరాజ్య సమితికి చెప్తున్నాడు. ఏటంబాంబుల అవసరం లేకుండా కొరియాలో మాదిరిగా నేచీనాలో కూడా, ప్రజల్ని కనికరించకుండా బాంబులు కురిపించి ఊళ్లూ పట్టణాలూ నేలమట్టం చేసి యుద్ధం గెలవవచ్చునని మెకార్థర్ అభిప్రాయం.

ఇదంతా సాధ్యమేనని చెప్తే, కమ్యూనిస్టులికి బుద్ధిచెప్పాలని కోరుకునేవారికి సైఅనాలనే ఉండవచ్చు. కాని రష్యా ఇదంతా చూస్తూ ఊరుకోదనీ, అప్పుడది ప్రపంచయుద్ధంగా పరిణమించి మొదటిదెబ్బ చీనామీదే కాకుండా తమపైన కూడా పడకమానదనీ, బ్రిటన్, ఫ్రాన్సు మొదలైన గేశాలభయం. అందువల్ల మెకార్థర్ కోరికని మన్నించడం ఈదేశాలకి కష్టం.

చీనా విషయంలో ఐక్యరాజ్యసమితి దురాక్రమణ నిందమోపినతరవాత కిమ్మనకుండా ఊరుకుంది. చీనాతో రాయబారాలు జరపడానికి నియమించబడిన ముగ్గురి రాయబారసంఘం పెకింగ్ ప్రభుత్వానికి విజ్ఞప్తిచేసి, ఇంతవరకూ సమాధానం రానందువల్ల, ఏం చెయ్యడానికీ తోచక ఊరుకుంది. దురాక్రమణపరులపైన ఎటువంటి చర్యలు తీసుకోవాలో నిర్ణయించవలసిన పన్నెండు దేశాల సభ్యత్వంకల సమిష్టిచర్యల నిర్ణయసంఘం, అమెరికన్ ప్రతినిధి కోరికపైన సమావేశమై చర్చ జరిపినప్పటికీ, బ్రిటన్ ఫ్రాన్సు మొదలైన దేశాల ప్రతినిధుల ఒత్తిడివల్ల ఏమీ చేయకుండా ఊరుకుంది. కాబట్టి రెండింటిలో ఏదొఒక సంఘం ఇంక జాప్యం లేకుండా ఏమిచేసేదీ తేల్చి చెప్పాలనీ, మాట్లాడకుండా ఊరుకుంటే కొరియాలో యుద్ధపరిస్థితి ఎటూ కాకుండా ఊగిసలాడుతూ ఉండిపోవలసి వస్తుందనీ మెకార్థర్ హెచ్చరిస్తున్నాడు. రాయబారాలకి పిలిచినప్పుడు చీనా మౌనం వహించింది. ఇప్పుడు చీనాను రాయబారాలకు తీసుకురావడమో, లేక సమిష్టి చర్యల సంఘం చర్యలు తీసుకోడానికి సమ్మతించడమో, బ్రిటన్ ఫ్రాన్సు మొదలైన దేశాలు వెంటనే అమీతుమీ తేల్చి చెప్పెయ్యాలని మెకార్థర్ కోరుతున్నాడు.

★

ఆంధ్రకాంగ్రెస్ నాయకుల ఐకమత్య సాధన కృషి

ఐకమత్య సాధనమంటేనూ, నియమబద్ధ వర్తనమంటేనూ దేశకాలమానాల్ని బట్టిఅయినా కాకపోయినా, తరుణాన్ని బట్టి అర్థాలు మారుతూ ఉంటాయని, ఆంధ్ర కాంగ్రెస్ నాయకులు అందరూ ఏకమై నిరూపించారు. ఇదొక్క విషయంలో అందరిమధ్యా ఏకాభిప్రాయం కలిగింది. ఈమధ్య తెలుగు పత్రికల్ని ఈ నాయకులు తమతమ వర్గాల ప్రచారంకోసం ధారాళంగా వినియోగించుకుంటున్నారు.

ఉన్నట్టుండి ఒక్కసారిగా ఆంధ్ర కాంగ్రెస్ నాయకులికి ఐకమత్యాన్ని గురించి అహమ్మదాబాద్ కాంగ్రెస్ చేసిన తీర్మానంపట్ల ఇంతశ్రద్ధ ఒక్కసారి కలిగిందంటే, కారణం దేశంలో యావన్మందికీ తెలుసును. తక్షణ విషయం ఏమిటంటే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షపదవికి ఎన్నిక. రంగా, గోపాలరెడ్డి, సంజీవిరెడ్డి, వెంకట్రావుగార్లు ఎవరిమట్టుకు వారు అధ్యక్షపదవి తమకే లభించాలనే భావంతో బయలుదేరి, అది సాధించడానికి మిగతావారితో "ఐకమత్యానికి" రాయబారాలు సాగించారు. మంత్రివర్గ పక్షంతో రాయబారాలు సాగించినన్నాళ్లు రంగాగారు అధ్యక్షపదవి తమకే చెందాలనీ, ఆ పదవిని తమకి అంటగట్టడానికోసమే అన్నివర్గాలమధ్యా ఐకమత్యాన్ని సాధించాలనీ, వాదించారు. రంగాగారయేది, ప్రకాశంగారయేది ఎవరు అధ్యక్షపదవి కావాలనుకున్నా ఐకమత్యం కుదరేదలేదని మంత్రివర్గం ఖండితంగా తెలియపరిచింది. ప్రకాశంగారికా పదవి ఇవ్వాలని రంగాగారు చెప్తేకూడా మంత్రివర్గం ఒప్పుకోదని ముందే అందరికీ తెలుసు. అయితే, కేవలం తమపైన కక్షకొద్దీ మంత్రివర్గం తీరా ప్రకాశంగారిని ఒప్పుకుంటుందేమోనన్న భయం రంగాగారికి పోలేదు. అందువల్ల ప్రకాశంగారిని నిలబెట్టాలని మాటవరసకేనా అనడానికి రంగాగారికి సాహసం లేకపోయింది.

ఇంక మంత్రివర్గంలో ఎవరిని నిలబెట్టాలని చాల రోజులు తర్జనభర్జనలు జరిగాయి. వెంకట్రావుగారు నిలబడరని స్పష్టంగా తేలిన తరవాత, మంత్రివర్గంవారు రంగావర్గంతో రాయబారాలు విరమించుకుని,

(48-వ పేజీ చూడండి)

★ డైరీ ★

ఆదివారం, 1951 మార్చి 18 :

—ప్రివెంటివ్ డిటెన్షన్ ఆక్ట్ ప్రకారం నిర్బంధంలో ఉంచబడిన బందీల కేసులు పరిశీలించడానికిగాను, జస్టిస్ గోవింద మీనన్, జస్టిస్ బాలకృష్ణ అయ్యర్ గార్ల అధ్యక్షత క్రింద రెండు ఎడ్వైజరీ బోర్డులను మద్రాసుప్రభుత్వం శనివారంనాడు నియమించింది.

—చెన్నపట్నానికి కృష్ణానదీ జలాలను సప్లై చెయ్యడానికి కృష్ణా-పెన్నా ప్రాజెక్టు వివరాలను సమగ్రంగా తయారుచేసి, మద్రాసుప్రభుత్వం భారత ప్రభుత్వానికందచేసినట్లు, మద్రాసు ఇరిగేషన్ ఛీఫ్ ఇంజనీర్ తమకు తెలియపరిచారని మద్రాసు కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో కమీషనర్ ప్రకటించారు.

—అనంతపురం జిల్లాలో ఆరువేల ఎకరాల సాగునిమిత్తం నీటిసదుపాయానికి పెన్నానదిమీద ఆనకట్ట కట్టడానికి మద్రాసుప్రభుత్వం సప్లిమెంటరీ బడ్జెట్‌లో రు 83, 90, 000. ఏర్పాటు చేసింది. ఖర్చు అంచనా :

—నిజాం సాగర్ ప్రాంత భూములలో చేలు చవుడుబారుతున్నందువల్ల హైదరాబాద్ రాజ్యమంతటా అడవులు పెంచడానికి ప్రభుత్వం అయిదేళ్లకు రు 50 లక్షలు మంజూరుచేసింది.

—హైదరాబాద్, మద్రాసు రాజ్యాల పోలీసుశాఖల ఉన్నతోద్యోగులు తెలంగాణాలో కమ్యూనిస్టుల అరాచక స్థితిని గురించి చర్చించడానికి విజయవాడలో సమావేశమైనారు.

—హాన్ నదీ తీర రంగంలో కొరియన్ కమ్యూనిస్టు సేనలపైనా, చీనావలంటర్ సేనలపైనా అమెరికన్లు విషవాయువును ప్రయోగించిరని పెకింగ్ రేడియో శనివారం నాడు ప్రకటించింది.

—ఆస్ట్రేలియా పార్లమెంటు రద్దు చెయ్యబడింది. ఏప్రిల్ 28వ తేదీని ఎన్నికలు జరపడానికి ప్రభుత్వం నిర్ణయించింది.

—ద్రవ్యాభావంవల్ల పర్షియన్ మజ్లిస్ (పార్లమెంటులో ప్రజాప్రతినిధుల సభ) 500 రయాల్స్, 1000 రయాల్స్ మొదలైన పెద్ద కరెన్సీ నోట్లను చలామణిలోనుంచి తొలగించడానికి తీర్మానించింది.

—బ్రిటిష్ ప్రభుత్వం కూడా ఏటం బాంబులు తయారుచెయ్యడానికి నిశ్చయించిందనీ, వీనిని అమెరికాలో నెవాడా మైదానాలలో పరిశీలించగలదనీ లండన్ అనధికారవార్తలు తెలుపుతున్నాయి.

—స్పెయిన్‌ప్రభుత్వం అమెరికాలో గోధుమ కొనుక్కోడానికి, అమెరికన్ ఎగుమతి దిగుమతి బాంక్ 50 లక్షల డాలర్లు ఋణమివ్వడానికి నిశ్చయించింది.

—ఆస్ట్రేలియాలో కమ్యూనిస్టు ప్రభుత్వాన్ని పడగొట్టడానికి జరిగిన ఒక కుట్ర బైటపడినందువల్ల ప్రమాదపరిస్థితి ఏర్పడినట్లు ప్రకటించి, ప్రభుత్వం అసాధారణ అధికారాలను అమలు జరుపుతున్నదని లండన్‌వార్తలు తెలుపుతున్నాయి.

—రష్యా, చీనాదేశాలలో మొత్తం 80 లక్షలపైగా సైన్యబలముందని బ్రిటిష్ యుద్ధశాఖా కార్యాలయం తెలిపింది.

—ఈజిప్టు, భారత దేశాల మధ్య వాణిజ్యం నిమిత్తం కొత్త ఒడంబడికపైన సంతకాలు జరిగాయి.

సోమవారం, మార్చి 19 :

—నాలుగు సంవత్సరాలనుంచి నిర్బంధంలో ఉన్న మలబార్ కమ్యూనిస్టు నాయకుడు శ్రీ ఏ. కె. గోపాలన్, మద్రాసు హైకోర్టు ఉత్తరువు ననుసరించి విడుదల చేయబడ్డారు. ఫిబ్రవరి 22వ తేదీని హైకోర్టు ఉత్తరువు ననుసరించి విడుదలచేయబడినప్పటికీ, వెంటనే ప్రభుత్వం చేసిన కొత్త ఆజ్ఞ ప్రకారం గోపాలన్ అరెస్టయినాడు. ఫిబ్రవరి 22 హైకోర్టు తీర్పుకు ముందే జారీ అయిన ఈ కొత్త ఉత్తరువు చెల్లనేరదని జస్టిస్ పి. సత్యనారాయణరావు, జస్టిస్ సి. రాఘవరావుగార్లు తీర్పు చెప్పారు.

—ఉత్తరకొరియన్లకు అన్నివిధాలా రష్యా సహాయం చెయ్యగలదని ఉత్తరకొరియా ప్రధానికి స్టాలిన్ వాగ్దాన మిచ్చాడు.

—ఫ్రాన్స్, పశ్చిమ జర్మనీ, ఇటలీ, బెల్జియం, హాలండ్, లగ్జెంబర్గ్ దేశాలలోని బొగ్గు, ఇనుము, ఉక్కు పరిశ్రమ లన్నిటినీ ఒకే పంథాలో నిర్వహింపచేసి, ధరల్ని సమీకరించి, అమ్మకంలో సహకరించడానికీ, ఈ ఆరుదేశాల మధ్యనూ రవానా నిర్బంధాలనూ సుంకాలనూ రద్దుచెయ్యడానికీ ఆరు ప్రభుత్వాలూ సమ్మతించి షూమన్ ప్రణాళికపైన సంతకాలు చేశాయి.

మంగళవారం, మార్చి 20 :

—గుంటూరుజిల్లా కాంగ్రెస్ ఎన్నికల్ని ఆపుచేస్తూ జిల్లా జడ్జి ఇచ్చిన ఇంటరిమ్ ఇంజంక్షన్ రద్దుపరచాలని యస్. కె. పాటిల్ గారు హైకోర్టులో దాఖలు చేసిన పిటిషన్ నిరాకరించబడింది.

—చిత్తూరు జిల్లా నిస్సంశయంగా ఆంధ్రప్రాంతమేనని మంత్రి సంజీవరెడ్డి గారు మద్రాసు శాసనసభలో ఒక తమిళ సభ్యుని ప్రశ్నకు సమాధానమిచ్చారు.

—రేషనింగ్ రద్దుచెయ్యబడినచోట్ల పారిశ్రామికప్రాంతాలలో కార్మికుల సౌకర్యంకోసం కంట్రోల్ ధరలకు బియ్యం, గోధుమ వగైరా అమ్మడానికి దుకాణాలు తెరవాలని మద్రాసుప్రభుత్వం కలెక్టర్లకు ఆజ్ఞ ఇచ్చినట్లు శాసనసభలో తెలపబడింది.

—1951 - 52 లో భారతదేశంనుంచి 80 కోట్ల గజాలకంటె అధికంగా వస్త్రం ఎగుమతి చెయ్యనివ్వరాదని భారతప్రభుత్వం నిర్ణయించినట్లు పార్లమెంటులో తెలపబడింది.

—ఇండోనీషియాలో మహమద్ నజీర్ ప్రభుత్వం (ముస్లిం మజూమీ పార్టీ) రాజీనామా నిచ్చింది.

—పర్షియాలో అరాచకంవల్ల షా సైనిక శాసనాన్ని ప్రకటించాడు.

పెట్రోల్ పరిశ్రమను జాతీయం చెయ్యడానికి సెనేట్ తీర్మానించింది. (ప్రజాప్రతినిధుల సభ ముందే తీర్మానించింది.)

—నియోజకవర్గాల ఎన్నికల జాబితాలలోనుంచి శ్వేతేతరవర్ణీయులను తీసివెయ్యాలని దక్షిణాఫ్రికా (మలాన్) ప్రభుత్వం చేసిన నిర్ణయాన్ని, నేటాల్ రాష్ట్ర శాసనసభ నిరాకరించింది.

—ఐక్యరాజ్యసమితి సర్వసభ్య సమావేశం ఈమారు 1951 నవంబరు 6వ తేదీ నుంచి పారిస్‌లో జరపాలని తీర్మానించింది.

—పాకిస్తాన్ రూపాయి మారకపువిలువ కరాచీప్రభుత్వం కోరినప్రకారం అమెరికన్ డాలర్‌కు 3.30852 రూపాయలచొ॥ నిర్ణయించడానికి ప్రపంచద్రవ్యనిధి సమ్మతించింది. (ఈ మారకం ప్రకారమే నూరు పాకిస్తాన్ రూపాయిలకు 144 భారతదేశపు రూపాయలు లెక్కకు వస్తాయి.)

బుధవారం, మార్చి 21 :

—కొరియాలో 38వ అక్షాంశరేఖకు దక్షిణాన కమ్యూనిస్టులకు మిగిలిన ఒక్క పెద్ద స్థావరమూ, చుంచోన్, సమితిసేనల వశమయింది.

—కాశ్మీర్ సమస్యపై భద్రతా మండలిలో బ్రిటిష్, అమెరికన్ ప్రతినిధులు తమ తీర్మానాన్ని స్వల్పంగా సవరణచేసి తిరిగి ప్రతిపాదించారు. ఈ తీర్మానాన్ని భారత ప్రభుత్వంచేత ఒప్పించితీరాలని బ్రిటిష్ ప్రతినిధి సర్ గ్లాడ్విన్ జెబ్ అన్నారు.

—పాకిస్తాన్‌పై జరిగిన కుట్రలో కమ్యూనిస్టుల ప్రమేయం ఉన్నదని లియాఖత్ అలీఖాన్ ప్రకటించారు.

గురువారం, మార్చి 22 :

—హైదరాబాద్‌లో పూర్తిగా ప్రజా ప్రాతినిధ్య ప్రభుత్వాన్ని స్థాపించడానికి కేంద్రప్రభుత్వంతో సంప్రదించాలని సంస్థానకాంగ్రెస్ అధ్యక్షుడు దిగంబర్రావు బిందూకు సంస్థానకాంగ్రెస్ కార్యవర్గం ఆదేశ మిచ్చింది.

—హైదరాబాద్, సికిందరాబాద్ మున్సిపల్ ఎన్నికలను సోషలిస్టులు బహిష్కరించారు. మొత్తం 214 నామినేషన్లలో 52 సక్రమంగా లేవని నిరాకరించబడినాయి.

—కమ్యూనిస్టు నాయకుడు గోపాలన్ తనపై ఫిబ్రవరి 22వ తేదీని ప్రభుత్వం ఇచ్చిన నిర్బంధపుటుత్తరువును హైకోర్టు ధిక్కారణ కింద పరిగణించాలనీ, ధిక్కారణ నేరం కింద ముఖ్యమంత్రి కుమారస్వామి రాజా, డిప్యూటీ సెక్రటరీ రామచంద్రన్, పోలీసు అసిస్టెంట్ కమీషనర్లను విచారించాలనీ హైకోర్టులో దాఖలుచేసిన పిటిషన్ నిరాకరించబడింది.

—చీనాలో అమెరికన్ గూఢచారుల కుట్ర ఒకటి బైటపడిందనీ, టేంట్సిన్ నగరంలో 21 మంది గూఢచారులు పట్టుబడ్డారనీ పెకింగ్ రేడియో ప్రకటించింది.

శుక్రవారం, మార్చి 23 :

కృష్ణా, గుంటూరు, ఉభయ గోదావరి, కర్నూలు జిల్లాలలో కమ్యూనిస్టుల దౌర్జన్యం దాదాపు అంతరించినట్లేనని మద్రాసు ఇన్‌స్పెక్టర్ జనరల్ సంజీవి పిళ్ళె బళ్ళారిలో పత్రికావిలేఖరులకు చెప్పారు.

—కొత్త పంచాయతీ శాసనాన్ననుసరించి పంచాయతీ ఎన్నికలు శాసనసభల ఎన్నికల అనంతరం జరపాలనీ, శాసనాన్ని మాత్రం 1951 ఏప్రిల్ 1 నుంచే అమలు జరపాలనీ మద్రాసు మంత్రివర్గం నిర్ణయించింది.

—సోవియట్ రష్యా ప్రభుత్వం ముడి నారకు బదులుగా 50 వేల టన్నుల గోధుమ ఇవ్వగలదని భారతప్రభుత్వానికి తెలిపింది.

—సోల్ నగరానికికి ఉత్తరంగా, 38వ అక్షాంశానికి దిగువ తొమ్మిదిమైళ్లలో ఐక్యరాజ్య సమితిసేనల పెరాచూట్ దళాలు దిగాయి.

—దేశమంతటా కార్మికుల సమ్మెలు వ్యాపించినందువల్ల గత్యంతరం లేక ఫ్రెంచి ప్రభుత్వం కార్మిక వేతనాల్ని 12% పెంచడానికి నిశ్చయించింది. (జీవన వ్యయ ప్రమాణం 12½% పెరిగింది.)

—వచ్చే ఎన్నికలలో కమ్యూనిస్టుపార్టీ పోటీ చేస్తుందని మలబార్ కమ్యూనిస్టు నాయకుడు ఏ. కె. గోపాలన్ ప్రకటించారు.

—ప్రకాశంగారింట్లో ప్రకాశంగారి వర్గం, రంగాగారి వర్గం సమావేశమై, పోటీ రాని పక్షంలో ప్రకాశం గారినీ, పోటీవచ్చే పక్షంలో రంగాగారినీ ఆంధ్రరాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షపదవికి నిలబెట్టాలని తీర్మానించారు. సంజీవరెడ్డిగారు పోటీ చెయ్యక మానరని మంత్రివర్గ సభ్యులు కొందరు ప్రకటించారు.

శనివారం, మార్చి 24 :

—చీనా కమ్యూనిస్టుల సైనిక బలం క్షీణించి పోయిందనీ, మంచూరియాపైనా, చీనా తీరప్రాంతాన్నీ కూడా యుద్ధ చర్యలు జరపడానికి ఐక్యరాజ్యసమితి అనుమతిస్తే విజయం తథ్యమనీ, ఇది ఇష్టంలేని పక్షంలో ఉత్తర కొరియాలోని కమ్యూనిస్టుసైన్య సర్వాధికారితో యుద్ధ విరమణ సమాలోచనలకు సిద్ధంగా ఉన్నాడనీ జనరల్ మెకార్థర్ టోకియోలో ప్రకటించాడు.

—అవసరాన్ని బట్టి సమితి సైన్యాలు 38వ అక్షాంశం దాటవచ్చునని ఆజ్ఞ ఇచ్చినట్లు మెకార్థర్ ప్రకటించాడు.

—భారతపార్లమెంట్‌లో కొందరు సభ్యులు ఇండో-బ్రిటిష్ వాణిజ్యపు టొడంబడికను సవరణ చెయ్యాలని వాదించారు.

—అమెరికాలో అనేక రకాల కొత్త ఆయుధాలు తయారైనాయనీ, వీనిలో కొన్ని ఎటామిక్ ఆయుధాలుకూడా ఉన్నాయనీ, త్వరలోనే ఇవి కొరియా యుద్ధరంగానికి పంపబడుతున్నవనీ అమెరికన్ రక్షణశాఖామంత్రి జనరల్ మార్షల్ ప్రకటించాడు.

ఆదివారం, మార్చి 25 :

—దక్షిణకొరియన్ సేనల గస్తీ దళాలు అనేకచోట్ల 38వ అక్షాంశరేఖను దాటినట్లు దక్షిణకొరియన్ సైనిక కార్యాలయం ప్రకటించింది.

—కొరియాను విభజించి ఉంచడం అసాధ్యమనీ, మంచూరియా సరిహద్దువరకూ సమితి సేనలు ఆక్రమించుకోవాలనీ దక్షిణ కొరియా రిపబ్లిక్ ప్రధాని డా॥ సింగ్మన్‌రీ ప్రకటించాడు.

—తెలంగాణాలో కమ్యూనిస్టుల దౌర్జన్యచర్యలు తగ్గలేదని ఢిల్లీలో ఆంతరంగిక శాఖోద్యోగి ఒకరు ప్రకటించారు.

—కొచ్చిన్ శాసనసభ్యులు నలుగురు తమ సంస్థానాన్ని తిరువాన్కూరునుంచి విడదీసి మద్రాసు రాష్ట్రంలో కలపాలని కోరుతూ రిపబ్లిక్ అధ్యక్షునికి త్రివేండ్రంలో విజ్ఞప్తిని అందచేశారు.

★

అదీ - ఇదీ

"శాంతి కాముకులు :"

దక్షిణ చైనాలోని కమ్యూనిస్టు వ్యతిరేక గెరిల్లా ఉద్యమానికి అమెరికా అమితమైన ఆయుధ సహాయమే కాకుండా, ప్రముఖ నాయకుల్ని కూడా సప్లయి చేస్తున్న సంగతి ఇప్పుడు రహస్య మేమీ కాదు.

—న్యూస్‌వీక్.

అమెరికాలో జీవనవ్యయం:

అమెరికాలో జీవనవ్యయం ఈ వేసం కాలంలో నూటికి మరొక పదివంతులు పెరగవచ్చునని 'ధరల స్థిరీకరణ' అధికారులు అభిప్రాయపడుతున్నారు. కాని స్థిరీకరణ ముఖ్యాధికారి అయిన మైకేల్ డీశాల్ మాత్రం నూటికి అయిదువంతుల కంటే ఎక్కువ పెరగదని అంటున్నాడు.

న్యూస్‌వీక్.

విషమసమస్య

"...ఇతర దేశాలలో, ముఖ్యంగా రాజకీయ పరివర్తనలకు గురిఅవుతూన్న దేశాలలో, ప్రజాస్వామ్యాన్ని ప్రకాశింపజేయాలంటే, అమెరికా తన పద్ధతులనే గాక రాజనీతినీ, ఆచారాలనూ మార్చుకోవాలి. మన పీడాకరమైన చట్టాలూ, జాతి వివక్షతా, ఇతర దేశాలలో మనము అనుసరించే అభ్యుదయనిరోధక విధానాలూ మన విమర్శకులకు ఆయుధాలు కాకుండా చూడాలి. ఫాసిస్టు స్పెయినుకు 6,20,00,000 డాలర్లు అపి వ్వడంలో గల ప్రజాస్వామ్యాన్ని (అమెరికన్) విదేశాంగశాఖచేత వివరింపజేయగలంత తెలివైన సలహాదార్లు లేరని మా భయం"

—"నేషన్" సంపాదకీయం

సీరియల్ నవల:

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

అలెగ్జాండర్ డ్యూమా

19

దీర్ఘకాలంగా వృద్ధుని మనోవ్యథకు హేతువైన ధన నిక్షేపం, ఇంక పుత్ర సమానునిగా ప్రేమిస్తున్న వ్యక్తికి వినియోగపడుతుందని విశ్వాసం కలగడంతో, వృద్ధుని భావంలో ఆ నిక్షేపం యొక్క మూల్యం రెండింతలయింది. డాంటేతో రోజూ ఆ ధన మొత్తాన్ని గురించే ప్రసంగిస్తూ ఉండేవాడు. కోటీ ముప్పై లక్షల ద్రవ్యంతో మనిషైనవాడు మిత్రులకెంత సహాయం, ఏ రీతిగా చెయ్యగలడో వృద్ధు డుపన్యసించేవాడు. డాంటే ముఖం మేఘాచ్ఛన్నమయేది. పగతీర్చుకోవాలని అతను తీసుకున్న ప్రతిజ్ఞ జ్ఞప్తికి వచ్చేది. ఇంత ధనంతో శత్రువుల కెంతటి అపకారం చెయ్యవచ్చునో అలను యోచించేవాడు. ఫెరయా మాంట్ క్రిస్టో ద్వీపాన్ని చూడలేదు. డాంటే ఎల్బాద్వీపానికీ, కార్సికాకూ మధ్య నౌకలో ప్రయాణిస్తున్నప్పుడు అనేకమార్లు దూరాన ఆ ద్వీపాన్ని చూశాడు. ఆద్వీపం ఎప్పుడూ నిర్జనంగా ఉండేది. అది దాదాపు కోణాకారంలో ఉన్న పర్వతం. ఏ అగ్నిపర్వత ప్రజ్వలనవల్లనో సముద్రాంతర్భాగంనుంచి వెలికి వచ్చినట్లుంది.

డాంటే ఆ ద్వీపం ఉనికిని చూపే చిత్రపటం గీసి ఫెరయాకి చూపించాడు. నిధిని ఎలా వెతకాలో సులువైన మార్గాల్ని ఫెరయా నిర్దేశించాడు. కాని ఫెరయాకి ఉన్నంత ఉత్సాహం డాంటేకి లేదు. ఫెరయా పిచ్చివాడు కాదని డాంటే అర్థం చేసుకున్నమాట నిజమే. కాని ఆ నిధి అక్కడ ఒకప్పుడు దాచబడినప్పటికీ, ఇప్పుడింకా అక్కడే ఉంటుందని డాంటేకి నమ్మకం లేదు. నిధి వృద్ధుని భ్రమా పరికల్పన కాకపోవచ్చు కాని ఇప్పటికింకా అక్కడే ఉంటుందంటే అతను నమ్మలేకుండా ఉన్నాడు.

బందీల తుది ఆశల్ని తుడిచిపెట్టేసి, శాశ్వతంగా వారిని నిర్బంధంలోనే ఉంచడానికి విధి కుట్రపన్నినట్లు, ఇప్పుడొక దుర్ఘటన సంభవించింది. సముద్రం పక్కనున్న వరండా మరమ్మతుకి వచ్చింది. కొత్త పునాదులు వేసి వరండా మరమ్మతు చేశారు. బందీలిద్దరూ కష్టపడి తవ్వి సగంలో ఆపుచేసిన గొయ్యి ఇప్పుడు రాళ్లతో పూడ్చబడింది. ఇప్పుడు వారి మార్గానికి నిర్భేద్యమైన నిరోధం ఏర్పడింది.


యువకుడు విషాద స్వరంతో అన్నాడు "మాశారా! నాకు మీపట్ల గలభక్తికి ప్రతిఫలమని మీరు భావిస్తున్న దానిని, నాకు లభించనివ్వకూడదని భగవంతుడే నిర్ణయించాడు. నేనెప్పటికీ మీతోనే ఉంటానని మాటిచ్చాను. ఇప్పుడింక ఆమాట నిలబెట్టుకోక నాకు గత్యంతరం లేదు. మీసహవాసాన్ని మించిన భాగ్యం నాకేదీ లభించదు. మన మిద్దరం ఇంకెన్నటికీ ఈచోటు విడిచి వెళ్లలేం. నాభాగ్యం వాస్తవంగా మాంట్ క్రిస్టో కొండలమధ్య నిరీక్షిస్తున్న ద్రవ్యసంపద కాదు. మీరు నాలో వెలిగించిన జ్ఞానజ్యోతి, నా స్మృతిలో శాశ్వతంగా నెలకొల్పిన భాషాజ్ఞానసంపద మాత్రమే నా వాస్తవభాగ్యం. మీ అపారజ్ఞాన నిధి తవ్వి నాకిచ్చిన సులభ్య విజ్ఞానసంపదలే, సుబోధ్యమానవ విజ్ఞానమే నాకు లభించిన భాగ్యం. ఇంతకాలం మీ సాహచర్యంవల్ల నాలో నూతన భావాలనుత్పన్నంచేసే మీ అద్భుత వాక్ప్రాభవం వల్ల నాకు మనోశక్తి లభించింది. నాకు విశేషప్రజ్ఞ సిద్ధించింది. ఇప్పుడెంతటి కార్యాలకైనా వెనుదియ్యని శక్తి వచ్చింది. నిస్పృహా నిరాశలకు లోనై చెదిరిపోనున్న మనస్సు, మీ పరిచయభాగ్యంవల్ల ధృఢమయింది. ఇదే నాభాగ్యం. ఇదే వాస్తవమైన సంపద. దీనికంతటికీ మీరే కర్తలు. సీజర్ బార్జియాలు కాదు, ప్రపంచంలో చక్రవర్తులంతా ఏకమైనా నా ఈభాగ్యాన్ని కొల్లగొట్టలేరు."

ఈ రీతిగా భాగ్యహీనులైన ఇద్దరు బందీలకూ రోజులు గడుస్తున్నాయి. రోజులు సుఖంగా గడవకపోయినా, దుర్భరం కాలేదు. ధన నిక్షేపాన్ని గురించి ఇంతవరకూ రహస్యంగా తన మనస్సులోనే ఉంచుకున్న ఫెరయా, ఇప్పుడు నిత్యం దాన్ని గురించే మాట్లాడుతున్నాడు. అతని పక్షవాతం అలాగే ఉంది. ఇంక కోలుకోగలడనే ఆశ పూర్తిగా అంతరించింది. కాని తన మానసపుత్రుడు తప్పించుకున్నట్లు కలలు కంటూ, అతని సౌఖ్యం గురించి ఆకలల్లో ఆనందించేవాడు. ఎప్పుడైనా ఆ ఉత్తరం పోతుందేమోననే భయంతో, డాంటేచేత పదేపదే చదివించేవాడు. చివరికా ఉత్తరంలోని విషయమంతా డాంటేకి కంఠస్థమయింది. అప్పుడు తను వ్రాసిన రెండో కాగితపు ముక్కని కాల్చివేశాడు. ఇప్పుడు మొదటి కాగితం ముక్క ఎవరిచేతులలో పడినా ఫరవా లేదు. రహస్యం బహిర్గతం కాదు. స్వేచ్ఛ లభించినప్పుడు డాంటేకి ఉపకరించగలవనుకున్న విషయాల్ని గురించి ఫెరయా డాంటేకి బోధించేవాడు. స్వేచ్ఛ లభించిన రోజునే, ఆక్షణంలోనే డాంటే మాంట్ క్రిస్టో ద్వీపానికి వెళ్ళిపోడం తప్ప మరొక యోచనే ఉండరాదని చెప్పాడు. ఆద్వీపం వెళ్లి గుహల్లో గుర్తు చెప్పబడిన ఆచోటు వెతకాలి.

ఈలోగా ఘడియలూ రోజులూ గడిచిపోతున్నాయి. చకచకా గడిచిపోకపోయినా కాలం ఇద్దరికీ దుర్భరంగా మాత్రం లేదు. ఫెరయాకి కాలూ చెయ్యీ తిరిగి స్వాధీనంలోకి రాకపోయినా, అతని మేధాశక్తి అవంతైనా క్షీణించలేదు. క్రమక్రమంగా డాంటేకి ఫెరయా నిగ్రహజీవనాన్ని అలవరింపచేశాడు. అల్పవిషయాలలోకూడా అత్యంతశ్రద్ధవహించగల సూక్ష్మపరిశీలనా బుద్ధినీ, ఓర్మినీ డాంటేకి చేకూర్చాడు. నిర్బంధప్రారబ్ధానికి లోనుకాని అన్యులకువలెనే ఈయిద్దరికీకూడా కాలం ప్రశాంతంగా గడిచిపోతోంది. కాని పైపైకి ప్రశాంతంగా రోజులు గడుపుతున్న ఈ యిద్దరూ, ఇద్దరి గదులలోనూ వేరై కూచున్నప్పుడు,

(44-వ పేజీ చూడండి)

అనువాదం: సీతారామ్



౫

భావకవి మంచి పద్యం వింటున్నప్పుడు, ఓ పాతచిత్తరువును చూస్తున్నప్పుడు, ఓ త్యాగరాయకృతి వింటున్నప్పుడు ఏదో హాయిగా ఉంటుంది. కాని అందులో ఏవిధమైన అశాంతిగాని, ఆందోళనగాని, ఆ వేదన గాని ప్రకోపింపవు. అలాంటి నెమ్మదినిమాత్రమే ఆమెతో మాటలాడుతున్నప్పుడు అనుభవిస్తూ వచ్చాను.

ఏ మమకారమూ, స్వత్వాపేక్షా లేని కొత్తరకపు సహవాసం ఎలాంటి భావం కలిగిస్తుందో అంతమాత్రమే నాలోనూ కలిగింది. అంతకుమించి కాదు.

ఆమె ఎవరో నాకు తెలీదు. ఆమెకు మగడో ప్రియుడో వున్నాడో లేడో నాకు తెలీదు. పిల్లాజెల్లా సంసారం ఉన్నదో లేదో అసలు తెలియదు. ఆమెను కేవలం ఆమెగామాత్రమే చూచాను. ఆ చర్చనీయాంశాలలోని గభీరతను లోతుపాతులను చూడ్డంలో నే, ఆమెకు నా అంతరాంతరాలలోని అశాంతినీ, ఆవేదనను చూపడంలో నే, ఆమె జిజ్ఞాసను రేపడంలో నే తహతహ చూపాను.

ఆ అరగంటో, గంటో చర్చ ముగియగనే, ఆమె వెడుతున్నదా లేదా అని చూచుకునేవాడిని కాదు. ఆమె యెక్కడికి, యెలా వెడుతున్నదో నాకు తెలీదు. మిగత కాలమంతా ఎవరితో ఎలా గడుపుతుందో నే నెఱుగను. ఆమె ప్రవర్తన ఎలాంటిదో, ఎలాంటి మిత్రులామెకున్నారో ఎలాంటి చోట్ల ఆమె ఉంటూ ఉంటుందో అనే జిజ్ఞాస నాకు లేదు.

ఒకప్పుడామె నడిచివెళ్ళేది. ఒకప్పుడు బస్సులో పోయేది. ఒకప్పుడు కారులో బయలుదేరేది. ఒకప్పుడో మిత్రునితో పోయేది. మరొకప్పుడామె సహోద్యోగులో, సహానువర్తులో వెంట నడిచేవారు. ఒకాయనమాత్రం పదేపదే ఆమెతో కనిపిస్తుండేవాడు. అతి సన్నిహితంగా వారు మెలగేవారనుకుంటాను.

మరీ ఆమె ఏ ప్రశ్నతోనో తయారయ్యేవరకు, ఆమె అస్తిత్వాన్నే మఱచిపోయేవాడిని. అట్లని ఆమెయెడ ఉపేక్షభావమూ లేదు! ఆమె కనిపిస్తే సంతోషించేవాడినే కాని, ఆమె కనిపించకపోతే కించపడేవాడిని కాదు.

కాని అన్యోన్యం మేము క్రమంగా స్నేహితులమవుతూ వస్తున్నాము. నేనేదో పనిమీద ఉన్నట్టయితే ఆమే 'ఏమిటండీ' అని పలకరించేది. ఒక్కసారి పరధ్యానంలోనుండి తెప్పరిల్లుకొని 'ఏమి' టనగా 'ఆ ఊరికేనే మీ పని చెడగొడదామని' అనేది. నేనూ ఆమె ఏదో తీవ్రంగా ఆలోచిస్తున్నప్పుడలాగే కదిపేవాడిని.

నే నేదో విషణ్ణంగా కనిపిస్తే ఆమె నవ్వించేందు కెంతో ప్రయత్నించేది. కారణ మేమిటో కనుక్కోవాలని తాపత్రయపడేది. ఆమెమాత్రం ఎల్లప్పుడూ నవ్వుతూ తుళ్లుతూనే ఉండేది.

అప్పుడప్పుడు తన సొంత విషయాలు చెప్పాలనుకునేది. పాపం ఏం చెబుతుంది- మా చెల్లెళ్లు గురువారం వచ్చేరు-శనివారం వెడతారు- మేము నిన్నటి రాత్రి వుడ్‌లాండ్సులో పార్టీచేసుకున్నాం-దీపాలారిపోయాయి-కొవ్వొత్తులు వెలిగించుకోవలసి వచ్చింది. అందొకసారి *"There is same thing romantic abont it."* అన్నాను వ్యంగ్యంగా-ఇక అలాంటి మాటలు చెప్పడం మానివేసింది.

ఏదో ఒకవిషయంపై తప్ప ఇలాంటి సంభాషణకు మామధ్య ఎన్నడూ అవకాశం కనిపించేది కాదు. కాని సాంఘిక సమస్యలపైగాని, తాత్త్వికసమస్యలపైగాని మాట్లాడుతున్నప్పటికి జీవితంలో నుంచి చాలఉదాహరణలిచ్చేవాడిని. అలాంటప్పుడు కొన్ని తెలిసిన సంగతులు చెప్పవలసి వచ్చేది. ఇవన్నీ మీ కెలా తెలుసునని ఒకసారి చాల అమాయికంగా అడిగింది. పుస్తకాలతో కాక జీవితంతో కూడా నాకు పరిచయమున్నదని చెప్పాను.

అడపాదడపా కళలూ, కవిత్వం అనే వానిమీద కూడ జీవితప్రాబల్యం ఎలా పని చేస్తుందో మాట్లాడుకునేవారం. కవిత్వం హృదయంలో అశాంతి రేపుతుందంటే ఆమె నమ్మేది కాదు. అసలు లలితకళలంటే అవేవో నిద్రపుచ్చేందుకు, లేదా కష్టపరిసరాలనుంచి మనసును తప్పించేందుకు మాత్రమే వుద్దేశింపబడినవన్న అభిప్రాయం ఆమెకు చాల గాఢంగా ఉండేది. అసలందుకు పూర్తిగా వ్యతిరేకమైన అభిప్రాయాన్ని నేను వెల్లడించేప్పటికి 'చిత్రమైన మనిషే, ప్రతిదీ తలకిందులుగా చెబుతారేమి' టన్నట్టు చూచేది.

సౌందర్యోజ్వలప్రకృతి కూడ జోలపాడదనీ నీ మెదడులో నేదో అశాంతిని, కలతను రేపుతుందనీ చెప్పాను. పద్యం చదివినా, పాటవిన్నా, బొమ్మచూచినా నీకిక ఆ రోజు నిద్రపట్టరాదు. నెమ్మది ఉండరాదు. ఏదో నీ హృదయం అగాధాలలో నుంచి ఒక విస్మృతినది కలచి రేపెట్టాలి. అదే దానిలోని నైశిత్యానికి, సమగ్రతకు గీటురాయి.

నా పద్య మెవరైనా చదివితే దీనితో లోకం పాడైపోతుందనాలి! నా రచనలవల్ల యువకులా వేశపరులై పాడవుతారని, అరా

చక్రవర్తులకు పాల్పడతారనీ అనాలి. లేదా ఈ పద్యంమూలంగా మనసులు మారి యువకు లేదో భావిస్వర్ణయుగానికి వైతాళికు లవుతారనైనా అనాలి. ఈ రెంటిలో ఏది జరుగుతుందన్నా నా కవిత్వం చరితార్థమయిన దనుకుంటాను. కాని చదివి ఆ కాసేపూ తలవూపి తర్వాత దాని నలా మరచిపోయే ఔదాసీన్యం నేను సహించ లేను. అప్పుడు నా రచన వ్యర్థమను కుంటాను. సిగ్గుపడతాను. పుస్తకం చదివి అబ్బ-దారుణం అని విసిరికొట్టాలి. లేదా *We must do something* అని వెంటనే పుస్తకాన్ని అతి సుకుమారంగా జేబులో ఉంచుకొని ఆలోచిస్తూ ఆరుబయటకైనా వెళ్లాలి. ఈ రెంటిలో ఏదీ చేయకుండా పుస్తకం చదివి ఆవులించి బల్లపై మట్టసంగా పెట్టి పాఠకుడు నిద్రపోయాడంటే అంతకంటె దరిద్రపుగొట్టు రచన ఇక పుట్టబోదని అర్థం.

ఈ ధోరణి విని 'నే నెంత మంచి పద్యాలనో ఇతరులు చెప్పేవి చదివాను. పద్యం పూర్తి గాకముందే నిద్రపోయేదా'న్నని చెప్పింది. కొన్ని షెల్లీ పద్యాలు గుర్తుంచి, చదివి తర్వాత చెప్పమన్నాను. మయాకోవస్కీ వరకు పోకుండానే ఏ నిజమైన కవిఅయినా నీ మనసులో తుపాను రేపి తీరుతాడన్నాను. కాని అందుకు కొంత సంస్కారమో, ఆ సమస్యలపై నున్న తీవ్రఅభినివేశమో తప్పనిసరి అని చెప్పాను.

'I fall on the thorns of life and bleed.'

కవిహృదయవీణ కున్న తంత్రులు చాల సున్నితమైనవి. కాబట్టి అతి స్వల్పంగా మొండి మనసులకు కనిపించేవి, అసలు కనిపించనివి కూడ అతను చూస్తాడు. వానితో సంచలితమైన అతని గుండె తంబుర ఝంకారంతో మరింత స్పష్టంగా వానిని విడదీసి మనకు భూతద్దం వేసి చూపిస్తుంది. మన మంతవరకూ చూస్తూనే, గుర్తించలేనివాని విశ్వరూపాన్ని చూచినప్పుడు మన మొండి హృదయ తంత్రులుకూడ శృతికలుపుతాయి. 'నేను సైతం విశ్వవీణకు వెర్రి గొంతుక లిచ్చి మోశాను' అని గర్వించే కవితోపాటు, 'నేనుకూడా కవివిపంచికి మొండిమనసును కలిపి ఏడ్చాను' అని పాఠకుడంటాడు.

శాంతి కళలకు పరమావధి కాదు. అలాగే వట్టి ఆవేశం ఉద్రిక్తతకూడ కాదు. రెంటినీ కలిపికుచ్చిన క్రియారూపప్రేరక నిశ్చితజ్ఞత కళల కాశయ మంటాను నేను. విప్లవకారుని మనసుకూడ శాంతియుతమే. శుష్కోద్రేకి విప్లవకారి కాలేడు. అలాగే చచ్చుసన్యాసి ప్రపంచ సమస్యలకు జడిసి శాంతి శాంతి అని పేకారుతూ తాను శాంతుడ నని అరణ్యాలలో దాగి అనుకోవచ్చును. శాంతి రెండు విధాలు. అశాంతిని పోగొట్టాలనే స్థితప్రజ్ఞతలోని శాంతి నిజమైనది. అశాంతినుండి ముఖం తప్పించుకొని కృత్రిమంగా లోని కుళ్లును కప్పుకు నేందుకై నల్లమందుమత్తులో నున్న శాంతి అసత్యం.

పిరికిపంద శాంతివాది కాడు. అశాంతి కోసమే శాంతిని చెడగొట్టేవాడు విప్లవకారీ కాడు. లోని అంతర్యాన్ని కప్పిపుచ్చి మసిపూసి మారేడుగాయను చేసే పదజాలం చాల ఉన్నది. శాంతి, సత్యం, అరాచకం, అవినీతి ఈ మాటలను లక్షసార్లు ప్రతివాడూ ఉపయోగిస్తాడు. అలాగే స్వతంత్రం, సమానత, లోకకళ్యాణం ప్రతివారూ అంటూనే ఉంటారు. కాని ఒక్కరూ ఆ పదాలలోని అంతుపొంతులను, తా మే విధంగా నిర్వచించుకుంటున్నామన్న పరిశీలనలోనికి వెళ్లరు. కాబట్టే ఎవ రెంత మంచి పదం వాడుతున్నా రన్నదిగాక, ఎవ రెలాంటి పనిని ఎందుకై చేస్తున్నా రన్నదానిపైనే మనం ఎక్కువ దృష్టి నుంచి చూస్తుండాలి.

సంప్రదాయానుగతంగా, పదేపదే విని విని కొన్ని పదాలు మనకుబాగా తెలిసిపోయినట్లుగా వినిపిస్తుంటాయి. ఆ పదాల కర్థ మెవరైనా అడిగితే ఇంత బడుద్ధాయి వేమిరా అని వెంటనే వెక్కిరిద్దా మనిపిస్తుంది. కాని కాస్త తమాయించుకొని ఆలోచిస్తే నిజంగా మనకు వాని అర్థం సరిగా తెలీదు. తెలిసినా ఒకొకరం, ఒకొక అర్థంలో వానిని ఉపయోగిస్తూనైనా ఉంటాము. దేనినైనా నిర్వచనం కొద్దీ చూడాలి. నేనూ స్వతంత్రం కావాలంటాను. మరొకరూ అంటారు - కాని మే మిద్దరమూ రోజూ దెబ్బలాడవలసి వస్తున్నదంటే అర్థ మేమిటి? నా స్వతంత్రం అతనికి అస్వతంత్రత - అతని స్వతంత్రం నా స్వతంత్రానికి ఉరిత్రాడు అని అర్థం. మే మిలా ఒకే పదానికి వేరువేరుగా నిర్వచనా లిచ్చుకో నేందుకు మా వైయక్తిక ప్రకృతిలో కాక సంఘంలో మా యిద్దరి స్థానాలలో ఎక్కువగా మూల కారణాలు కనిపిస్తాయి. శాస్త్రీయవిజ్ఞాన మింత పెరుగుతున్నది. మన పరిసరాలనుగూర్చి, మన మనఃప్రపంచాన్నిగూర్చి ఎన్నో అపూర్వ సత్యాలు రోజూ వెల్లడవుతున్నవి. కాని ఈసత్యాలను మన దృక్పథంలో ఎంతవరకు కలిపి వేసుకోగలుగుతున్నాము. అసలు వైజ్ఞానికుల్లోకూడ తాము తారకలనుగూర్చో, చందమామను గూర్చో, సూర్యమండలం గూర్చో కనుక్కున్న సత్యాలద్వారా తమ తాత్త్వికదృష్టి మారినదా? తమ మతవిశ్వాసాలు మారినవా? లోకంలో మానవు డడుగు పెట్టి ప్రకృతితో పోరాడ్డం ఆరంభించి నప్పుడు తా నేర్పర్చుకున్న భావాలే, ఇన్ని సత్యాల పరిశీలనతర్వాతకూడ అతను గుడ్డిగా ఎందు కనుకరించాలి? గ్రహణ మేమిటో దుర్భిణీయంత్రాలతో విద్యార్థులకు వివరించి, గ్రహణమోక్షణ వేళలో గంగలో మునిగి పితరులకు తర్పణాదులు విడిచి సూర్యుని పట్టుకున్న రాహువుపీడ తొలగిన దని సంతసంతో ప్రాచీనమానవుడు నిట్టూర్చిన మంత్రాల నెందుకు వల్లిస్తాడు?

మన శాస్త్రీయవిజ్ఞానం మన తాత్త్వికాలోచనలను, జీవనదృక్పథాలను మార్చక, అదొక శాఖగా ఇదొక నమ్మకంగా ఉన్నంతదాకా మనిషిఆలోచన సక్రమం కాలేదు. అలాంటి శాస్త్రీయ దృక్పథం కావాలి -

ఇలా లక్షల సంగతులు చెబుతూపోయే వాడిని. ఎలాంటి పారిభాషిక పదాడంబరం లేకుండా, లోకం పాడవుతోంది బాగు పరచలేముర్రా అని మొరపెట్టుకుంటున్న ముగ్ధహృదయ విలాపంలా కవిత్వంలా సాగి వస్తున్న నా మాటలను చూచి నే నే ఒకోమారు దిగ్భ్రాంతుడ నయ్యేవాడను.

మనుష్యుల్లో కొందరు నాలుకతోను, కొందరు కలంతోను, కొందరు చేతులతోను, కొందరు తలతోను, మరికొందరు గుండెతోను ఆలోచిస్తారు కావచ్చును. నేను నాలుకతో ఆలోచించేవర్గంలోని వాడ ననుకుంటాను.

ఆమె ఎంత ఆసక్తితో వినే దని! ఎంత తీవ్రంగా ఆలోచించే దని! ఇతరులతో ఎంత గట్టిగా వాదించే దని! ఆమె మిత్రులలో చాలమందికీ భావాలు సాణ్యం తెలియని సరుకు. వా రేవో గొర్రెదాటు మాటలతో ఈమె నెదుర్కొనేవారు. కాని ఏమైనా చెప్పనీ - 'నా కెందుకో మీ మాటల్లో ఒక సత్యం - ఒక విశ్వాసం - ఒక ఆవేదన కొట్టవచ్చినట్టు కనిపిస్తుంది. వా రెంతవరకూ ఇదేదో చెలగాటంగా భావిస్తారు గాని అభిప్రాయాల దెబ్బలాటతో 'జీవితసంగ్రామం సాగుతున్న దని గమనించనే గమనించరు' అని ఆమె ఒకప్పుడు నాతో అన్నది. కడకువారితో నాయంత చక్కగా చెప్పలేకపోతున్నా నని తన అశక్తతకు నొచ్చుకొనేది. కడ కోసారి తన ప్రియమిత్రునితో వాదించి, అతని అజ్ఞానానికి రెచ్చిపోయి, మొండి వాదానికి జవాబివ్వ లేకకోపోద్రేకంతో 'గెటవుట్' అన్నది.

ఆ సంగతి నాతో చెప్పి, 'మీరయితే అలా అనిఉండేవారు కారు. కాని నా కంత కంటె మరేమీ తోచలేదు' అన్నది.

అందుకని తన మిత్రులను కొందరిని పరిచయం చేసింది కూడ. నవ్వుతూ నే వారి కేదో ఘాటుగా చెప్పేవాడిని. వారిని, వెర్రి వెంగళప్పలుగా చూచేవాడిని. కారణం వారు తక్కువవారని గాదు. జీవితం విలాసవస్తువుగా భావించి బ్రతుకును పాచికగా ఆడుకునేవారి భావాలేవైనా ఒకటేనన్న ఉపేక్ష నాది.

ఈ వర్గంలోని మహామహులు నిన్నటిదాక దేశభక్తుని వేళాకోళం చేశారు. తెల్ల దొరలకు సలాముకొట్టి ఊరేగారు. వారి కరస్పర్శ తమ్మే కాక తమ కుటుంబాలనీ పవిత్రంచేస్తుందని భావించారు. ఒకే రాత్రిలో కాంగ్రెసురాజ్యం రాగానే అయిదవజార్జి పటాల ఫ్రేములలోనే గాంధీ నెహ్రూల బొమ్మలను దోపి కొత్త ముసుగులు కొట్టించారు. అదేనోటితో దేశం కోసం పోరాడిన మహావీరులకు జేజేలు పెడుతున్నారు. కాబట్టి వీరివి అభిప్రాయాలు కావు. వీరు మనుషులు కారు. వట్టి నీడలు. నీడలతో పోట్లాడడం మూర్ఖమో అజ్ఞానమో అవుతుంది.

ఈ మా సఖ్యం క్రమంగా వ్యక్తిగత స్నేహరూపం తాల్చసాగినది. ఆమె వెడుతున్నప్పుడు కూడా కొస్త దూరమైనా వెడదామనిపించేది. కాసేపు దారిలోనే నిలబెట్టి సంభాషణ సాగదీస్తూ ఆలస్యం చేద్దామనిపించేది. ఆమె రాగానే ఎంత త్వరగా వీలయితే అంత త్వరగా మాట్లాడాలని తోచేది. విడిపోతే అదేదో దిగులుగా ఉండేది.

కాని ఈ మైత్రిలో ఏవిధమైన రాగం గాని, ఆవేశంగాని లేదు. ఆనంద మొక్కటే తలముక్కలుగా కనిపించేది. ఒక్కమాటి బిగింపుకాని, ఒక్క కటుభాషణం కాని, ఒక్క చిరుకోపంకాని- నహి - అలాంటి చిలిపితనాని కిందులో చోటు లేదు.

ఏమాత్రం మేము స్త్రీపురుష విభిన్న జాతులకు చెందినవారమన్న జ్ఞానమే లేకుండా - అతి చనువుగా, అతిగభీరంగా, అత్యున్నతస్థాయిలో మెలగుతూ వచ్చాము.

ఈ ఆనందంలో నేనో మహత్తును చూచాను. ఆకాశపు టంచులలో చిత్తరువులు గీసుకొన్నాను.

కాని అంత ఆనందాన్ని చేతులార వ్రక్కలు కొట్టకున్న నా అజ్ఞానానికి తల పగలగొట్టుకోవడం కన్న శిక్ష మరొకటి తోచడంలేదు.

6

ఆరోజొక విందు. చాలమంది మిత్రులు చేరారు. నేనూ వెళ్లాను. ఆమె యెంతో ఉత్సాహంతో పాల్గొంటున్నది. అందరం భోజనాలకు కూర్చోబోతున్నాము. నా ప్రక్కనే ఉన్న కుర్చీ ఖాళీగాఉన్నది. ఆమె యెటు కూర్చోవాలా అని చూస్తున్నది. ఆ ఖాళీస్థలం చూపి ఆమెను కూచోమన్నాను. మే మిద్దరమూ చాల స్నేహంగా ఉంటామని అక్కడున్న వారందరూ ఎరుగుదురు. నే నిలా పిలవడంలో కాని, ఆమె కూర్చోవడంలో కాని ఏ ప్రత్యేకతా వారు చూపరు. కాని ఆమె కూర్చోలేదు. కూర్చోననీ చెప్పలేదు. అటూ ఇటూ చూచి లోనికెళ్లింది. కాసేపటికి పళ్లెరంతో బయటకు వచ్చి నేనున్న వేపుకు చాల దూరంలో ఉన్న మరోబంతిలో వడ్డించ నారంభించింది. నాలుక కొరుక్కుని నంజుతున్నాను.

ఏవేవో కబుర్లు చెప్పుకుంటున్నారందరూ. ఏవో వక్రోక్తులతో చేరినవారందరి దృష్టినీ ఆకర్షించడం, గట్టిగా నవ్వడం నా కలవాటు. అప్పుడివేవీ నా కందుబాటులో ఉన్నట్టు కన్పించలేదు. పరధ్యానంగా ఎవరో అన్నమాట కేదో నవ్వినట్టు నటించడంతప్ప నా కేమీ చేతకాలేదు.

ఆమె సహజంగా పిలవగానే వచ్చి కూచొనిఉండినా, నే నాపాటి మహదానంద మేమీ పొందిఉండేవాడిని కాదని గట్టిగా చెప్పగలను. కాని రాకపోయినంత మాత్రంలో నే నింత ఆందోళన చెందుతున్నందుకు నాలో నేనే సిగ్గుపడ్డాను.

ఆరోజామె నిజంగా చాల అందంగా కనిపించింది. మొట్టమొదటిసారిగా ఆమె స్త్రీత్వాన్నారోజు గుర్తించాను. ఇంతవరకూ ఆమె అందమైనదో వికారమైనదో నామనసుకే తట్టలేదు. ఆమె అంత సన్నిహితంగా కూర్చొని మాటాడున్నప్పుడే మాత్రం తోచని ఆలోచనలు తలలో తిరిగినవి. ఆ కళ్లలో ఏదో వెలుగు గీతలున్నవి. ఎంత చలాకీగా పిల్లలా నడుస్తున్నది!

మరీ అందంగా కనిపించేందుకై ఏమంత సంబరపడి సొగసు చేసుకున్న వన్నెచిన్నెలు లేవు. ఆమెముఖం వేపు గంటలకొలది చూస్తున్నప్పుడు కనిపించని గొంతులోని గొలుసు నామనస్సును లాగివేస్తున్నట్టు కనిపించింది. ఆ గొలుసులో ఏదో ప్రత్యేకత ఉన్నది. దాని రూపురేఖల నామె కోసమే ప్రత్యేకించి సృష్టిచేసినట్టున్నది. అంతతప్ప మరో ఆభరణా లేమీఆమె పెట్టుకోదు. కాని ఆ గొంతుక, ఆ కళ్ళూ, ఆముఖం నిజంగా చాల ఆకర్షకతగల మనిషి అనిపించింది. మెల్లగా ఆమె తిరుగుతున్న వేపు చూపులు సారించాను. ఆమె కనిపించలేదు.

ఆమె కనిపించకపోయినంతమాత్రాన గాని, ఆమె నా ప్రక్కన వచ్చి కూచోనంత మాత్రానగాని నే నెందుకిలా కించపడి పోవాలి? అసలిలాంటి అంశాలను గుర్తించే అలవాటేలేని నాలో ఈ మార్పేమిటి? గాభరాపడిపోయ్యాను. *Every woman is a trap—beware of her* అన్న షా మాట జ్ఞాపకంవచ్చి పెదవి కొరుక్కున్నాను.

స్త్రీత్వాకర్షణకు అందని మగవాడనని

గర్వపడేవారు మా మిత్రులు. వారితో అతి సహజంగా చనువుగా ప్రవర్తిస్తూ వారి అంతరంగిక విషయాలను కూడ వింటూ, వారిలో వివిధమైన సంచలనం కలుగుతున్నదని తెలిసినా ఒక్క ఘాటైన మాటతో, ఒక్క వక్రోక్తితో వారి నోరు నొక్కివేసే అలవాటున్న పాతమనిషి నేనా అని నాకే సందేహం వచ్చింది. నిశితంగా వారి కళ్ళలోకి చూస్తూ నిర్మలమైన వాగ్ఝరితో వారిలో అలాంటి తలపులకే అవకాశం లేకుండా చేసేవాడిని.

ముఖ్యంగా నేనంటే కొంత గొప్పగా చూచేవారి సంగతలా ఉంచి, సమానస్థాయీలోని స్త్రీలతో కూడ అతి ఘాటుగా మాట్లాడడంద్వారా, వారిలోని ఆర్ద్ర ప్రకృతిని ఆదుకొనేవాడిని కాదని చూడ్డంతోనే వారికి తెలిసిపోయేది. వారెవ్వరూ నాజోలికి వచ్చేవారు కారు.

అందులోను వట్టివేషాలు నాకసలు గిట్టవని తెలిసినవారే చాలమంది. పైగా నాకేవో తాత్త్వికసారస్వత విషయాలు తప్ప మిగతవి పట్టవు గనుక వీరితో సంభాషణకే అవకాశం అట్టే కనిపించేది కాదు. మరిప్పుడేమిటి?

“లవఠం” అంటూ చేతులు కడుక్కుంటూ వస్తూన్న ఒక మిత్రుడన్నాడు. ‘భుక్తాయాసం’ అని సాగదీస్తూ లేచి వెడుతున్నాను. ఆమె దారిలో నిల్చున్నది. ఆమెముఖంలోకి చూచాను.

“నన్నర్థం చేసుకోరూ? క్షమించరూ?” అన్నట్టుగా ఆమె ముఖం పెట్టి నా కళ్లలోకి చూచింది. ఆ ముఖభంగిమ నేటికీ నా యెట్టయెదుట కనిపిస్తున్నది. కాని యెలా ఉన్నదో మాటలతో చెప్పి మీ కా ప్రతిమ కనబడేట్టు చేసేంత గొప్ప కవిని కాదు నేను. ఎంత చనువు, ఎంత ప్రాధేయత, ఎంత అశక్తత, ఎంత విశ్వాసం, ఎంత కవిత్వం ఆ కళ్లలో మెరుస్తున్నవని! అంత తక్కువసేపులో అంత సూటిగా గుండెల్లో లకువిషయాలను కూరగల శక్తి ఏ కావ్యానికి కూడ లేదనుకుంటాను. ఆ రెండుకళ్ళూ రెండు కావ్యాలు. ఆనాటినుంచీ ఈనాటిదాకా వానిని చదువుతూనే ఉన్నాను. కానివానితో అంతర్గర్భితమై ఉన్న స్వారస్యాన్నిప్పటికీ అంతో ఇంతో తప్ప, పూర్తిగా ఆస్వాదించలేకపోతున్నాను.

కళ్లతో మాట్లాడ్డం ఎలాంటిదో ఆరోజే చూచాను. మొట్టమొదటిసారిగా ఒక వ్యక్తి మానవభాషలో మాట్లాడించి అర్థంచేసుకొనేలా చేయగలిగింది నన్ను. ఈ చూపులకున్న భావవ్యక్తీకరణపాటవం మాటలకెలా అబ్బుతుంది?

మన తలలో ఒక తీవ్రమైన భావాన్ని రేపడం ఒక్క కావ్యానికీ, సంగీతానికీ మాత్రమే ఉన్నదని ఇందాకా భావించేవాడను. కవిత్వంలో ఉన్న మరుగుగూడ సంగీతంలో ఉండదు. మరి ఈ చూపులకూ నా మనస్సుకూ మధ్య ఉన్న తెర మరింత పలుచనిది. అసలున్నదా అని కూడ అనుమానం.

ఆ కళ్లే మేమి చెప్పాయో కూడ సమగ్రంగా నేను చెప్పలేను. కాని నాకు తెలుసును. అవప్పుడెలా ఉన్నాయో చెప్పలేను. కాని నే నెరుగుదును. నా భాష చాలదు. నన్ను వదిలి మీరే భావించుకోండి.

ఆ క్షణంలో నన్ను నేను మరచిపోయాను. నా కించ గాలికి పోయింది. ఆకసంలో పూలతెప్పలో అలకాపురి పోతున్నాను.

మొట్టమొదటిసారిగా ఆమెను ప్రేమించాను. ఆమెను ప్రేమించానని తెలుసుకున్నాననడం, మరింత సత్యమేమో!

7

ఆ ప్రేమ నన్ను వేధించలేదు. సాధించలేదు. నన్నెంతో ఆనందింపజేసింది. అదో అమాయిక సంతృప్తి ద్యోతకమైనది. ఎండిపోయినగుండె చివురించింది. ఎన్నాళ్ళకెన్నాళ్లకు?

సరిగ్గా పదేళ్లక్రితం నా గుండె ఎండిపోయింది. నవనవోన్మేష మవుతున్న పూలమొక్క తుపానుకు సోలిపోయింది. అంతే. తిరిగి దానిని నాటేందుకు కానీ, నీరు పోసేందుకు కాని నేను ప్రయత్నించలేదు. జీవిత సహచారిణిగా ఉంటుందనుకొన్న ఒక అమ్మాయి ‘నీ తలతిక్క రాజకీయాలు వదిలితే తప్ప మనం కలిసి బతికడం అసాధ్య’మని లక్ష డొక్కతిరుగుడులతో చెప్పివేసింది. ఆనాడనుకున్నాను - ఒక్కరిని ప్రేమించడంలోనే ఆనంద ముంటే అశేష బాధిత ప్రజను ప్రేమించి వారికోసం బాధపడ్డంలో మరింత అనంద ముంటుందని! నా సౌఖ్యంకన్న మరేదో గొప్ప దొకటి నన్నాకర్షిస్తున్నది. దివిటీకోసం చందమామను వదులుకోలేను - వెంటనే ఆమెతో సెలవు తీసుకున్నాను.

ఆనాడే గ్రహించాను, స్త్రీ అపేక్షించేది చాలవరకు సుఖమనీ, అందులోను మానసికంగా కాక, రెండుచేతులా పట్టుకొని చూడవీలయ్యే సౌఖ్య మామెకు కావాలనీ. అట్లని అందరినీ నే ననను. కాని చాలమంది ఇంతే నంటాను. ఇందుకు సంఘంలో వారికొక్క స్వత్వమూ లేకపోవడం, బానిసతనం, తన్ను విలాస వస్తువుగా తయారు చేసిన వాతావరణం ఇవన్నీనూ - వైయక్తికంగా స్త్రీత్వంలోనే సుఖాపేక్ష ఉన్నదని కాదు. మన దేశంలో, మన కాలంలో, మన మేధావి - మధ్యతరగతివర్గంలో ఉన్న స్త్రీ అపేక్షించేది భీమాపట్టా - ఇదే నే నంటున్నది.

ఆ రోజునుండీ నేను సన్యాసినైపోయానని చెప్పడంలేదు. కాని హృదయంలోని ఏ లోతుల్లోకో చొచ్చుకొనిపోయ్యే ఆకాంక్ష, ఆ తీవ్రప్రేమను మరిక అనుభవించలేదు-అందుకై ప్రయత్నించలేదు. చాల మందిని ఆదరంతో చూచాను. వారి ఆదరాన్ని చూఱగొన్నాను. కాని అది హృదయానికి చెందినదీ కాదు - శరీరానికి చెందినదీ కాదు - తలకు మాత్రమే అందునది -

ఒక్కసారిగా నాలో మార్పు వచ్చింది. తిమ్మిరెక్కిన గుండెనుకూడ గిలిగింతలు పెట్టగల ఏదో బలీయమైన శక్తికి లోనైపోయ్యాను. కాని యువకునికిలా అందుతో తల తిరిగిపోలేదు - ఉద్రేక సంభాషణలతో ఉత్తేజక గీతాలతో ఆమెలో ఉడుకెత్తించి సుడిగాలిలా ఎత్తుకొని పోవాలని భావించలేదు.

ఈ ప్రేమలోని అంతుపొంతు లేమిటో, ఇదెంత గాఢమైనదో ఆలోచించి కనుక్కోవా లనుకున్నాను. కొన్ని కథలు వ్రాశాను. అతి వివరంగా మానసిక పరిణామాన్ని వివరిస్తూ. ఇందులో ఏ ఒక్కటీ మభ్యపెట్టలేదు - ఏదో అతిశయోక్తిగా లేనిపోనివి కల్పించలేదు. ఈ వివరణలద్వారా నా మనసునే నేను వెదకి మాచుకుంటూ వచ్చాను. మండుతున్న కొరవిలా కాక, వెలుగుతున్న దివ్వెలా గుండెను మార్చుకునేందుకై ప్రయత్నించాను.

కథలకు అందని తీవ్రభావాలను గీతాలలో పాటలలో చెప్పుకోసాగాను. అవైనా లోతుపాతు లన్నిటిని చూపలేకపోయ్యేవి. కాని ఏదో ఒక బరువు దింపుకున్నట్టుగా అవి రాసిన తర్వాత నిట్టూర్చేవాడిని.

ఆమెకు నేను ప్రేమించానని తెలియదు. తెలిసే సూచన లేమిటినీ నేను చెయ్యలేదు. ఆమెను తిరిగి కలుసుకున్నప్పుడు, యథార్తిగా ఏ సమస్యమీదికో పడిపోయి ఈ సంగతిని మరచిపోయేవాడిని - అంతే కాక బుద్ధిపూర్వకంగా దానిని నెట్టివేసేవాడిని కూడ. సానురాగంగా, సాకాంక్షగా ఒక్కసారి చూచినా ఆమె గ్రహించగల సూక్ష్మబుద్ధిగలదని నాకు తెలుసు. కాని ఆమె మననేమిటో యెరుగక, ఆమెస్థితిగతులేవో తెలియక అనవసరంగా తెలిపి ఆమెనూ నన్నూ కూడ బాధపెట్టుకోవడం నాకిష్టంలేదు.

నే రాసిన కథలను పద్యాలను ఆమెకు వినిపించేవాడిని. చాల ఆసక్తితో వినేది. కొన్ని జీవితానికి చాల దగ్గరగా ఉన్నవని ఆనందించేది. కొన్నిటిని విన్న తర్వాత శూన్యంగా చూచేది. కొన్నిటిని తన '*Pnacdical indm*'కు తోచినరీతిగా విమర్శించేదికూడ. కొన్నిటినిగూర్చి ఏమో నాకు తెలీదు అనేది.

ఏమన్నా నా కిష్టమేగాని, శూన్యంగా చూచినప్పుడుమట్టుకు చాల కోపం వచ్చేది.

సామాన్యంగా ఎవరితోనైనా ఏదైనా చెబితే, నా రేమనకపోయినా, వారి ముఖమో కళ్ళో చూస్తే ఆ భావంతో వారు ఏకీభవిస్తున్నారో, వ్యతిరేకిస్తున్నారో తెలుస్తుంది. కనీసం ఏదో ఒక భావం వారి ముఖంలో ద్యోతకమవుతుంది. అంతే కాని ఏమీ తెలియనీని తటస్థత గోచరించదు. ఈమె ముఖంలో లక్షసార్లలాంటి తటస్థతను చూచాను. గట్టిగా అడిగితే "నాకు తెలీదు- ఏవో కొత్తసంగతులు, కొత్త ధోరణిలో చెబుతారు. నే నింతవరకూ నమ్ముతూవచ్చిన అంశాలను గాలిదుమారంలో తోసివేస్తారు. మరి ఈకొత్తలోని నిజమో అబద్ధమో వెంటనే తెలుసుకునేంత శక్తి లేదు. కాబట్టే ఇలా ఉంటాను. అంతమాత్రంతో వానిని గురించి ఆలోచించ ననుకోకండి. వెంటనే మీ రంటున్నారని నిజమని తలపూచలేను. కాని తప్పకుండా ఇందులో ఏదో తెలుసుకోవలసిన దున్నదని శతధా నమ్ముతాను. కాబట్టే ఆలోచిస్తున్నాను." అనేది.

పాతభావాలు, పాత మనస్థితి కేవలం చెడిపోతే చాలదు - తత్స్థానే కొత్త దృక్పథం ఏర్పడాలి. లేకపోతే ఉన్న నమ్మకాలు చెదరి, కొత్తవి రాని అరాచకస్థితిని మనసు సహించుకోలేదు. అలాంటి శూన్యతే నైరాశ్య నిస్పృహలకు దారితీస్తుంది. అందువల్ల వచ్చే ప్రయోజనం శూన్యం-అని నేను చెబుతూ వచ్చాను.

కాని నా యీ పద్యాల కథలు వింటున్నప్పుడామె నామనసులోని సంఘర్షణను ఏ కొద్దిగానో తప్పక గ్రహించిఉంటుందనుకున్నాను. కాని నా ప్రవర్తలోమాత్రం అలాంటిదేమాత్రం కనిపించకుండా జాగ్రత్త తీసుకున్నాను. కావాలంటే నా చూపులు ఎక్స్‌రేల్లా ఆమె శరీరమంతా ప్రాకేలా చేయగలను. కాని అందుకు ప్రయత్నించలేదు. ఆమెసౌందర్యాన్ని, అంగసౌష్టవాన్ని దొంగచూపులతో తిరస్కరించ సమకట్టలేరు. ఆమెకు నేను ప్రేమిస్తున్నానని తెలిసేంతజీరకూ, ఆమె ఒప్పుకునేంతవరకూ ఆమె ననురాగంతో చూచి లొట్టలు వేయడం చౌర్యంకన్న హేయమని నావిశ్వాసం.

వీటన్నిటిమూలంగానే మాసంభాషణలెవరైనా వింటే, మేము మాటలాడుతున్నప్పుడెవరైనా చూస్తే ఆమె నన్ను చాల ప్రేమతో చూస్తున్న దనుకొనేవారు గాని, నే నామెను ప్రేమిస్తున్నానని ఎంతమాత్రం అనుకొనేవారు కారు.

ఆమెతో సంభాషిస్తున్నంత సేపూ నాలో అపూర్వమైన ఆనందం తొణికిసలాడేది. అది ప్రేమో, స్నేహమో ఎలా అయినా ఒకటే ననిపించేది. ఇంత పరిశుద్ధ మైత్రి కేమి ముప్పు వాటిల్లుతుందో అన్న అగోచర అస్పష్ట భయంకూడ ఈ నా ప్రవర్తనకు కారణమేమో నేచెప్పలేను.

ఇలాగే నేనొక కొంతకాలం గడపగలిగి ఉంటే, ఈకథ మరొకవిధంగా వ్రాయవలసి వచ్చేది. నేను చెప్పకనే ఆమె తనంతటనే తన ప్రేమను నాముందు వెల్లడించే కాలం తప్పకుండా వచ్చిఉండేది. ఒకొక్కక్షణం నాలో ఉద్భూతమవుతున్న మానసిక సంఘర్షణ నన్ను ఊపిరాడ నివ్వడంలేదు. ఆమె చూపుతున్న ఆదరం నన్ను ఊపిరి తిప్పుకోనీలేదు. ఆమెకళ్లు నన్ను వేరొక వస్తువును చూడ నీలేదు.

వీటన్నిటివల్లా, నా అజ్ఞానంవల్లా తొందరపడ్డాను.

నా ప్రేమను దాచకూడ దనుకున్నాను. యాదృచ్ఛికంగా బయటపడిపొయ్యాను.

ఏదో కొత్తగా రాసిన పద్యం చదివి వినిపిద్దామనుకున్నాను.

"నీ పువ్వొకటి కోసి నిండుటెడంద
కదుముకుంటిని దానియందున్న ముల్లు
గ్రుచ్చుకొన్నది, ప్రొద్దు గ్రుంకి చీకటులు
క్రమ్మినయంత పుష్పమ్మె మొ వాడి
పోయెను; నొప్పి యట్లె యుండిపోయె
తావి గుబులొన్న తలిరుపూ లెన్నొ
నీ దాపునకు వచ్చు నింకను, నాకు
సుమములు కోయు కాలము గతియించె
నా గులాబీ పోయె నా నొప్పిమటుకు
నిలిచిపోయినది ఆ నిశయెల్ల."

"అయితే మరి?..." అన్నది.

"ఆ గాయాన్ని మానకుండా చూచుకుంటూ బదుకుతాను" అన్నాను.

"గాయంతోనే తృప్తిపడగలరా?" అన్నది.

"అంతకన్న మార్గం లేనప్పుడు?"

"మార్గముందో లేదో మీ కెలా తెలుసు?"

"అదే మరి బాధ..."

"ఆమాత్రం తెలీకుండానే అవస్థపడ్డం దేనికి?"

"ఆమాట నేనే అడుగుదామనుకున్నాను."

"మరి సంకోచమెందుకూ-నాకైనా చెప్పండి. నేనే ఆమె నెవరినో అడిగి వస్తాను."

"అంత అమాయకురాలవా, అజ్ఞానురాలవా?"

"ఏమిటీ....?"

"నిన్నే ఆమాట అడగా లనుకుంటున్నాను."

"అంటే ఈ పద్యాలన్నీ నన్నుగూర్చి రాశారా?"

"పరిపూర్తిగానూ..."

"ఆఁ..."

ఆమె కాళ్లక్రింద ఏదో భూమి ఏడుమట్ల లోతు క్రుంగిపోయినట్టుగా కళ్లు తేలవేసింది. కన్నులలా విప్పి నా కళ్లలోకి సునిశితంగా చూచి వాల్చివేసింది. మాట పెగిలిరాక ఎంతో బరువుగా అన్నది...

"క్షమించరూ... ఒక్కనైనా నన్నర్థం చేసుకున్నా రనుకున్నాను. నా ఆశనలాగే పోషించరూ?" ఎంత దైన్యం, ఎంత విచారం, ఎంత అనురాగం అందులో తొంగిచూస్తున్నదని!

ఏడవాలో నవ్వాలో నా కర్థం కాలేదు. స్తబ్ధుడనై అలాగే చూస్తున్నాను.

"నేనున్న ప్రత్యేక పరిస్థితులు కారణం కావచ్చునేమో-నాకు సన్నిహితమిత్రులు కావాలి. కాని ప్రేమికులు కాదు......"

నే నలాగే చూస్తున్నాను.

"నేను మీలో అలాంటి భావాన్ని ప్రేరేచానా? అతిసన్నిహితంగా మీరంటే ఎంతో ఇదిగా చూస్తున్నందువల్ల నాకు తెలీకనే అలా ప్రవర్తించానేమో...... కానా?"

ఇక మౌనం సాధ్యంకాలేదు.

"కాదు - నీవల్ల ఏమాత్రం ఆ భావం

(15-వ పేజీ చూడండి)

గల్పిక:

అభివృద్ధిసూచనలు

శ్రీమతి ఇ. సరస్వతీదేవి

ఆ చిన్న తాలూకాలో ఒక మట్టసమైన టౌనుహాలూ, ఒక టెన్నిస్ కోర్టూ, తాను వకీలుగా ప్రాక్టీసు మొదలు పెట్టిన తరువాత అధిక ప్రయత్నముతో ఏర్పరచాడు చంద్రశేఖరము. ఒక క్లబ్బూ, దానికిపాలక వర్గమూ, ఏకీభవించిన సభ్యత్వమూ చక్కగా అమరినాయి. దీనికి ఆదర్శ గ్రామాన్ని నిర్మించినంత సంతోషముతో చంద్రశేఖరము సంతుష్టి చెందాడు. అక్కడి ప్రజల దృష్టిలో చంద్రశేఖరము గొప్పనిర్మాత, సంస్కారి అయినాడు.

ఒక నాడు ఉన్నట్లుండి - ఆ గ్రామములోకూడా కొంతమంది రచయితలనూ కవులనూ సృష్టించాలన్న ఆలోచన అతని మనసులో మెరపులా, మెరసినది. ఆసాయంత్రమే పెద్దలనూ క్లబ్బు సభ్యులనూ సమావేశపరచి తన అభిప్రాయాన్ని తెలిబుచ్చాడు. గ్రామపురోభివృద్ధికి రచనలెంతైనా అవసరమని ప్రోత్సహించాడు.

"ప్రారంభదశలో ఉన్న మన రచనలను ఏ పత్రిక అభిమానిస్తుంది" అన్న శంక ఒక సభ్యుడికి కలిగి వెంటనే బయటికి అనేశాడు.

"అవును ఆమాటా నిజమే కాని ఏ పత్రికో మన రచనలను అభిమానించదని చిన్నబుచ్చుకో నవసరము లేకుండా ఈ గ్రామములో మనమే ఒక సమితి స్థాపించుకొని, ప్రతినెలా సమావేశాలు జరిగించుకుంటూ - ఎవరి రచనలను వాళ్లు ఆ సమావేశములో చదివేటట్లూ ఏడాదికొకసారి ఈ సభ్యులలో ఒకొక్కరి ఉత్తమ రచనను గ్రంథరూపములో అచ్చొత్తించే ఏర్పాటు సమితిపక్షాన చేయాలి. ప్రతిసభ్యుడూ అయిదు రూపాయల మాస చందాను ఇవ్వవలసి ఉంటుంది. ఈ ధనముతోనే అచ్చుఖర్చులను భరించవలసి ఉంటుంది. ఈ తీర్మానాలు నచ్చినవాళ్లు ఈ సమితిలో చేరవచ్చును," అని తన మనసులో మెదులుతున్న అభిప్రాయాన్ని వెలిబుచ్చాడు చంద్రశేఖరము.

ఇది చాలామందికి నచ్చింది. అప్పటికప్పుడే పదిహేనుమంది రుసుము చెల్లించి సభ్యులైనారు. ఆసమావేశములోనే సమితికి 'నవ్యకవితాసమితి' అని నామకరణము చేశారు. పేరు చాలా ముచ్చటగా కుదిరినదని అంతా సంబరపడ్డారు.

ఆ సమావేశము ఆగస్టు నాలుగవ తేదీన జరిగింది. తిరిగి సెప్టెంబరు నాలుగవ తేదీన నవ్యకవితాసమితి సభ్యులైన రామారావుగారి యిట్లో సమావేశముయేటట్లూ సమితి సభ్యులంతాతమతమ రచనలను ఆసమావేశములో వినిపించేటట్లు తీర్మానముచేసి- అందరూ తలా ఒక తమలపాకువిడెమూ తీసుకొని వెళ్లిపోయినారు.

ఈ విధముగా స్థాపితమయిన 'సమితి' నెలకొక సమావేశము జరిగించుకుంటూ, ఏడాది అయేసరికి ఆకవులు తమ రసవంతమైన రచనలను గ్రంథరూపములో అచ్చువేయించుకున్నారు. గ్రథాన్ని అందుకున్న ప్రతివారూ ఆసమితి చేసినసేవకు అబ్బురపడ్డారు.

ఆ రచయితలకు కవులకుమహోజ్వలమైన భవిష్యత్తు ఉన్నదని శుభాకాంక్షలను తెలిపినారు.

నాటినుండీ ఆకవులకు ఎక్కడికి వెళ్లినా నీరాజనాలూ, ఏ ప్రాంతాలకు వెళ్లినా ఆడంబర స్వాగతాలూ సన్మానాలూ- ఏ పత్రికలో చూచినా వాళ్ల పేరులూ ప్రతిష్ఠలూనూ.

గ్రామగ్రామములో వారికీర్తి దిశదిశలా ప్రాకిపోయినది.

సభ్యులు ఆ యశఃకాంతిలో దిగ్భ్రాంతి చెంది తబ్బిబ్బులు కాకుండా తలలు వంచుకొని తమప్రణాళిక ననుసరించి సాగిపోతున్నారు.

ఆ సమితి పక్షానఎందరెందరో ప్రఖ్యాత కవులూ కథకులూ ఆహ్వానింపబడి మన్నన లందుకున్నారు. సుప్రసిద్ధ రచయితలెందరో ఆదేశాలూ సందేశాలూ పంపారు.

ఈ మార్గాన మూడు సంవత్సరాలు నిండేలోపల రెండుగొప్ప గ్రంథాలను అచ్చువేశారు. వారి యశశ్చంద్రికలు తారానాథుని సమీపించటానికి ఒక్క అంగుళమంతదూరమే ఎడమున్నది.

మామూలుగా ఒకనాటి సమావేశములో సభ్యులు తమ పద్యాలనూ రచలనూ చదవటము ప్రారంభించారు. వేణుగోపాలరావు తాను రచించినవి చదువుతున్నాడు. అతడు చదివేటప్పుడు ఎదురుగా కూర్చున్న రామారావు తనప్రక్కనున్న శేషగిరిరావు కాలిని గిరుతున్నట్లుగా అతడికి కనబడ్డది. మరి కొంతసేపటికి కన్ను గీటుతున్నట్లుగా తోచింది. ఎప్పటివలె ఉత్సాహముతో చదవలేక పోయినాడు.

కార్యక్రమము ముగియగానే ఎక్కడివారక్కడికి వెళ్లిపోయినారూ.

త్రోవలో రామారావు తన ప్రక్కనున్న వాళ్లతో అంటున్నాడు. "తన తిక్కనంతా పద్యాలలోకి ఎక్కించి వ్రాస్తున్నాడు. ఆ చదవటమయినా వినసొంపుగా ఉన్నదేమో గమనించారు?"

"అది కాక, తన కవిత్వము ముందర 'అందరినీ దిగదుడుపు' అన్న 'అహం' కూడా బయలుదేరిందోయి మనవాడికి" అని మరొకరు జవాబిచ్చినారు.

ఈ మాటలను వాళ్లు అనుకొనేటప్పుడు నిజానికి అక్కడ ఎవరూ లేరు. గోడలకో చాటకో మరి దేనికో చెవులు ఉండి ఉండాలి - లేకపోతే ఆమాటలు సమితి సభ్యులందరికీ ఎట్లా తెలుస్తుంది? అందులో వేణుగోపాలరావు చెరికి తాజావార్తగా ఎట్లా చేరుతుంది?

ఇంతలో ఆ సభ్యులలో ఒకరింటికి కవి

సోదరులొకరు రావటము తటస్థించింది. మర్యాదకో - మరిదేనికో స్తోత్రసుధను ఆ సభ్యుడికి బాగా అందిచ్చారువాళ్లు. అది తాగినకైపులో ఆ సభ్యుడు 'నాకు తగిన స్థానము కాదండీ యిది. ఇదందా చొప్ప దంటుదళము. పైగా అంతా కుత్సితమూ తల బిరుసుపతమూ కనబడుతుంది. మీరు దూరాన ఉండేవారుకనుక దూరపు కొండలు నునుపుగా కనబడుతున్నాయి. ఏదో ఒకసారి ప్రారంభించాము కనుక వదిలి పెట్టలేక చూస్తున్నాను-" అని అనటము తటస్థించినది.

ఈ వార్త తాజావార్తగా- నాగుపాము విషమువలె సభ్యుల తలలకు ఎక్కినది.

నాలుగవ పుస్తకము రాకముందే ఒకరి యింటిమీద కాకి మరొకరి యింటిమీద వాలలేదు. ఒకరి ఒంటిమీద వాలిన ఈగ కూడా మరొకరి ఒంటిమీద వాలలేదు.

చాటుగా తూర్పారపట్టటమూ, తెగ విమర్శించటమూ- ఎదుట కనపడగానే 'ఓహో!' అనటమూ ప్రారంభమయినది.

సభ్యులంతా ఒకరికి నీతిచెప్పేవారే అయినారు. అందరూ గురివింద గింజల వలెనే ఉంటూ వచ్చారు.

సమితి స్థాపకుడైన చంద్రశేఖరము తనకూ, సూక్ష్మముగా ఆ వ్యాధి ఉన్నట్లు గ్రహించి, వైద్యుల సలహాలవల్ల నయము చేసుకొని, తిరిగి తల ఎత్తకుండాటాని క్కులు సేవిస్తూ, విటమినుమాత్రలను సేవిస్తూవచ్చాడు. సమితి సభ్యులలో ఒకరిని దేశములోగల సారస్వత సంఘాలనన్నిటినీ పరిశీలించి అభివృద్ధిమార్గాలను తెలుకొని పరిరమ్మని పంపినాడు.

ఇక్కడ సమితిస్థితి రోజురోజుకు విషమించిపోతున్నది. కష్టపడి గడించిన పేరుప్రతిష్ఠలు సన్నగిల్లసాగినవి. తమ సభ్యుడు పర్యటన నుంచి ఎప్పుడు వస్తాడా అని ఎదురుతెన్నులు చూస్తున్నదా సమితి.

సమితి ఖర్చులమీద ఆ సభ్యుడు తా ఏదివరకూ చూడని ప్రదేశాలనుచూచి ఆనందించీ కావలసినంత ప్రపంచానుభవము సంపాదించాడు. తాను ఇంకా ఒకటిరెండు దూరప్రదేశాలకు వెళ్లదలచుకున్నందువలన తన అనుభవసందేశము పోస్టుద్వారా పంపాడు.

ఆజాబు సరిగా సభ్యులందరూ సమావేశమయిన సందర్భములో చేరినది.

దేశప్రఖ్యాతి గాంచిన సమితుల యొక్క అభివృద్ధిమార్గాలనూ సూచనలనూ, క్షుణ్ణంగా తాను గ్రహించాడనీ- ఈమధ్య తమ సమితిలో కలిగిన మార్పులు అభివృద్ధి సూచకాలనీ తమ సమితికి మహోజ్వలమైన భవిష్యత్తు ఉన్నట్లుగా తన పర్యటనవలన తనకు తోచినదనీ- తాను త్వరలో రానున్నాడనీ వ్రాశాడు.

ఈ ఉత్తరము చదువుకున్న ఆ సమితి సభ్యులు ఆనందపారావారములో మునిగి తేలుతూ - అందరూ తలా ఒక ఐస్క్రీము ప్లేటూ ఎక్కువ తీసుకున్నారు. ★

ప్రేమించాను

(13-వ పేజీ తరువాయి)

రెచ్చిపోలేదు. నాయంతట నేనే ప్రేమించాను. నీవు ప్రేమిస్తున్నావని తెలిసికాదు. నీవు ప్రేమిస్తావన్న ఆశతోను కాదు. ఇంకో విధంగా చేతకాలేదు. కాబట్టి ప్రేమించాను - ప్రేమిస్తున్నాను కూడ. ప్రేమించకుండా-ఉండలేనుకూడా నేమో? నన్ను క్షమించవూ?......"

మిమ్మల నిలా ఆశగొల్పి మీ హృదయాన్ని నొప్పించానేమో అన్న బాధ నన్ను విడిచిపెట్టదు."

"ఆ విషయంలో నీ వేమాత్రం సందేహపడనక్కరలేదు. ఒకరిపై తప్పు తోసేంత నీచుని కాను. నీ స్వతంత్ర ప్రవర్తనను స్నేహాన్ని నేనేమీ అపార్థం చేసుకోలేదు. అంత అనాగరికుడనూ కాను."

"ఏమో...." దీర్ఘనిశ్వాసం ఆమె శరీరాన్నంతటినీ కుంగదీసింది.

"నీ వేమీ కించపడకు. విచారించవలసిందిందులో ఏమీ లేదు. నీవు ప్రేమించకపోయినంతమాత్రంతో మన స్నేహం చెడిపోదు. మనం మిత్రుల మయ్యాము. మిత్రులంగా ఉన్నాము. ఇక ఎన్నటికీ మిత్రులంగా ఉంటాము."

"ఎవరికి తెలుసు - ఈ ప్రేమకలాపాలతో ఎన్ని ప్రాణస్నేహితాలు పాడవడంలేదు? ఈ స్నేహం అలా అయితే...... నా గతి......"

"ఆ అనుమానం లేదు. మన స్నేహానికీ దీనికీ సంబంధం లేదు. మనం ఆప్తమిత్రులమే..." అని హృదయపూర్వకంగా వాగ్దానం చేశాను. అది వట్టి శుష్కప్రియం కాదని నా గొంతుకే చెబుతున్నది. ఆమెమనసు చెబుతున్నది. ఇక ఏమీ అనలేదు.

కాని తిర్వాత విడిపోతున్నప్పుడామె ముఖంలో విషాదచ్ఛాయలు తొలకరించినవి. నడుం వంగిపోయింది. తా నేదో మహాపరాధం చేసినట్టుగా భావిస్తున్నదనుకుంటాను. మరొకసారి క్షమిస్తారుకదూ అన్నట్టుగా అతిదీనంగా నా కళ్లలోకి చూచి వెళ్లిపోయింది.

నా వాగ్దానాన్నికసర్వదా పరిపాలించాలనుకున్నాను. ఎంతసౌమనస్యంతో ఆమె నా మాటలను గ్రహించింది! ఆమెకు తెలుసు-నే నన్నమాట నిర్వర్తించే నిజాయితీ కలవాడనని తన్నర్థం చేసుకోగలనని చేసుకున్నానని కూడ ఆమె నమ్మకం. ఆమె విశ్వాసాన్ని, నా వాగ్దానాన్ని నిలబెట్టుకునేందుకై ప్రాణార్పణకైనా సిద్ధపడి ఈ క్షణందాకా బతుకునీడ్చుకొని వస్తున్నాను.

★

మేజిస్ట్రేటు : నువ్వు కర్రవిరిగేదాకా వాదిని కొట్టావని ఈ సాక్షి చెబుతున్నాడు. నువ్వేం చెప్పకుంటావు?"

ప్రతివాది: "కర్ర విరగగొట్టాలనే ఉద్దేశం నాకేమాత్రం లేదండి"

ఉజ్జోగం

శ్రీ వేలూరి సహజానందం

“వెధవ ఆఫీసు”

....

“ఛీ... దరిద్రపు ఆఫీసు !”

ఇంట్లో అడుగుపెట్టుతూనే భర్తచేస్తున్న ధూంధాంవిని లలిత వంటింట్లోది వంటింట్లోనే ఉండిపోయింది.

“ఈ కుర్చీ... ఏమిటిక్కడ?”

ఒక్కతన్ను తన్నాడు. అర్థం శుభం ఎరగని కుర్చీ కిర్రుమని మూల్గుకుంటూ మూలకు చేరింది.

అర్థంకాని లలిత హడావిడిగా కూరలో పోపు పెట్టింది.

కాసేపయాక, గదిగుమ్మంలో నుంచుని, “ఏమిటండీ... చికాకుపడుతున్నారు... ఆఫీసంటున్నా రేమిటి?” అని మెల్లగా అడిగింది.

అతను మళ్లీ ఆరంభించాడు.

“వెధవ... మానేజరు.”

“ఏం చేశాడండీ?”

“కిరాతకుడు అక్కౌంటెంటు !”

“అయ్యో... ఏమిటి విషయం?”

“నక్షత్రకుడు టైపిస్టు”

“అబ్బ... అసలు విషయం చెప్పండి.. కూర మాడుతున్నట్టుకూడా ఉంది.”

“ఇప్పుడుకాదులే... చెప్తాగా... వాడిపని...”

“వాడిపని సరే... విషయం ఏమిటో చెప్పడి” అంటూ మాడువాసన హెచ్చుతుండగా ఆమె వంటింట్లోకి వెళ్లిపోయింది.

భోజనాల దగ్గర మళ్లీప్రస్తావన వచ్చింది. కాని భోజన ప్రియత్వంలో తన్మయుడై, అతను చాలానిదానంగా, సరసంగా జవాబిచ్చాడు. “ఏవో... ఆఫీసుగొడవలు లేవే! నీకేం తెలుస్తయ్? వాడున్నాడే... వాడు నీలకంఠుడు, అక్కౌంటెంటు... వాడికి నన్ను చూస్తేగిట్టదు. ఎప్పుడూ ఆమేనేజరుకు నామీద పితూరీలు చెప్పటమే వాడిపని... ఈ గోలకేమిటిగాని... కూర మాబాగా చేశావు.”

“ఎందుకా ఆక్షేపణ...కొన్నిముక్కలు నూడనే మాడె.”

“అబ్బే... నిజంగా...”

మర్నాడు మామూలుగానే పెందలకడే లేచి,వంటప్రయత్నం ఆరంభించింది. కాఫీ తాగి, భర్త వాలుకుర్చీలో కూర్చొని. తాపీగా సిగరెట్టు తర్వాత సిగరెట్టు కాల్చి పారేస్తున్నాడు గాని ఎక్కడా ఆఫీసుకు బయలుదేరే సూచన ఏమీ లేదు.

“వంటైంది...ఇంకా నీళ్లు లేవరేం?” అంది లలిత.

“ఊఁ” అన్నాడతను.

దొడ్లోంచివచ్చి, మళ్లీ చూచేసరికి, ఇంకా పేపరు రెండో పేజీలోనే నిమ



గ్నమై ఉన్నాడు గోపాలం.

"ఏం ఇవ్వాళ ఆఫీసుకు వెళ్లరా?" అని అడిగింది.

"వెళ్లనే వెళ్లను... ఏం?" అన్నాడు.

"ఏమిటీ వింతడవాదం... లేవండి"

"నే వెళ్లనంటే..."

"ఏం... శెలవు పెట్టారా?"

"ఆ... ఏక శెలవు... ఓసి పిచ్చిదానా.. ఆఫీసుకు నాకు రాం రాం అయిందే" అన్నాడు, ఆమె కళ్లలోకి చూస్తూ.

"ఆ!" అని ఆమె నోటమాటరాలేక, గుడ్లప్పగించి చూస్తోంది. ఏదోభయం మనస్సులో మెదులుతూనే ఉంది గాని, భర్త ఈ చావుకబురు చల్లగా చెప్పేప్పటికి, ఆమె ప్రాణాలు ప్రాణాల్లో లేవు. ముఖం తెల్లపోయింది.



మెల్లగా అతను కుర్చీలోంచి లేచాడు.

ఆమెకేమీ అర్థంకాలేదీ మనిషిధోరణి.

మధ్యాహ్నం మస్తుగా నిద్రపోయి లేచాడు. లలితకు మటుకు క్షణంకునుకు పట్టలేదు.

పక్కభాగంలో ఆవిడ, "ఏమండీ... మీవారు ఆఫీసుకు వెళ్లలేదేం?" అంటె ఏం చెప్పుతుంది తాను? ఈయన ఎందుకు మానేసినట్టు! ఒక్క విషయమూ సూటిగా చెప్పటం అంటూ ఉంటేనా? మనసిచ్చి మాట్లాడటమనేది ఏమిటో ఈ జన్మకు ఎరుగడుగదా! ఉద్యోగం పోయినవాడు మరునాడే ఎలాగుర్రు కొట్టుతున్నాడో! డిపాజిట్టు అని కట్టిన ఆ అయిదు వందల రూపాయల సంగతేమిటి? అందులో మూడు వందలు తనతండ్రి కట్టినదే.

"ఏమండీ... డిపాజిట్టుమరి?"

"ఉద్యోగమే పోతే... వెధవ డిపాజిట్టు..." అన్నాడు.

ఆమె కేమీ బోధపడ్లేదు.

"ఉద్యోగం సరే... ఆ అయిదువందలన్నా తెచ్చుకోండి వెళ్లి... దబ్బున కాఫీ చేస్తా."

"చెయ్యి మరిదబ్బున... కొసిని.. పకోడీలు... కూడా." అని గోపాలం ఆప్యాయంగా అన్నాడు.

వంటింట్లోకి వెళ్లింది లలిత. ఉద్యోగం పోయిందనే విచారం లేకుండా, ఈ జిహ్వాచాపల్యం ఏమిటి?

ఫలహారం ముగిసింది. పిచ్చపాటీ కబుర్లు ఆరంభించాడు. ఆఫీసుకు వెళ్లేధోరణే లేదు.

"లేవరేం?" అంది.

"దేనికి?"

"వెళ్లి... ఆ అయిదువందలన్నా తెచ్చుకోండి!" అంది.

"ఊ... అయిదు వందలు..."

"సరే... వేలు పోసుకు కూర్చున్నామేమిటి మనం... ఉన్నదన్నా జాగ్రత్త చేసుకోవాలా?" అంది లలిత, కర్తవ్యం బోధిస్తూ.

"ఉంటేనూ జాగ్రత్తచేసుకోటం" అన్నాడు గోపాలం.

"ఏమిటండీ... అంతా చిత్రంగా మాట్లాడుతారు. మరి ఆడిపాజిట్టు."

"అదేగామరి... నిన్నటినుంచి నేఘోష పెట్టేది... ఆనీలకంఠుడు అయిదు వందలూ కంపెనీకి జమ కట్టాడు."

"కంపెనీకి జమకట్టట మేమిటండీ... నాకేమీ అర్థంకావట్లేదు" అంది లలిత, వ్యాకులంతో.

"ఆ... లేకపోతే ఆడవాళ్ల కివన్నీ తెలుస్తయేమిటి? నీ కెందుకుగాని ఈ గొడవంతా, దబ్బున వంటచెయ్యి....సినిమాకు పోదాం" అన్నాడు గోపాలం ఉషారుగా.

"సినిమాలాగానే ఉంది. శనిపట్టుకుంటె ...అయితే ఆ అయిదు వందలూ వస్తయంటారా? రావంటారా? చెప్పండి!"

"చెప్పతాగాని, ఒక పని చేస్తావా?"

"ఏమిటి?"

"తూర్పుకు ... తిరిగి..."

* * * *

ఉద్యోగం పోవటం చాలా నామర్దా అయినపని అని ఆమెకు తెలుసు. నిరుద్యోగి యొక్క భార్యను ఎంత గౌరవంగా చూస్తారో ఆమెకు తెలుసు. అందుకనే పక్కభాగంఆవిడ పంపుదగ్గర నిలబెట్టి, భర్త ఇంట్లో ఉండటంగురించి అడగ్గా, "నెల్లాళ్లు శెలవు పెట్టారు" అనిచెప్పేసింది, తడుముకోకుండా.

తన సమయస్ఫూర్తికి తానేసంతసించింది.

"అయితే మరి మీ ఊరు వెళ్తారా?"అని అడిగింది శారదాంబ.

అడిగేవాడికి చెప్పేవాడు లోకువ అని ఇందుకే అంటారుగావును. తను ఊరికే వెళ్తుందో, లేక ఉరే పెట్టుకుంటుందో... ఈ గొడవంతా ఈ శారదాంబ కెందుకు?

"లేదండీ!" అని జవాబిచ్చింది.

"అత్తారివూరు వెళ్తారా?" అంది శారదాంబ.

ఒకప్పటికి విడిచిపెట్టేట్టు లేదే? ఏమిటీ కోర్టు - పరీక్ష?

"ఎక్కడికీ వెళ్లమండి... ఇక్కడే ఉంటాం" అంది లలిత.

ఈసారి లలితస్వరం కొంచెం కటువుగా ఉంది. ఇది గ్రహించి పొరుగామె మ[illegible]రు తెరవలేదు.

ఇటూ చూసి బతుకుజీవుడా అని లలి[illegible]గబా తన భాగంలోకి వచ్చేసింది. ఏదో కొండెక్కిదిగినట్టుగా ఉంది పొరుగామెప్రశ్నలకు జవాబిచ్చేప్పటికి. సంధ్య చీకటి కమ్ముతోంది. లైటు వేసింది.

తలుపుకొట్టా రెవరో?

తమ్ముడు శంకరం వచ్చాడు.

ఉభయకుశలోపరి అయాక, "ఏమిటే... అలా ఉన్నావు?" అని అడిగాడు.

"ఏం లేదురా!" అంది.

"బావగారింకా ఆఫీసునుంచి రాలేదా?" అని అడిగాడు.

"నెల్లాళ్లు శెలవు పెట్టారు. స్నేహితులతో పార్కుకు వెళ్లిరావటంతో ఆలస్యంగా వస్తున్నారు" అంది.

(42-వ పేజీ చూడండి)

నాటిక:

కనువిప్పు

శ్రీ సుంకర సత్యనారాయణ

సమయం: పగలు 10 గంటలు

[నాయుడి యిల్లు. అది పదిఅంకణాల మిద్దె. పశువులూ, మనుష్యులూ అందులోనే ఉంటారు. పడసాల కట్ట స్తంభాలకు రెండుఉట్లు కట్టిఉంటాయి. ఒక ఉట్టిలో పాల కుండా, రెండవదానిలో తుజ్జిగకుండా ఉంటాయి. గ్లాసులు, చెంబులు చిందర వందరగా పడిఉంటాయి. నాయుడి భార్యపేరు సీతమ్మ.

ఆ యిల్లాలి వయసు 25. బక్క పలుచగా ఉంటుంది. విశాలమైన కండ్లూ, నుదురూనూ. చాకిరీ చేసిచేసి అలసిఉంటుంది. ఆమెబట్టలు మురికిగా ఉంటాయి. ఎడమ పయిట వేసుకుంది. మూలనున్న సంచిలోని కొర్రలు చేటలోకి తీసుకుంటూ ఉంటుంది. అక్కడే కట్టియున్న దండెంమీద కొన్ని గుడ్డలు, ఒక చెలకోల వేలాడుతూ ఉంటాయి. ఆ కొర్రలసంచి సమీపములో ఒక కొడవలి, త్రాళ్లూ పడిఉంటాయి.]

రామయ్య ప్రవేశం. తల, గడ్డం, మీసాలు నెరసిఉంటాయి. తలకు రుమాల (తలగుడ్డ) భుజాన ఒల్లె. చొక్కా ఉండదు. చేతిలో కర్ర, శరీరం ముడతలు పడి ఉంటుంది.

రామ: (లోనికి ప్రవేశిస్తూ) సీతమ్మా! సీతమ్మా!!

సీత: ఆఁ! ఎవరూ? (అటు చూచి) మీరా (అంటూ కొర్రలచేట అక్కడ వదలి దండెన ఉన్న కంబళితీసి పరుస్తూ) కూచో మామా!

రామ: (కర్ర పడసాలకట్టకు ఆనించి కూర్చుంటూ) ఇప్పుడు కొర్ర లెందుకమ్మా?

సీత: దంచాలి. మొబ్బులో (రాత్రి) కి బియ్యం లేవు.

రామ: ఒక్కదానివి. పనులా గంపెడు. ఎన్నని చేస్తావు. మిసను వేయించుకొస్తే పోనూ.

సీత: అవును, ఎవ రేపిచ్చుకొస్తారు?

రామ: (తల పంకిస్తూ తలకుజుట్టిన రుమాలలోనుంచి ఆకు, వక్క తీస్తూ) సున్నం ఉందా?

సీత: ఆ (అంటూ ప్రక్కనే ఉన్న కుండలోనుంచి సున్నంతీసి మామకు అందిస్తుంది.)

రామ: (సున్నం అందుకుంటూ) అతగాడు ఎక్కడికి పోయినాడు?

సీత: ఏమో, తెల్దు.

రామ: పోయేటప్పుడు అడగలేదా?

సీత: అడిగాను.

రామ: ఏమన్నాడు?

సీత: నాలుగు తిట్టినాడు.

రామ: తిట్టినాడా...ఉహుఁ...దుర్మార్గుడు. వీణ్ణి సాకటానికి నేను పడిన అగచాట్లు......ఆ...దేవుఁడికి తెలుసు. మా అన్నా, నేనూ సవతులబిడ్డలం అయితే నేం. ఒకతల్లిగన్న బిడ్డలు కూడ మాయాకట్ల (మా రీతిగా) కలిసి మెలిసి ఉండేవారు కారు. చిన్నదానివి. నీ కేం తెలుసు ఆ కతంతా?

సీత: మీరు చెప్పితే వినేదాన్నే గాని, అంతకంటె నాకేం తెలుస్తుంది మామా?

రామ: (ప్రక్కన ఉన్న కర్ర అందుకొంటూ) ఏం చెప్పితే ఏం లాభం తల్లీ! ఆ కాలం గడిచిపోయింది. (లేచి) ఆఁ... సరేగాని ఆ కొర్రలు రేపు నేను మిసనుకు వేయించుకొస్తాను. మొబ్బులోకి (రాత్రికి) మా యింట్లో తెచ్చుకో.

సీత: రెండు దినాలనుంచి తెచ్చుకుంటూనేఉంటిని. ఇం కెన్నాలని తెచ్చుకోను.

రామ: పరవాలేదు. ఈ రామయ్య బొందిలో ప్రాణం ఉన్నంత కాలం తెచ్చుకో. (ముందుకు నడుస్తూ) తరవాత సంగతి.........వా డుండాడు.

(మల్లన్న ప్రవేశం. షాహుకారు రంగన్నగారి జీతగాడు. వయసు 35. గడ్డం మాసి ఉంటుంది. చినిగిన పంచె, భుజాన ఒల్లె, బనియను, కాళ్లకు పాత చెప్పులు. సంస్కారం లేక జుట్టు జీబురుగా ఉంటుంది.)

మల్ల: (లోనికి ప్రవేశించి రామయ్యవైపు చూస్తూ) ఏం, సామీ! సిన్నయ్య వచ్చిన్రా?

రామ: ఎవరప్పా నువ్వు?

మల్ల: మల్లన్నను, రామయ్య సామీ! రంగన్నగారి జీతగాన్ని.

రామ: ఎందుకప్పా! మా నాయుడితో నీ కేం పని?

మల్ల: నా కేం పని సామీ! మా రెడ్డి చూసి రమ్మంటే వచ్చినా.

సీత: (ఆతురతతో) ఎవరు! రంగన్న పంపినాడా!

మల్ల: అవును తల్లీ.

రామ: ఉన్న భూమంతా కాజేసినాడుగా నున్నంగ. ఇం కేం పని ఉందిరా మా వాడితో ఆ యప్పకి.

మల్ల: ఏమో, పెద్దోల్ల యవారాలు మా కేం తెలుత్తాయి. "నాయుడు కొర్రలిత్తానని దుడ్లు కొండబోయినాడు. ఇంటికాడున్నాడేమో చూచిరారా. కొర్రలు కొల్చకత్తాం" అన్నాడు. అంతకంటె నా కేం తెల్దు సామీ.

సీత: అయ్యో! కర్మ! కొర్రలా! కొర్రలమ్మినాడా?

రామ: (తల పంకిస్తూ) అమ్మితే డమ్మా అమ్మతాడు. వాని కేమైనా సిగ్గా, బిడిమా? తెగి కూర్చుండాడు. ఈపొద్దు కొర్రలమ్మినాడు. రేపు కొంప అమ్ముతాడు.

మల్ల: మీ చేతికింద ఉన్నన్నాల్లు పది మందిలో "సెబాస్" అనిపించుకొన్నాడా యప్ప. ఇప్పుడు పోకిరీనాయాండ్లజతలు మరిగి చెడిపోయినాడు సామి. ఈ పొద్దుకైన ఆ యప్పతోపాటు గొర్రుతోలే మొగోడున్నాడా మన పల్లెలో. అదంతా మీ నేరుపే.

రామ: ఎవరి నేరు పయితే ఏం లాభం. కడకు "యీనగాసి నక్కలపాలు చేసిన"ట్లయింది.

సీత: ఇంటిలో పావు గింజలు లేకుండా అమ్మినాడు. ఇక నేను ఏ గంగలో కలవను మామా?

రామ: నాయుడు నిన్ను సుఖపెడ్తాడనుకున్నాను. పెంచి పెద్ద జేసినందుకు నాకూ పేరు తెస్తాడనుకున్నాను. కాని యిట్ల నీ గొంతు కోస్తాడనుకున్నా నా తల్లీ! (ఆమె ముఖమువంక తేరిపార జూస్తూ) ఏం అమ్మా! ఇంతకూ నువ్వు బువ్వ తిన్నావా? అట్లుండా వేం?

సీత: (చింతగా) బువ్వ కే మొచ్చెలే మామా!

రామ: తినలే దన్నమాట. పొద్దు పడ

మర తిరుగుతున్నది. పో అమ్మా!పో! రెండు మెతుకులు తిను.

(సీత విచారంగా లోనికి వెళ్లుతూ ఉంటుంది. రామయ్యా, మల్లన్న ఆమెవైపు దీనంగా చూస్తూ ఉంటారు. తర్వాత రామయ్య మల్లన్నవైపు తిరిగి)

రామ: ఈ బిడ్డను చూస్తుంటే నా కడుపు తరుక్కుపోతోంది, మల్లన్నా!

మల్ల: మీకేంటి బాబు. ఈ తల్లికష్టాలు చూస్తావుంటే నాబోటిగాళ్ల పాణమే తరక్కుపోతాఉంది. అబ్బబ్బా! పొద్దు గునుకులు వంచిన నడుం యెత్తకుండ చ్చాకిరీ చేస్తానే ఉంటుంది...సరేగాని బాబు ఆ తల్లి పేరటున్న 5 యకరాల భూమి గూడ...

రామ: అవును మల్లన్నా! అదికూడ నాయుడు మీ రెడ్డికే ఆయకం (తాకట్టు) పెట్టినాడు. మా సీతమ్మవట్టి అమాయకు రాలు. నాయుడు యీబిడ్డకు యేవో తియ్యతియ్యని మాటలు చెప్పి వలలో వేసుకున్నాడు. చల్లగా కాగితంమీద వేలిముద్ర వేయించుకున్నాడు. సీతమ్మ వాని మాటలు నమి నిన్న మొన్నటిదాక యీ సంగతి నాతోగూడ చెప్పలేదు. ఈలోగా వాడు చెయ్యాలిసిన పనేదో చేసినాడు, (తల పంకిస్తూ) ఆయకం పెట్టినాడు. రంగన్నకు ఆయకం పెట్టినాడు., ఈ దినం తినే తినే గింజలుకూడ....

మల్ల: మీరు కష్టపడి సంపాయించి యిచ్చిన పదెకరాలూ, యిల్లాలు పేరటున్న ఐదెకరాల గడ్డా ఆయకం పెట్టినసామికి యీ కొంత్ర లొక లెక్కా? వాములు మేసే సాములికి పచ్చగడ్డి పసాదం బాబు!

రామ: మంచిమాట చెప్పావు మల్లన్న; ఇక బయటపడుతుంది వీడి బతుకూ, బండారమూ.

మల్ల: సరే, పోతాను. మల్లా ఆయన అరుస్తాడు. (రెండడుగులు వేసి) ఆ యప్ప యెప్పుడొస్తాడో తెలియదుగా బాబు?

రామ: ఎక్కడకు పోయినాడో కూడ తెల్దు.

మల్ల: తెల్దా! నే నొక మాట విన్నానయ్యా.

రామ: ఏం విన్నావు?

మల్ల: సిన్నఅయ్య గోవిందపురంలో... (చెప్పటానికి సందేహిస్తాడు.)

రామ: చెప్పు మల్లన్నా! చెప్పు. అనుమానిస్తా వెందుకు?

మల్ల: మరేం లేదు. ఆడ, పెద్ద ఆట ఆడుతున్నారంట. అందులో యీ ... యప్ప...కూ...డా.

రామ: సరి, ఈ యప్పకూడ చేరుకున్నాడు. అంతేనా? మా వంశం చెడబుట్టినాడు. ఆ కొంత్రలమ్మిన నాలుగు దుడ్లూ తగలేసుకొని వస్తాడు. కడకు పది మందిలో తలయెత్తుకు తిరిగేదానికి దారి లేకుండ చేసినాడు.

(సూర్యం ప్రవేశం. వయస్సు 30. నల్లగా ఉంటాడు. అఫ్‌షర్టు. కాళ్ళకు స్లిప్పర్సు. చేతికి గడియారం. వేళ్లకు ఉంగరాలు. టర్కీటవలు. దుబ్బుక్రాపు.)

సూర్యం: (ప్రవేశించి) నాయుడూ! నాయుడూ...

రామ: ఏమి! ఎవరప్పా నీవు?

సూర్యం: సూర్యాన్ని తాతా!

రామ: (కొంచెం విసుగ్గా) ఎందుకు నాయుడు?

సూర్యం: ఏం లేదు. కొద్దిగా...ఆ... ఆః (మల్లన్నవైపు చూస్తాడు.)

మల్ల: (రామయ్యవైపు చూస్తూ) పోతాను సామి!

రామ: సరే; (మల్లన్న వెళ్లిపోతాడు. రామయ్య సూర్యంవైపు తిరిగి) అనుమానిస్తా వెందుకప్పా? ఉండే పనేదో చెప్పు.

సూర్యం: ఏం లేదు తాతా! ఆ మల్లిగాడుండగా యెందుకా అని కాస్త సందేహించాను. నారాయణ కొద్దిగా దుడ్లివ్వాలి. అంతే...

రామ: (ఆశ్చర్యంగా) దుడ్లా! నీకా!!

సూర్యం: నాయుడు మొన్న తన స్నేహితులకు సారా పోయించినాడు. పెద్దవాడివి. మల్లా నీతో అబద్ధం ఎందుకు?

రామ: ఈ షావుకారు జతగాండ్లకు సారా పోయించినాడా? అంతేనా; వాడు కూడ ఏమైనా తాగినాడా?

సూర్యం: అతడు తాగకుండ జతగాళ్లు తాగరుగా! అందుకని......

రామ: వాడు కూడా తాగినాడు. అవునా?

సూర్యం: ఊః... లేదుతాతా:

రామ: నిండా మునిగిన వానికి చలేంటి? ఏపనైనా చేస్తాడు. దానికి నీవేం చేయగలవు? నిజం చెప్పు సూర్యం నిజంచెప్పు.

సూర్యం: ఏదో రవ్వంత తాగినాడు.

రామ: అంతకంటె రవ్వంత విసం తాగి చావకపోయినాడా. వీడు పుట్టినాపొద్దే (పుట్టిన ఆనాడే) చచ్చినా మాకు యింత చింత ఉండేదికాదు.

సూర్యం: నేనూ చెప్పినాను. ఈ లేనిపోని అలవాటు నీకెందుకప్పా అని.

రామ: అట్లనా. నీబోటి బుద్ధిమంతుల జతబట్టే మా...వా...డు...

సూర్యం: నేనేం చేసినాను? ఆ యప్పను తాగమన్నానా?

రామ: అవును. మా బంగారం మంచిదయితే కంసాలోడు ఏం చేస్తాడు.

సూర్యం: బలేమాట చెప్పినావు తాతా! నూరేండ్లు బతుకు.

రామ: ఉః. నూరేండ్లు! యీల బాబు: ఈ దరిద్రం అంతా చూసేటందుకా? సరేగాని; యింతకు వాడు నీకు ఎమి యివ్వాలి?

సూర్యం: ఎంతోనా. నూరు.

రామ: నూరా? నూరు. (వ్యంగ్యంగా) ఇంతేనా?

(చేయి తుడుచుకుంటూ సీతమ్మ ప్రవేశం)

సూర్యం: (సీతమ్మను చూచి) అక్కా! నాయుడు వస్తే నేను కనబడమన్నానని చెప్పు. (జవాబు కెదురు చూడకుండా నే వెళ్లిపోతాడు.)

సీత: ఏమిటి మామా?

రామ: ఏం ఉంటుందమ్మా, దుడ్లకి. అప్పుడే బువ్వ తిన్నావా?

సీత: ఆః... దుడ్లేమిటి?

రామ: ఏమిటా! ఈనడుమ నాయుడు తాగుడుకూడ మొదలుపెట్టినాడు.

సీత: (మాట్లాడకుండా తలవంచుకుని నుంచుంటుంది)

రామ: (ఆమెవైపు తేరిపార జూస్తూ) ఇది నీకు తెలుసు ననుకుంటాను. అవునా?

సీత: తెలుసు మామా!

రామ: (ఆశ్చర్యంగా) నాతో మాట మాత్రమైన యీ సంగతి చెప్పినావు కాదే!

సీత: "నాయనతో చెప్పేవు సుమా!" అన్నాడు.

రామ: ఇంత పిచ్చిదానివి, ఎట్లా బతుకుతావు సీతమ్మా! వాడు వద్దంటే నువ్వు చెప్పకుండా మానుకుంటావా?

సీత: తల్లివైనా నీవే. తండ్రివైనా నీవే. నీకు చెప్పక మరెవ్వరికి చెప్పుకుంటాను. కాని... చెలకోలు జూపి "నాయనకు చెప్పినావా చంపుతా" నన్నాడు. అందుకు జడిసి ఊరుకున్నాను, మామా! (కంట తడి పెడ్తుంది.)

రామ: (విచారంగా) నీయట్లాటి ఇల్లాలిని ఈరీతిగా కష్టపెడుతున్నాడు. వాడికి పుట్టగతు లుండవు. వాణ్ణి నరికినా పాపం లేదు. ఇంతకూ నిన్ను వానికి పెండ్లిచేసినందుకు కొంత ఉసురు నాకూ తగుల్తుంది.

సీత: అట్లనకు మామా! నాకర్మకు ఒకరు ఏంచేస్తారు?

రామ: కర్మ. అయినదానికి, కానిదానికి కర్మ. తెలిసి తెలిసి గంగలో దూకటం కూడా కర్మేనా?

సీత: ఈ పాడుబుద్ధులన్నీ ఇప్పుడు

పుట్టినప్పుడైనా గాని మొదట బాగానే ఉండేవాడుగా.

రాము : అప్పుడే యిట్లా ఉంటే అసలు వానికి పెండ్లెందుకు చేసేవాడిని? (సీతమ్మ మూలనున్న కొడవలి, తాళ్లూ అందుకుంటూ ఉంటుంది.) ఇప్పుడు కొడవలెందుకమ్మా!

సీత : గడ్డికి పోవాలి.

రాము : ఇంత యెండలోనా?

సీత : ఏం చేస్తాను. లేకపోతే ఎనుము (గేదె) పస్తే.

రాము : సరే. (అంటూ, తలపంకిస్తూ, దగ్గుతూ వెళ్లిపోతాడు. సీతమ్మ చిందరవందరగా పడియున్న చెంబులు, గ్లాసులు సర్ది అడవికి (పొలానికి) బయలుదేరుతుంది. వింగుదగ్గరకు వెళ్ళేసరికి బాలయ్య ఎదురుగా వస్తాడు. వయసు 35. కొంచెం లావుగా, పొట్టిగా ఉంటాడు. ఖద్దరు జుబ్బా తొడుక్కున్నాడు. క్రాపు వెనక్కి దువ్వి ఉంటుంది. కాళ్లకు పాపు చెప్పులు. బుజాన ఉత్తరీయం. మిడిగుడ్లు. ఇతడెదురురాగానే సీతమ్మ పక్కకు తొలుగుతుంది.)

బాల : ఎక్కడికి అక్కా! ఎండలో బయలుదేరినావు? (ఆమె చేతిలోని తాళ్లు కొడవలి చూచి) గడ్డికా?

సీత : ఊఁ.

బాల : ఓరి నీ గడ్డిని పారెయ్యా. (తగలెయ్య) ఇంత ఎండలోనా?

సీత : ఎండేమిటి! వానేమిటి!

బాల : నీవు రెయ్యీ పగలు కష్టపడి సంపాదిస్తావు. నాయుడేమో వాని ఇష్టం వచ్చినట్లు నాశనం చేస్తున్నాడు.

సీత : దానికి నన్నేం చేయమంటావు?

బాల : నీ వేం చేస్తావులే పాపం! నమ్ము నమ్మకపో సీతమ్మా! "నీకీ పని తగదురా" అని నాయుడికి ఎన్నితూరులో చెప్పినాను.

సీత : అంతా నాశనం చేశాక ఇంకా మిగిలేది ఏముంది?

బాల : వాడు ఎటు తిరిగినా, పాపం! నీవు ఈ కొంపలో పడి ఉంటున్నావు. నిన్న ఆ కొంపకూడా ఆయకం పెట్టినాడు.

సీత : (విస్తుపోయి) ఆయకమా! ఇల్లా!! ఎవరికి?

బాల : ఇంకెవరికి? ఆ రంగన్నకే.

సీత ! (విచారంగా) అయ్యో! దేవుఁడా! ఇంక నా గతి ఏంకాను?

బాల : విచారపడితే లాభం? ఇప్పటికైనా నీ ఆస్తి నీ చేతికి చిక్కేదోవ ఉంది.

సీత : (ఆశతో) నిజంగానా! (కంబళి చూపిస్తూ) కూచో అన్నా!

బాల : (వెకిలిగా నవ్వుతూ) నేను చెప్పినట్లుగా వినాలిగానీ, పొద్దు మునిగేలోగా నీ భూమి నీకు చెందేటట్లు చేయనూ, పొద్దు మునిగేలోగా - చూడు నా దెబ్బ.

సీత : మా భూమి మాకిప్పిస్తావా; గూట్లో దీపంపెట్టి నిన్ను తలచుకొంటాను అన్నా!

బాల : మరి, నేను చెప్పినట్లు చేస్తావుగా?

సీత : ఏం చేస్తాను, ఆడదాన్ని!

బాల : నా పెండ్లాం వట్టి మొద్దుముండ. దినాం మూలుగుతూ ముక్కుతా ఉంటాది. అది...నీ యట్లాటిదైతేనా...పువుల్లో పెట్టి పూజించనూ!

సీత : అదంతా ఇప్పుడెందుకు?...... భూ...మి......

బాల : అదికాదు. నిజంగా నా సంగతి నీకేం తెలుసు? నేను ఎంత గొప్ప గుణం కలవాడినో మీ కెవ్వరికీ తెల్దు. రంగన్న అంతటివాడు నా మాట కాదనలేడు. నేను గీసిన గీటు దాటలేడు - తెలుసా!

సీత : రంగన్న మా భూమి అన్యాయంగా కాజేసినాడు. అతనిచేత మా భూమి మాకిప్పిస్తానన్నావు.

బాల : భూమి ఇప్పించటమే కాదు. తలచుకుంటే రేపి వేళకు నిన్ను బంగారు పిచ్చుకను చేయనూ. ఇంతకూ నీవు "ఊఁ" అనాలి గాని...

సీత : (విసుగ్గా) అంటే?

బాల : మరేం లేదు. నా మాట వినటమే.

సీత : ఏమిటా మాట?

బాల : నా మాట వింటివా, భూమిదేమి! ఒకటి తక్కువా నీకు (ఒయ్యారంగా నవ్వుతూ చేతులు నలుపుకుంటూ) చీరలు తక్కువా? సొమ్ములు తక్కువా? పువ్వులు తక్కువా? అ...ఇ......

సీత : (ఎగాదిగా చూస్తూ) ఏమిటో, నీ సంగతి నాకు తెలియడంలా.

బాల : తెలియడం లేదా? ఇట్లాటి పిచ్చిదానివి గనుకనే నాయుడు తన ఇష్టం వచ్చినట్లు ఆడిస్తున్నాడు. అసలు సంగతి చెప్తాను. తరవాత నన్ను ముంచినా నీవే, తేల్చినా నీవే. నీ పొందుగోరి అన్నం, నీరు మానుకున్నాను సీతా!

సీత : (ఉగ్రురాలై) ఛీ! గాడిదా! నోరు ముయ్! ఇదా నీ పని? మా సంసారం మంటిలో కలిపావు. చాలక నన్నుకూడ నాశనంచేయాలని చూస్తున్నావా? దాటు! ముందు నా వాకిలి దాటు!

బాల : (చేతులు జాచి, అరకన్ను మూసి) సీతా! ఒక్కసారి, ఒక్క ముద్దు! (అని కౌగలించుకోబోతాడు)

సీత : (లాగి చెంపమీద కొట్టి) నోరు ముయ్ కుక్కా!

బాల : (చెంప సవరించుకుంటూ) ఆఁ... ఆఁ... కొట్టినావా? ఎంత పొగరు! నీ చర్మం ఒలిపించకపోతే నా పేరు బాలయ్యగాదు. (అదిరిపాటుగా వెళ్లిపోతాడు)

(సీత మహాకోపంగా వాడు బయటికి వెళ్ళేవరకు అటు చూస్తూ ఉంటుంది. తదుపరి అక్కడ పరచిన కంబలిపై బడి వెక్కి వెక్కి యేడుస్తూ ఉంటుంది. ఇంతలో బయట చెప్పులచప్పుడు వినబడుతుంది. సీతమ్మ పమిటికొంగుతో కండ్లు తుడుచుకొని లేస్తుంది. నాయుడు ప్రవేశిస్తాడు. వయసు 30. చామనచాయ. అందంగా ఉంటాడు. స్లిప్పర్సు, ఫుల్ షర్టు, చిన్న క్రాపు, బుజాన టవల్, బట్టలు మాసి ఉంటాయి. నిద్రలేని కళ్లు ఎర్రగా ఉంటాయి. నాయుడుని చూడగానే సీతమ్మ లోనికి వెళ్లి చెంబుతో నీళ్లు తెస్తుంది. నాయుడు చెంబు అందుకొని లోనికివెళ్లి, కాళ్లు ముఖమూ కడుగుకొని తిరిగివస్తాడు. దండెం మీద ఉన్న తుండు తీసుకొని సీతమ్మ గడపలో నిల్చి ఉంటుంది. నాయుడు ఆమెచేతిలోని తుండు అందుకుంటాడు.)

నాయు : (కాళ్లు, ముఖము తుడుచుకుంటూ) పరుపు.

సీత : పరుపు దేనికి? బువ్వ తినవా?

నాయు : ఉహుఁ...

సీత : ఈపొద్దయినా రాకపోతావా అని పిడికెడు మెతుకులు వండినాను.

నాయు : ఏడ్చినావులే. నీవు వండిన మెతుకుల కోసం నేను పస్తుండి రావలసింది. కావలిస్తే తిను.

సీత : నేను తినేకేనా వండటం?

నాయు : ఏమిటి నీ యేడ్పు? చెప్పిన పని నోరుమూసుకొని చెయ్యి.

సీత : సరే! (అంటూ లోనికివెళ్లి పరుపు దెచ్చి పరచి దానిమీద దుప్పటి దులుపుతూ) కోరలు కూడా అమ్మేవటగా?

నాయు : అప్పుడే రాణీగారికి టెలిగ్రాం వచ్చిందీ!

సీత : కోరలు కొలువమంటూ రంగన్నగారి జీతగాడొచ్చాడు. లేకపోతే నాకేం తెలుసు. కాలమంతా ముందే ఉంది. ఏం తినాలి?

నాయు : తినకపోతే చావు. నీయమ్మ మగనిసొమ్మా? అమ్ముతాను, లేకపోతే జంగాలకు ధారపోస్తాను. నీ వెవతవు, నన్ను దండించడానికి?

సీత : అడగటం కూడా తప్పేనా?

నాయు : ఛీ! ఛీ!! ఎందులో వేలు

పెట్టినా ఈ ముండయేడుపే కొడుతున్నది. ఎప్పుడూ మొహం పేలాలేగుతూనే ఉంటుంది.

సీత : (విచారంగా కొడవలి, త్రాళ్లు తీసికొని గడ్డికి బయలుదేరి వెళ్లుతూ) సూర్యం సారాయి దుడ్లకొచ్చాడు. చెప్పక పోతే మళ్లా అదొక తంటా. (వెళ్లును)

(నాయుడు పడుకొంటూఉంటాడు. రామిరెడ్డి ప్రవేశం. నాయుని చెలికాడు. చొక్కా, ధోవతి. నాయుని వయసే. క్రాపు, కాళ్లకు చెప్పులు.)

రామి : ఏంరా నాయుడూ! పడుకుంటున్నావా? దుడ్లుపోయె నని విచారంగా ఉందా?

నాయు : విచారమూ లేదు, పాడూ లేదు. రారా రామిరెడ్డీ! (లేచి కూర్చుంటాడు).

రామి : (అటు ఇటు పచారుచేస్తూ) బాలయ్య కనపడలేదా నాయుడూ?

నాయు : లేదురా.

రామి : నిన్న నూరు రూపాయలు రాగానే దొబ్బుకొని వచ్చినాడు. మనకూడా చెప్పలేదురా దొంగనాయాలు.

నాయు : వాడెప్పుడూ అంతేరా. కాని నిన్నరాత్రి ఆడినంత ఆట నేను ఎన్నడూ చూడలేదురా. భలే ఆట!

రామి : అవును. 20 వేల రూపాయల ఆట జరిగిందంటే మాటలా!

(నాగన్న ప్రవేశం. వయసు 50. ధోవతి. తొడుక్కున్న చారల చొక్కాకు గుండీలుండవు. బట్టలు మురికిగా ఉంటాయి. గడ్డం మాసి ఉంటుంది.)

నాగ : (రామిరెడ్డి మాటలు విని) ఏమిటి? ఇరవై వేల రూపాయల ఆటే!

రామి : ఏం నాగన్నా! నీ జీవితంలో ఎన్నడైనా అంత ఆట చూశావా?

నాగ : చూడలేదురా.

నాయు : అవును. నీవు బొట్టు, అర బొట్టు గేటుపెట్టి ఆడే "జాను" తప్ప అంతకు పైఆట ఆడవుగా!

నాగ : అక్కడ ఎంతగేటు పెట్టినా రేమిటి?

రామి : "మినా"కు గేటేమిటి? ఒక్కొక్క దెబ్బకు వేలు... వేలు......

నాగ : వేలా! అయితే కొంప లుండ బట్టదు. ఎంత లావోడైనా నాలుగు రోజులలో దివాలా తీయవలసిందే.

నాయు : (సిగరెట్టు వెలిగిస్తూ) ఒక్క దెబ్బకొట్టినా అందులోనే కొట్టాలి. పెట్టినా అందులోనే పెట్టాలి. ఇక్కడ మన మాదేదికూడా ఒక ఆటేనా! ముండాట.

నాగ : ఇంతకూ మీ రక్కడ పెట్టినారా? కొట్టినారా?

నాయు : కొట్టినాం.

నాగ : కొట్టటమే! యూపాటి?

రామి : గంపెడు.

నాగ : గంపె డేమిటప్పా?

రామి : నుగ్గులు. (పిడకలు)

నాగ : నుగ్గు లేమిటి? పిచ్చినాయాలా!

రామి : మేము కొట్టేవి.

నాగ : అయితే గొప్ప మొగోళ్లే.

రామి : లేకుంటే గెల్చుకొచ్చే ఆచారం ఏ నా డుందని అడిగావు నాగన్నా!

నాగ : ఆమాత్రం తెలుసుకో లేకపోవటం నా బుద్ధి తక్కువేరా బాబు!

రామి : నెమ్మదిగా అంటావేం?

నాయు : కోతినాయాలా, ఏమిటిరా నీయేడుపు?

రామి : నా యేడుపెందుకు? నీయేడుపే కానీ.

నాగ : వాడెప్పుడు అట్లనే వదురుతూంటాడు. నీవైనా చెప్పరా నాయుడూ అక్కడి సంగతులు.

నాయు : అది చెప్పేదికాదు కళ్లున్నవాడు చూడవలసిందే.

రామి : కాళ్లున్నవాడు గోడలు దూకవలసిందే.

నాగ : ఎందుకూ?

రామి : భయపడి.

నాగ : ఎవరికి?

రామి : ఎజ్జుబుట్టలకి.

నాయు : వాటికి నీయట్లా యాదవలు భయపడాలి. నాలుగు దుడ్లు నావి కొదవ కుంటే సరి. వాటి దే ముందిరా.

నాగ : ఆఁ. అట్లనకు. అది వెనకటి కాలం.

నాయు : అదేం గాదు. ఇప్పుడూ అంతే.

నాగ : సరే, ఆ రామాయణం అంతా ఇప్పుడెందుకు గాని ఇంతకు ఒకఆట వేసే దుందా? లేదా?

నాయు : ఏంరా, రామిరెడ్డీ! చీట్లపేక ఉందా?

రామి : చీట్లపేకా లేదు, నోట్లకట్టా లేదు.

నాయు : అయితే ఏడుపు కూర్చొని.

రామి : ఏంజేస్తాం మరి? అంతా నున్నసైనంక.

(నాగన్న లేచి వెళుతూఉంటాడు)

నాయు : ఎక్కడికి నాగన్నా?

నాగ : పేక తెస్తానురా. (వెళ్తాడు)

రామి : దాంతోపాటు దుడ్లు కూడ కొండ్రా. మా ఏడుపు చూస్తానే ఉన్నావుగా.

నాయు : నీ కేమైనా తిక్కపట్టిందా? మంచీ చెడూ లేకుండా వాగుతున్నావు.

రామి : అవును. తిక్కపట్టింది గనకనే నాలుగువేలకు ఆయికంపెట్టి నాలుగునూర్లు తీసుకున్నాను.

నాయు : (కొంచెం కోపంగా) ఏ గాడిదరా నీతో చెప్పినది, నాలుగు నూర్లు తీసుకున్నానని?

రామి : చెప్పినవాడు ఎందుకవుతాడు గాడిద. చేసినవాళ్లం మనంగాని. ఎన్నాళ్లు దాస్తావురా నాయుడూ? నా మొహం చూచి నిజంచెప్పరా. మొన్న నీకు రంగన్న యిచ్చిన దుడ్లెన్ని?

నాయు : ఎన్నో, నీకెందుకా సంగతి?

రామి : నా కెందుకా? స్నేహితుడవు చెడిపోతున్నావని.

నాయు: మిగతా దుడ్లు తరవాత యిస్తానన్నాడు.

రామి: ఆ రోజునే రెండువేలరూపాయ లిచ్చినాడని చెప్పినా వెందుకు?

నాయు : ఏదో చెప్పినాను.

రామి : నీ తెలివిఅంతా ఎక్కడ తగలేసినావురా. తడిగుడ్డతో గొంతులుగోసే ఆ రంగన్న మాటలు ఎట్లా నమ్మినావురా?

నాయు : ఇవ్వకపోతే ఎరగడూ!

రామి : ఏం చేస్తావు? జుట్టు చేతి కిచ్చి.

నాయు : ఆ దుడ్లు తెచ్చేభారం నాదని బాలయ్య ఒప్పుకున్నాడు, లేకపోతే...

రామి : (నవ్వి) బాలయ్యా! "అతని కంటె ఘనుడు ఆచంట మల్లన్న". అసలు నీ కొంప నిలువునా తీసింది వాడు.

నాయు : ఏమిటి వాడు తీసేది? నీ మాదిరిగానే వాడూ ఆటకు వస్తున్నాడు.

రామి : నేనూ జూదమాడుతాను. కాని వాడిలాగా మిత్రద్రోహిని కాను. నీకు త్రాగుడు నేర్పింది వాడు. మొన్న నిన్ను సానికొంపకు ఎక్కించింది వాడు. నీవు ఇంత చెడిపోతావని నే నెప్పుడూ అనుకోలేదురా. ఆ లంజ కొంపలో ఏమని కాలు పెట్టావు?

నాయు : ఏదో గడ్డి తిన్నాను. అయిపోయింది. కాని ఈ సంగతి మా నాయన దాకా పోనీకు. నీకు సలాం పెడ్తాను.

(బాలయ్య ప్రవేశం)

నాయు : (బాలయ్యను చూస్తూ) అసలు నీవు లేకుంటే మజాయే లేదు. రారా బాలయ్యా!

బాల : ఎప్పుడు రావటం? ఏంట్రా గుసగుసలు?

నాయు : ఏమీ లేదు.

రామి : కాదు. ఎవని కొంప తీద్దామా అని.

బాల: అది ఏమంత తేలికైన పని కాదు.

రామి: కాదు గనుకనే ఇద్దరం ఆలోచిస్తున్నాం.

బాల: ఏడ్చినాళ్లే. మీ చేతగాకేం.

రామి: అవును. చేతనైతే నీ మాదిరిగానే ఉండేవాళ్లం.

బాల: అంటే, నేను కొంపలు తీసే వాడి నన్నమాట?

రామి: నాకేం తెలుసు? అది నాయుణ్ణి అడుగు.

నాయు: అరే రామిరెడ్డీ! నీ కేమన్నా మెద డుందా? లేదా?

రామి: అది ఉంటే బాగానే ఉండు.

(నాగన్న ప్రవేశం. చేతిలో పేక ఉంటుంది.)

నాగ: ఏంటి బాగుండేది రామిరెడ్డీ?

బాల: ఏమీ లేదు. వాడికి కొద్దిగా పిచ్చిపట్టింది నాగన్నా!

రామి: అవునప్పా! పెండ్లి కుదిరితేగాని పిచ్చి కుదర దన్నారు. చేస్తావా?

బాల: పెండ్లెందుకు? నాలుగు చెప్పు దెబ్బలు తగిల్తే సరి. అదే కుదురుతుంది.

నాగ: అందాకా దేనికి? చెంపదెబ్బలు చాలు.

నాయు: ఛీ! చెంపదెబ్బ లేమిటిరా. అది ఆడవాళ్ల పని. కుక్కకాటుకి చెప్పు దెబ్బ ఉండాలి.

బాల: (ఉలికిపడి) అసలు మీ స్నేహానికి రావటమే తప్పు. అంతా వట్టి గొడ్లు. (అంటూ రుసరుసలాడుతూ బయటికిపోతూ ఉంటాడు.)

నాయు: బాలయ్యా! బాలయ్యా! (అంటూ లేచి వెళ్లి అతని చేయిపట్టుకుని) కోపం వచ్చిందా? తమాషాగా అనుకున్న మాటలకూ కోపమేనా? (ఈడ్చుకొనివచ్చి పరుపుమీద కూర్చుండబెడతాడు.)

బాల: దేనికైనా ఒక హద్దూ పద్దూ ఉండవలె. నేను కొంపలు తీసేవాడినా?

నాయు: నోటికి ఎంత మాటవస్తే అంత మాట అనటం నీది తప్పేరా రామిరెడ్డీ!

రామి: (నాగన్నవైపు తిరిగి) నెత్తి గడ్డం నెరిసింది. నిజం చెప్పు నాగన్నా! బాలయ్య కొంపలు తీస్తాడని నేనన్నానా?

నాగ: అనా లేమిటి? చిల్లి పేరే తూటు

రామి: బలే! గుమ్మడికాయలదొంగ ఎవరురా అంటే భుజాలు తడుముకొన్నట్లుంది, నీవు చెప్పేమాట.

నాయు: చాలు. అంతటితో నోరు ముయ్యరా.

రామి: మూసుకున్నారా బాబు. (నోరు మూసు కుంటాడు.)

నాగ: అదీ బుద్ధిమంతుని లక్షణం. ఇక వెయ్ పేక.

(అంటూ తన చేతిలోని పేక రామిరెడ్డి కందించుతాడు.)

నాయు: వెయ్యరా రెం డాటలు.

రామి: చిత్తం. (అంటూ పేక కలిపి ముక్కలు వేస్తాడు. అందరు ముక్కలందుకొని చూచుకుంటూ ఉంటారు. నారాయణ ప్రవేశం. బాగా చదువుకొన్నాడు. స్కూలు మాష్టరు. ...పైన ఉత్తరీయం. చేతికి గడియారం. ధోవతి. జుబ్బా. జేబులో పెన్. కళ్లకు అద్దాలు. చిన్నక్రాపు. మీసం. ఇతన్ని చూడగానే నాయుడూ, రామిరెడ్డీ పేకలు అవతల పారవేసి నిలుచుంటారు. అతనిదీ నాయుని వయసే.)

నాయు: ఏం నారాయణా! ఎప్పుడు రావటం?

నారా: పొద్దున బండికొచ్చానురా.

రామి: గుంటూరునుంచేనా?

నారా: అవును.

నాయు: (పరుపు చూపుతూ) కూర్చోరా, నారాయణా!

నారా: కూర్చోటానికేమిలే.

నాగ: ఏం అప్పా! అంతా బాగున్నారా?

నారా: ఆఁ మీ దయవల్ల. (రామిరెడ్డివైపు తిరిగి) ఏం రామిరెడ్డీ! ఏంటి సంగతులు?

రామి: (నవ్వుతూ, చేతులు నలుపుకొంటూ) సంగతుల కేముందలే అప్పా!

నారా: బాలయ్యా! పేకాట బాగా సాగుతున్నదా?

బాల: ఆఁ ఏదో కాలం గడవక...

నాగ, రామి: అంతే ...

నారా: ఏంరా నాయుడూ! బాగా తరిఫీదయినావా ఆటలో? కడకు ఇట్లా తయారయినావు.

నాయు: (లజ్జతో) మనవాళ్లు నలుగురూ ఏదో సరదాగా ఆడుకుందామంటే యీ దినమే.....

నారా: నాకు తెలుసు. నీవు యిస్పేటాకులాటే సంగతి నాకేగాదు. ఈ గ్రామంలో పుట్టిన ప్రతివాడికీ తెలుసు.

బాల: ఏం తెలుసు వాళ్లకి? పూవు పూసిందంటే కాయకాసింది అంటారు.

నాయు: అందులో మన వూళ్ళోవాళ్లు మరీ...

నారా: తట్టుకో! (ఆగు!) అబద్దాలాడటం కూడా బాగా నేర్చుకున్నావురా. పిల్లి కండ్లు మూసుకొని పాలుతాగుతూ తన్నెవరూ చూడటం లేదు అనుకుంటుందట. ప్రజలు నిన్నుగురించి ఏమనుకుంటున్నారో తెలుసా?

బాల: ఏం అనుకుంటున్నారేం?

రామి: అదికూడా అడగాలా? జూదగాండ్లమని.

బాల: అయితే వాండ్లభాగ్యం తేలిపోయింది. ఇదేమైనా దొంగతనమా?

నారా: అంతకంటె అధమం.

(నాగన్న మెల్లగా లేచి వెళ్లిపోతాడు.)

బాల: కాదు. అందరికీ నీమాదిరిగా ఉద్యోగాలు ఎక్కడ దొరుకుతాయి? ఎవరి చేతనైన వ్యాపారం వాడు చేసుకుంటాడు.

నారా: అయితే జూదంకూడా ఒక వ్యాపారమేనా?

బాల: అవును. ఎందుకు కాకూడదు.

రామి: అంతే కాదు. డాఫర్ పని కూడా......

బాల: అట్లా బతికేవాళ్లూ కొల్లగా ఉన్నారు.

రామి: పెండ్లాన్ని సానివాడ కెక్కించి బతికేవాళ్లుకూడా ఉన్నారు.

బాల: ఛీ!......

రామి: (నవ్వుతూ) ఏం? వీటన్నిటి కంటె సులువైన వ్యాపారం రా అది.

నాయు: అరే, రామిరెడ్డీ! పిచ్చిగా మాట్లాడకు.

నారా: అతను చెప్పింది "కరెక్టు". నాయుడూ! (నవ్వుతూ) జూదంకూడా ఒక వ్యాపారమైనప్పుడు......

రామి: జూదంలో దుడ్లు రానూవచ్చు పోనూ వచ్చు. కాని నేను చెప్పినదాంట్లో లాభమే లాభం. నష్టం లేని బిజినెస్, నాయుడూ!

బాల: నోరు ముయ్. నీ కేమైనా బుద్ధి ఉందా? లేదా?

రామి: అదే ఉంటే జూదంకూడా ఒక వ్యాపారం అంటానా?

నారా: స్త్రీని బజారుకు ఎక్కించిన వానికి గౌరవం ఉండదు. జూదగానికీ ఉండదు. వాటిలో ఒకటి తరుగూ కాదు. రెండవది మెరుగూ కాదు. వాళ్లను ప్రజలు అసహ్యించుకుంటారు.

రామి: ఇంతేకాదు. జూదగాడిని, తాగుబోతును ఎంత దగ్గర బంధువులైనా సరే చేరనివ్వరు. వాళ్లు వాకిలిదాటేవరకు నిద్రపోరు.

నాయు : ఎందుకని ?

రామి : ఆఁ, ఏ వస్తువు ఎత్తుకుపోతాడో నని.

బాల : ఈ వెల్లవు నాగన్న సుద్దులన్నీ నాదగ్గర కాదు. అంత బుద్ధిమంతుడవు జూదం ఎందుకు ఆడుతున్నావ్ ?

రామి : అందుకే, ఈ పెద్దమనిషి చీవాట్లు పెడుతూఉంటే తలవంచుకొని ఊరుకొన్నాను. కాని నీ రీతిగా జూదం కూడ ఒక వ్యాపారమని వదరటం లేదు.

బాల : పోవోయ్. అందరు పెద్ద మనుషులే.

నాయు : బాలయ్యా !

బాల : అవునురా. ఎవనికి ఉండే కంత వానికి ఉంటుంది.

రామి : సిగ్గులేక నారాయణకి వంక పెట్ట పోతున్నావా ?

బాల : నారాయణ దేవుడా ?

నారా : కాదు. నేను మనిషినే. పొరపాటుగా ఏదైనా తప్పు చేసినా నేమె చెప్పు దిద్దుకుంటాను.

రామి : చెప్పరా దమ్ములుంటే.

నాయు : ఏంటి చెప్పేది ? జూదం ఆడటం తప్పు అన్నాడు. మానుకుంటె మానుకో. లేకపోతే చావు. చెప్పాలట, ఏంటో చెప్పటం.

బాల : కాదురా, నాయుడూ ! నారాయణ గుంటూరులో ఉద్యోగంచేస్తున్నాడు. అంతమాత్రాన రైతుబిడ్డ కాకుండా పోతాడా ?

నాయు : రైతు బిడ్డ అవునో కాదో, పోనివ్వరా బాబూ; నీకొక నమస్కారం!

నారా : నేను పదహారణాలు రైతు బిడ్డను.

బాల : అయితే నీ పెండ్లాం నడత ఏమిటి మరి ?

నాయు : (బిగ్గరగా) బాలయ్యా !

నారా : ఉండు నాయుడూ. అదేమిటో చెప్పనివ్వు. (బాలయ్యతో) ఏంచేసింది ఆమె ?

బాల : ఏం చేసిందా!దినాం స్నానాలా. తలదువ్వటమా ? పువ్వులు ముడిచి మాయని మడతలు కట్టడమా !

నారా : అంతేనా ? ఇంకా ఏమైనా ఉన్నదా ?

బాల : అది చాలు.

రామి : రైతే. నిజానికి అసలైన రైతు బిడ్డ బాలయ్యే.

నాయు : ఎందుకని ? మడక (నాగలి) దున్నటం చేతకానందుకా ?

రామి : కాదు. వీని పెండ్లాం వారాని కొకసారి కూడ నీళ్లుపోసుకోదు కనుక, తల దువ్వుకోదు కనుక.

(నాయుడు నవ్వుతాడు)

బాల : (కోపంగా) నువ్వు చూచినావా?

రామి : నేను మాడటం ఎందుకు ? రోజూ నీవు ఏడ్చే ఏడుపేగా, 'నా పెండ్లాం వట్టి మొద్దు ముండ' అని.

నారా : నీకు చాల దురలవాట్లున్నాయని తెలుసు. కాని ఇంత అవివేకివని తెలియదు బాలయ్యా !

బాల : ఏమిటి? అవివేకినా ?

నారా : నీవొక్కడవే కాదు. పురుషుడు చలవపంచలు ధరించి బజార్లలో షికార్లు కొడుతూఉంటే, స్త్రీ మురికి దుస్తులతో యమయాతన లనుభవిస్తూ ఇంట్లోపడి, ఇంత చాకిరీచేస్తూ ఉండాలని వాదించే ప్రముఖులు చాలామంది ఉన్నారు. నాగరికుడు భర్త, అనాగరికురాలు భార్య. ఎంత అందంగా ఉంటుంది !

బాల : అట్లాంటివాళ్లు సంసారం చేస్తున్నారు.

రామి : అవును. మావాడు దున్నపోతును, ఎద్దును గట్టి బండితోలినట్లు.

నారా : మంచి పోలిక రామిరెడ్డీ !

బాల : ఇంకేం ? అంతా ఆడమలయాళం చెయ్యండి. -

నారా. ఏమిటి నీ ఉద్దేశం ? స్త్రీలు హాయిగా బ్రతకరాదనా ? ఆమె మనిషి కాదా? ఆమెకు కోరిక లుండవా ? పురుషుడేనా మనిషి ? ఎంత నీచంగా ఆలోచిస్తున్నావు బాలయ్యా !

బాల : (దిగ్గున లేచి) నేను నీచుణ్ణా ? నీచుణ్ణి. సరే, కానీ. చూస్తాను. (వేగంగా వెళుతూ ఉంటాడు.)

నాయు : బాలయ్యా ! బాలయ్యా !

బాల : బాలయ్యా లేదు. గీలయ్యా లేదు. (రివ్వన పోతాడు.)

రామి : పోనివ్వరా. "బతుకు జీవుడా!" అని వాడు బయట పడుతుంటే నీ గోల ఏమిటి వెనక.

నారా : ఎంత మంచి స్నేహితుని సంపాదించావు నాయుడూ !

రామి : స్నేహితుడు గాడు, గురువు.

నాయు: నాకేం గురువు. నీమాదిరిగానే వాడూ వస్తున్నాడు, పోతున్నాడు. (కోపంగా) ఇష్టంవచ్చినట్లు మాట్లాడకు.

రామి : కోపం వచ్చిందా ? అవును. ఉన్నమాటంటే ఉలు కెక్కువ. సరే, పోతాను.

నారా : ఉండు రామిరెడ్డీ !

రామి ; కొద్దిగా పని ఉంది; మళ్లా కలుసుకుంటాను. నాయుడు మిత్రు డెవడో శత్రు వెవరో తెలుసుకోలేకుండా ఉన్నాడు. బాల్యస్నేహితుడవు. నీవైనా చెప్పిచూడు.

(వెళ్లును.)

నారా : ఏరా, నాయుడూ! ఏమి టిది?

నాయు : (తలవంచుకొని మాట్లాడడు.)

నారా : మనము ఒక కంచంలో తిని ఒక మంచంమీద పండుకున్నాం. జ్ఞాపకం ఉందా ?

నాయు : అది ఈ జీవితంలో మరచి పోతానా నారాయణా !

నారా : ఏమో, నీవు నిజంగా ఆ నాయుడివేనా? అతడు ఎంతో మంచివాడు. కన్నవారికి, పెంచినవారికి పేరు తెచ్చినాడు. కాని ఈ నాయుడు......

నాయు : (గద్గదకంఠంతో) నారాయణా ! చచ్చిన పామును ఎందుకు కొడ్తావు?

నారా : పశ్చాత్తాప పడుతున్నావా? ఇది నిజమైన పశ్చాత్తాపమేనా ?

నాయు : (విచారంగా) నీవుకూడ నన్ను నమ్మలేవా?

నారా : నమ్మతాను. తప్పక నమ్మతాను. నేను నమ్మలేంది నాయుణ్ణి కాదు, ఒక జూదరిని.

(రామయ్య ప్రవేశం)

రామ : (ముఖానికి చేయి అడ్డము పెట్టుకొని) ఎవరు నీవు నాయనా?

నారా : నేను నారాయుణ్ణి మామా!

రామ : నీవా? ఇంకా నీకు తెలియదా బాబు? నాయుడు చచ్చిపోయినాడు. (నాయుడివైపు వ్రేలు చూపుతూ) వీడు వాడు కాదు. వీడొక జూదరి! తాగుబోతు.

(నాయుడు లోనికి పోతాడు)

నారా : స్నేహద్రోహం. ఇప్పుడు తాను చేసిన తప్పును తెలుసుకున్నాడు.

రామ : వీడా? (కొంచెము నవ్వి) వీణ్ణి చీల్చినా పాపం లేదు. కసెకు సెంటు భూమి లేకుండా చేసినాడు.

నారా : గడిచినదానికి ఇప్పుడేం చేస్తాం?

రామ : అది కాదు, నారాయణ!సీతమ్మ భూమి, సొమ్ములూ నాశనం చేసినాడు. పైన ఆ పాపను పెట్టే బాధలు ఇన్నీ అన్నీ కాదు.

నారా : సీతమ్మనా?

రామ : (విచారంగా) అవును. ఆ బిడ్డ అగచాట్లు చూడలేకుండా ఉన్నాను బాబూ !

(27-వ పేజీ చూడండి)

సినిమా

సినిమాలలో మేకప్ కళ

★

సినిమాకు సంబంధించిన ఉపకళలలో మేకప్ ఒకటి. ప్రతి సినిమా చిత్రంలోనూ మొదటగా మనంచూసే "క్రెడిట్ టైటిల్స్"లో మేకప్ చేసిన ఆయన ఎవరో ఆయన సహాయకులెవరో తెలుపబడుతుంది. సామాన్య ప్రేక్షకులు డైరెక్టర్లను గురించీ, మ్యూజిక్ డైరెక్టర్లను గురించీ, ఆర్టుడైరెక్టర్లను గురించీ, ఫొటోగ్రాఫర్లను గురించీ తెలుసుకున్నంత శ్రద్ధగా మేకప్ చేసేవారిని గురించి తెలుసుకోకపోయినప్పటికీ మంగయ్య, హరిబాబు, గోపాలరావు మొదలైన పేర్లు ప్రసిద్ధంగానే ఉన్నాయి.

సినిమా చిత్రమన్న తరవాత ఫొటోగ్రఫీ, లైట్లూ ఎంతవిధిగా ఉంటాయో మేకప్ కూడా అంతవిధిగానూ ఉండి తీరుతుంది నటీనటుల మొహాలకు రంగులు వెయ్యాలి, జుట్టు అమర్చాలి. దుస్తులు తొడగాలి. అందంగా కనిపించవలసిన పాత్రలను అందంగా తయారుచేయడమూ, ప్రతిపాత్రకూ దానికితగిన "వయసు," ముఖలక్షణాలూ, శరీరలక్షణాలూ కలిగించడమూ మేకప్‌మాన్ పని. అంటే మామూలు మేకప్ రెండుఅంశాలను పరిగణించాలి: ఒకటి పాత్రధారణచేసేవ్యక్తి, రెండవది పాత్ర.

ఎంత అంద్గత్తె అయినా అందగాడైనా మేకప్ సహాయంతో ఇంకా అందంగా కనపడేలాగుచేసే అవకాశం ఉంటుంది. అంత ఆదర్శప్రాయమైన అందగాళ్ళూ, అందగత్తెలూ ఉండరుగనక నటులముఖాలలో ఉండే కొద్దికొద్ది లోపాలను మేకప్‌తో సరిచేయవచ్చు. ముక్కుకొంచె పెద్దదయినా, పెదవులు మరీ పలచన అయినా, కనుబొమలు మరీ కురుచఅయినా, ఇటువంటి లోపాలను మేకప్‌మాన్ సాధ్యమైనంతవరకు సరిచెయ్యగలడు.

అట్లాగే, ఒకపాత్ర కోపిష్టిదిగా కనపడాలన్నా, క్రూరంగాకనపడాలన్నా, అమాయికంగా కనపడాలన్నా మేకప్ సహాయపడుతుంది. మేకప్‌తో పాత్రకు ఎంతవయసు కావాలంఅంతవయసు ఇప్పించవచ్చు. వేమనలో నాగయ్యా, లింగమూర్తీ కూడా మొదట చిన్నవయసులో కనిపించి అఖరుకు పండిపోయిన ముసలాళ్లలాగా కనిపిస్తారు.

మేకప్‌లో జుట్టుకూ, కట్టుకూ ఉన్న ప్రాముఖ్యం మనందరికీ తెలిసినదే. పల్లెటూరి వాతావరణంలో ఎవరన్నా సూటూ" బూటూ, హాటూ పెట్టుకుంటే "ఏమిటివీడు జోత్తిగా కిరస్తానీవేషం వేశాడు," అంటారు. ఆడది ఒకరకంగాజుట్టు దువ్వి, చీర గట్టితే "పచ్చిబోగంది" లాతయార యుందంటారు. కనక పాత్రపోషణఅన్నది జుట్టూ, కట్టూ, బొట్టూదగ్గిరే ఆరంభమవుతుంది. మేకప్ పాత్రపోషణకు అనుకూలంగాఉండేటట్టు చూసేబాధ్యత మేకప్‌మాన్‌ది.

ఇదిగాక సినిమాలలో ఒక్కొక్కసారి ప్రత్యేకమైన మేకప్ కూడా అవసరమవుతుంది. విడ్డూరమైన పాత్రలు సృష్టించవలసివస్తే ఇటువంటి మేకప్ అవసరం. "నోటర్ డేమ్" చిత్రంలో గూనివాడుపాత్ర ప్రత్యేకమైన మేకప్‌కోరేది. అయితే ఇటువంటి పాత్రలు అరుదు.

మన సినిమాచిత్రాలలో మేకప్‌కు ఉండదగినంత ప్రాముఖ్యం లేదనిచెప్పాలి. దీనికి సహంకారణం పాత్రపోషణకు నేటి సినిమాలలో ప్రాముఖ్యం లేకపోవటమే. ఈనాడు వెలువడేవి జానపదచిత్రాలు. జానపదచిత్రాలలో "సాంఘికవిలువలు" అన్నది మేకప్‌ద్వారా ఎట్లా వ్యక్తమయేదీ ఎవరూచెప్పలేరు. నాయిక సమర్థురాలు కానివ్వండి, అమాయకురాలుకానివ్వండి, దర్పంగలదీ మొండిపట్టుగలదీ కానివ్వండి, ఆమె వేషధారణ కేవలం ఆమె అవయవ సౌందర్యాన్ని ప్రదర్శించడానికి అనుగుణంగా



ప్రకాశ్ వారి "దీక్ష"లో ప్రధాన పాత్ర వహించుతున్న శ్రీమతి జి. వరలక్ష్మిని వేరు వేరు వయసులలో మేకప్ చేశారు.



అశ్వనీవారి "మాయలమారి"లో

★ శ్రీమతి అంజలీదేవి ★

మాత్రమే ఉంటుంది. జానపదచిత్రాలలో వేషభాషలకు సాంఘికనియమా లుండక పోవడం ఆధారంచేసుకుని కొందరు చిత్రనిర్మాతలు తమతారలకు పాశ్చాత్యదుస్తులు తగిలించడంకూడా చేశారు.

కొద్ది జానపదచిత్రాలలోమటుకు పాత్రధారణ సాంఘికచిత్రాలలోలాగే ఉంచడం కూడా జరిగింది. అటువంటి చిత్రాలలో కథానాయిక మామూలుస్త్రీలవలె చీరెలు కట్టుకుంటే కథానాయకుడుమాత్రం చిత్రవిచిత్రమైన దుస్తులు ధరించడం జరిగింది.

చిత్రమేమిటంటే విడ్డూరమైన పాత్రలు సాంఘికచిత్రాలలోకంటె జానపదచిత్రాలలోనే ఎక్కువగా వచ్చే అవకాశం ఉన్నది. అయినా మన చిత్రనిర్మాతలు నటులకు ప్రత్యేకమైన మేకప్ చేయించ ప్రయత్నించడంలేదు. దీనికి కారణం వారికి మేకప్‌గురించి ప్రత్యేకశ్రద్ధలేకపోవడమే. కొన్నిచిత్రాలలో భూతాలను కూడా చూశాం. అయితే ఇవి స్టేజిభూతాల కన్న ఎక్కువశ్రద్ధగా తయారుచేసినవి కావు. వాటికి తగినంత ప్రాముఖ్యంకూడా ఇవ్వబడటంలేదు.

మేకప్‌లోకూడా వాస్తవికతఉంటుంది. అయితే తారలమీద ప్రజలకుగల మోజుమీద ప్రొడ్యూసర్లకుగల మోజుకొద్దీ ఈ వాస్తవికతను పాటించకపోవడం జరుగుతున్నది. ఇరవై ఏళ్లపాటు నడిచేకథ తీసుకున్నప్పటికీ కథానాయిక మొదటఉన్నట్లే చివరా ఉంటుంది. ఆమెకు ఆమెఈడు కుమారుడున్నా మేకప్‌లో మార్పుండదు.

"గొల్లభామ" చిత్రంలో నాయికానాయకులకు అమృతం తాగించి అజరామరులుగా తయారుచేసి వారియవ్వనాన్ని సమర్థించుకున్నారు. మరికొందరు నిర్మాతలు ఇంతబాధ కూడా పడటంలేదు. తమ తారలను "ముసలి" గా తయారుచేస్తే ప్రేక్షకులు సహించరేమోనని నిర్మాతల భయం!

మిగిలిన అన్నికళల విషయంలోలాగే మేకప్‌కళకు కూడా వాస్తవికతే జీవం. మన సినిమాకథలలోనే వాస్తవికత మృగ్యమైనప్పుడు ఉపకళలలో ద్యోతకమవుతుందనుకోవడం భ్రమ; ఒకవేళ ద్యోతకమైనా రాణించదు.

మేకప్‌లో వాస్తవికత లేకపోవడంతోబాటు సహజత్వం కూడా లోపిస్తున్నది. ఈ క్షణంలో రాజకుమార్తెవేషంలో ఉన్న నాయిక మరుక్షణంలో మొహం ఎండిపోయి, జుట్టు రేగిపోయి బికారీవేషం ధరించి, మాసిపోయిన "ఇంకో" చీరెతో కనిపిస్తుంది. ఈ పాత్రయొక్క దుస్థితిని ఏదోరీతిగా మేకప్‌లో ప్రతిబింబించాలనే ఆదుర్దాలో మేకప్ చేసేవాడు, ఈమెకు నట్టడవిలో ఇంకోచీరె ఎట్లా దొరుకుతుందన్న విషయం కూడా ఆలోచించడు. కథానాయకుడి పాత్రను మేకప్ చెయ్యడంలో కూడా ఇటువంటి పొరపాట్లే జరుగుతాయి. ఈ కథానాయకుడు నెలలతరబడి నిద్రాహారాలు లేకుండా అరణ్యంలో తిరుగాడినా గడ్డం మొలవకపోవడం జరుగుతుంది! ఇటువంటి సామాన్యపు పొరపాట్లు మనం సినిమాచిత్రాలలో చూస్తున్నాం. ఇవి కేవలం మేకప్ చేసేవాడి తెలివితక్కువే అయితే మనం పనిపెట్టుకుని విమర్శించనక్కరలేదు. కాని ఈ పొరపాట్లు ప్రస్తుత సినిమాకళలో విధిలేక జరుగుతున్నవి. మన సినిమాచిత్రాలలో వాస్తవికతా, సహజత్వమూ లోపించడంవల్లా, ప్రజలకు సినిమాతారలపై గల వ్యామోహంఆధారంతో ఈ చిత్రాలు డబ్బుచేసుకోవలసివుండడంవల్లా ఇటువంటి పొరపాట్లను మేకప్‌మాన్ చెయ్యవలసినవాడవుతున్నాడు.

ప్రస్తుతం మనసినిమాలలో మేకప్ ఒకందుకే పనికొస్తున్నట్టు కనిపిస్తుంది: సినిమాతారలను సాధ్యమైనంత ఆకర్షవంతంగా ప్రదర్శించేటందుకు. ఇటువంటి ఆశయం ఉండతగినదే గాని మేకప్‌యొక్క ఏకైక ఆశయం ఇదే అయేపక్షాన ఈకళ సినిమాకళ అభివృద్ధికి తోడ్పడజాలదు; అమాయకులైన కుర్రవాళ్లకు తారలపై వెర్రివ్యామోహం కలిగించడానికీ, సినిమాచిత్రాలు తీసేవారికి డబ్బుచేసిపెట్టడానికీ మాత్రమే ఉపయోగపడుతుంది.

★

కను విప్పు

(23-వ పేజీ తరువాయి)

నారా: (తల పంకిస్తూ) చెడిపోయే కాలానికి అన్నీ యిట్లాటి దుర్బుద్ధులే పుడుతూ ఉంటవి. విచారపడకు మామా!

రామ: వీడు పుట్టిన పదిదినాలకే మా వదినె చచ్చిపోయింది. మా అన్న చనిపోయేనాటికి వీనికి నాలుగేండ్లు. ఆనాడు నన్ను తన దగ్గరకు పిల్చుకొని నా చేతులలో పెట్టినాడు. కంట నీరు పెట్టి "నాయుణ్ణి ఎట్లా పెంచుతావో తమ్ముఁడూ!" అన్నాడు. "నా ప్రాణం కంటె ఎక్కువగా చూచుకుంటా, అన్నా!" అన్నాను. పెంచాను. పెద్దవాణ్ణి చేశాను. అదంతా తలుచుకుంటే ... (దుఃఖము నిండివస్తుంది. మాట్లాడలేక పోతాడు.)

నారా: (విచారంగా) నిజమే. కన్న కడుపుకంటె పెంచిన ప్రేమ ఎక్కువ. (గంభీరంగా నా శక్తినంత ధారపోస్తాను. నాయుడు ఎట్లా దారికి రాడో చూస్తాను. పద, మామా! (చేయిపట్టుకొని రామయ్యను బయటికి తీసుకవెళ్లుతాడు. నాయుడు స్టేజి మీదకు వస్తాడు. అక్కడ ఉన్న పరుపు మీద కుప్పలాగ కూలబడి మోకాళ్లమీద తలమోపి విచారపడుతూ ఉంటాడు. బాలయ్య ప్రవేశం.)

బాల: (నాయుడి దగ్గరకు వచ్చి) నాయుడూ! ఏమి జరిగిందిరా? చింతపడుతున్నా వెందుకు? వాండ్లు నిన్ను కూడ అవమానించారా? ఇదంతా వాడు చేసినాడు.

నారా: (తలపైకెత్తి) ఎవ్వడూ చెయ్యలేదు. నేనే చేసుకున్నాను.

బాల: అది కాదురా, కష్టకాలంలో తోడ్పడని స్నేహితుడేక స్నేహితుడా, అని!

నాయు: ఎవ్వరూ తోడ్పడరు.

బాల: ఈబాలయ్య బతికిఉండగా అట్లనకు. వీడు తోడ్పడతాడు.

నాయు: ఏం తోడ్పడతావ్?

బాల: నీ ఆస్తిపోవటానికి కారకుడను నేననేగా వాండ్లనేది. రేపీపాటికి నీఆస్తి నీకు చెందేమార్గం చేస్తాను.

నాయు: ఏమో.

బాల: ఇంతకాలం స్నేహంచేసి నాశక్తి తెలుసుకోలేకపోయినావు. పావుకొరకు రంగన్నకు చెప్పవలసినమాటలు చెప్పినాను. నీఆస్తి నీకు యిచ్చేఏర్పాటు చేసినాను.

నాయు: ఆ! రంగన్నా ఇచ్చేది?

బాల: ఏం? రంగన్న దిగివచ్చినాడా?

నాయు: నిజంగా నాభూమి నాకు యిస్తానన్నాడా?

బాల: నీతో అబద్ధం చెప్పుతానా? నీవు బాధపడుతున్నావని అతని దగ్గర రెండు నూరు రూపాయల నోట్లుకూడా తెచ్చినాను.

(అంటూ తన జేబులోనుంచి రెండు నూరు రూపాయల నోట్లు తీసి నాయుడు జేబులో పెడుతూ ఉంటాడు.)

నాయు: నిజమైన మిత్రుడంటే నువ్వేరా.

బాల: ఆఁ నాదేముంది. అసలు నీ నిజమైన మిత్రుడు రామిరెడ్డి.

నాయు: ఏడ్చేడు. వక్క ఎక్కడ? నాగలోక మెక్కడ? నీ సమర్థత వానికెక్కడుంది?

బాల: పొరపాటు. వాని సమర్థత నీకేం తెలుసు? ఎంత సమర్థత లేనిదే అంత పనికి పూనుకున్నాడూ!

నాయు: ఎంతపనికి?

బాల: నెమ్మదిమీద అదే తెలుస్తుంది. నేను చెప్పడం ఎందుకు?

నాయు: చెప్పవా? అంత రహస్యమా?

బాల: ఏం చెప్పమంటావు నాయుడూ. (అంటూ జేబులోనుంచి సిగరెట్టుపెట్టెతీసి తాను ఒక సిగరెట్టు తీసుకొని ఆ పెట్టెను నాయుడికి అందిస్తాడు. నాయుడుకూడా సిగరెట్టు తీసుకుంటాడు. తర్వాత బాలయ్య జేబులోనుంచి అగ్గిపెట్టెతీసి తన సిగరెట్టు ముట్టించి ఆ అగ్గిపుల్లతోనే నాయుడి సిగరెట్టు ముట్టించుతూ) ఆ సంగతి తలుచుకుంటేనే నా ఒళ్లు గంపెడవుతున్నది. వాడు నీ యింట్లో జేరి...ఎందుకొచ్చిన గోల! పోనివ్వరా బాబు.

నాయు: చెప్పరా, ఉన్న సంగతి ఏమిటో. ఊఁ. నా ఇంట్లో జేరి?...

బాల: పోనివ్వరా. నేను యిప్పటికే నీ సంసారం తీసినాను అంటున్నారు. పైన ఇది కూడా ఎందుకు?

నాయు: నీ మాటలు నాకు బోధపడటం లేదు. నన్ను బాధపెట్టకు. ఉన్న సంగతి ఏమిటో చెప్పు బాలయ్యా!

బాల: నీవు పదే పదే అడుగుతున్నావు గనుక చెప్పుచున్నాను. వాడు నీ భార్యను ...వల...లో... నే

నాయు: ఛా! ఎవడురా అన్నది? వాడు అంత నీచుడు కాడు.

బాల: (వికటంగా నవ్వి) నీకేం తెలుసు నాయుడు? వాని యింద్రజాలం. ఆ రోజు మదరాసులో పీడించి నీచేత రెండు చీరలు కొనిపించినాడు.

నాయు: ఎప్పుడు?

బాల: ఎప్పుడా! మనం ముగ్గురం మదరాసు వెళ్లినప్పుడు. జ్ఞాపకం తెచ్చుకో.

నాయు: (ఆలోచిస్తూ) ఆఁ అవును. కాని అవి మా ఇంట్లోకే.

బాల: ఆ మాత్రం నాకూ తెల్సు. నీ భార్యకు చీరలు తక్కువైతే వానికెందుకు అంత ఆదుర్దా?

నాయు: (నవ్వి) అదా? నీఅనుమానం. అది తనకేదైనా కావలసివస్తే నాతో చెప్పలేక వానితో చెప్పుతూ ఉంటుంది.

బాల: అందులోనే ఉన్నది ఉన్నటిక్కు. నీతో చెప్పమన్నదా లేక నీ జీతగాని మాదిరిగా అక్కడనుంచి ఇక్కడకు చీరలు మోసి తెచ్చి తన కిమ్మన్నదా? ఆలోచించు.

నాయు: ఊఁ సరే.

బాల: అయినా నీదగ్గర లేనిదనువు, వానిదగ్గర ఏమిటిరా నీ పెండ్లానికి?

నాయు: ఏమో! వాడు అంత దుర్మార్గానికి పాల్పడుతాడంటావా?

బాల: అంటావా ఏమిటి! ఊరంతా గొల్లున చెప్పుకుంటున్నారు. చివరకు నిన్న నాపెండ్లాంకూడ ఈ సంగతే అడిగింది. "ఛీ! తిక్కముండా, నోరుమూయ్!" అని గద్దించినాను. పెండ్లాం కనుక దాని నోరు మూయించినాను. కాని ఊరందరినోరు ఎవరు మూయించుతారు?

నాయు: సరి, రానివ్వు ఆ గాడిదను.

బాల: తొందరపడకు. ముందు నీ వస్తువును నీవు జాగ్రతపరచుకో. తరువాత వాని సంగతి ఆలోచించుదాం.

నాయు: దిక్కులేని ముండ అని జాలి తలుస్తుంటే దీనికి పొగ రెక్కింది.

బాల: జాలి దలిస్తే ఆడది నెత్తిన కూర్చుంటుంది.

నాయు: తెలిసింది. (నిప్పులు తొక్కిన కోతిలాగ అటూ యిటూ తిరుగుతూ ఉంటాడు. సీతమ్మ ముచ్చెమటలతో పచ్చగడ్డి మోపు తెచ్చి అక్కడ పడవైచి లోనికి వెళుతుంది. నాయుడు ఆమెను చూడగానే

పండ్లు కొరుకుతూ, దండాన ఉన్న చెలకోల అందుకొని లోనికివెళ్లి సీతమ్మను పిచ్చి పిచ్చిగా కొడుతూ ఉంటాడు. చెలకోల మోత, బాధ నభినయిస్తూ సీతమ్మ నూరేళ్లే మూల్గులు, లంజ, లమిడి అని తిట్టే నాయుడి తిట్లూ వినపడుతూ ఉంటాయి. స్టేజిలోని బాలయ్య నవ్వుతూ ఉంటాడు. కొట్టి కొట్టి నాయుడు సీతమ్మను స్టేజిలోకి పడనెడ తాడు. ఆమె కెవ్వుమంటూ స్టేజీలోకి బోర్లగా పడుతుంది. నాయుడుకూడ స్టేజిలోకి వచ్చి చెలకోల పైకి ఎత్తుతాడు. సీతమ్మమీద దెబ్బ పడబోతూ ఉంటుంది. రామయ్య ప్రవేశం.)

రామ : (బిగ్గరగా) నాయుడూ!

(నాయుడు చెలకోల అవతలకు పారవేస్తాడు. రామయ్య తొందరగా వెళ్లి సీతమ్మను పైకి లేపి ఆమెముఖం మీది నెత్తురు తుడుస్తూ ఉంటాడు.)

బాల: ఏమిటిరా? నాయుడూ! అంతంత దెబ్బలా కొట్టేది?

రామ : ఎవడవురా నువ్వు?

బాల : బాలయ్యను తాతా?

రామ : బాలయ్యావా! పోయి అరంగన్న చెప్పులు తుడవక ఇక్కడికి వచ్చినావు ఎందుకురా?

(అంటూ బాలయ్యవైపుకు వెళుతాడు. సీత మెల్లగా లోనికి వెళుతుంది.)

బాల : తప్పుచేసిన కోడలునూ, దండించిన కొడుకునూ తిట్టు. నన్ను తిట్టుతావెందుకు?

రామ : ఏంచేసిందిరా కోడలు?

(రామిరెడ్డి ప్రవేశం)

నాయు : ఏంచేసిందా? ఆ రామిరెడ్డిగానితో...—

(రామిరెడ్డినాయుడి మాటవిని విస్తుపోయి నుంచుంటాడు)

రామ : నాయుడూ! పురుగులు పడి చస్తావు.

బాల : ఆ రామిరెడ్డిగానితో ఊరేగే కోడలో"

(అని వెళ్లిపోబోతాడు)

రామి : (వింగులోనుంచి ఉగ్రుడై బాలయ్యకు ఎదురుగా వచ్చి కాలి చెప్పు తీసి) ఏ రామిరెడ్డితోరా గాడిద కొడకా? (అంటూ చెప్పుతో బాలయ్య ముహంమీద కొడ్తాడు. బాలయ్య ముఖానికి చేతు లడ్డం పెట్టుకుంటాడు. ఆదెబ్బ బాలయ్యచేతులకు తగులుతుంది. రామిరెడ్డి రెండోదెబ్బ కొట్టడానికి చెప్పు ఎత్తుతాడు. ఇంతలో నాయుడువచ్చి రామిరెడ్డిని పట్టుకుంటాడు. ఇదే సందు అని రామిరెడ్డిని తప్పుకొని బాలయ్య బయటికి పోతూ ఉంటాడు. రామిరెడ్డి. "నీ బతుకు తగలెయ్యా" అంటూ ఒక తన్ను తంతాడు. ఆ తన్నుకు బాలయ్య బోర్లపడి లేచి బ్రతుకు జీవుడా! అని పారిపోతాడు. రామిరెడ్డి నాయుని విదలించి అతని చేతుల్లోనుంచి తప్పుకొని "ఎక్కడికి పోతావురా?" అంటూ బాలయ్యను వెంబడిస్తాడు.)

నాయు : (రామయ్యవైపు చూస్తూ) అసలు కొంపకు తిప్పలు తెచ్చింది నువ్వు.

రామ : నోరుముయ్ గాడిదా!

నాయు : (మహాకోపంగా) నీ మూలాన గాదూ దానికింత పొగరెక్కింది. ఈ రోజు మొదలుకొని నా గడప తొక్కకు.

సీత : ఆఁ ఆఁ అమ్మో! (అంటూ బయటికి వస్తుంది)

రామ : (బిగ్గరగా) నాయుడూ!

నాయు : చావండి. (అంటూ రివ్వన వెళ్లిపోతాడు.)

రామ : గ...డ...ప తొక్కకు(అంటూ బయటికి వెళుతూ ఉంటాడు.)

సీత : మామా!

రామ : వస్తానమ్మా! వస్తాను. ఈ రోజు ఏదో ఒకటి తేల్చుకుంటాను. గడప తొక్కకు (అంటూ వెళ్లిపోతాడు. సీతమ్మ నిర్విణ్ణురాలై మామ పోయినవైపు చూస్తూ ఉంటుంది. నారాయణ ప్రవేశం)

నారా : సీతమ్మా! (సీతమ్మ నారాయణను చూచి కన్నీరు తుడుచుకుంటూ)

సీత : ఎప్పుడొచ్చావన్నా!

నారా : ఏం అమ్మా! విచారపడుతున్నావెందుకు?

సీత : ఏమీ లేదన్నా! వదిన బాగున్నదా?

నారా : ఆ. సరేగాని ముఖాన నెత్తురేమిటమ్మా!

(సీతమ్మ తల వంచుకొని మాట్లాడదు.)

నారా : కొట్టినాడా?

సీత : (మాట్లాడదు.)

నారా : వీనికంటె మృగం మేలు. ఏం జరిగిందమ్మా?

సీత : (గద్గదకంఠంతో) ఏమీ లేదు.

నారా : (విచారంగా) అవును. ఆడదాన్ని కొట్టడానికి కారణ మెందుకు? వీళ్ల దృష్టిలో గాటనున్న ఎనుముకూ, ఇంటిలోని భార్యకూ భేదం లేదు.

(నాగన్న ప్రవేశం. సీతమ్మ అతనిని చూచి లోనికి వెళ్లిపోతుంది.)

నారా : రా, చిన్నాయనా!

నాగ : నాయుడు సీతమ్మను కొట్టినాడట యెందుకు?

నారా : వాడికి పెండ్లామై పుట్టినందుకు.

నాగ : ఆ పాపకు తన పనేమో, తానేమో. వీనికి చేతు లెట్లా ఆడినవో కొట్టడానికి.

నారా : ఏముంది. తమవంటి పెద్దల ట్రైనింగు.

నాగ : అదేమిటి నారాయణా! మేము కొట్టమన్నామా?

నారా : మీరు కొట్టమననూ లేదు. త్రాగమననూ లేదు. జూదమాడ మననూ లేదు.

నాగ : అట్లంటా వేమిటి అప్పా!

నారా : అవును, చిన్నాయనా! నీకు 50 సంవత్సరాల వయసు వచ్చింది. నలుగురు పిల్లలు. పండువంటి సంసారం. నీవు జూదం ఆడుతున్నావు. మీ కండ్లఎదుట పుట్టిన నాయుడూ నేనూ జూదమాడటంలో తప్పేముంది? రేపు నీ పిల్లలు త్రాగుబోతులైతే ఆ తప్పు ఎవరిది? నీదా? వాళ్లదా?

నాగ : అవును. ఆబుద్ధి తక్కువ మాలో ఉందనుకో. కాని ఈ కొట్టటం ఏమిటి?

నారా : అదీ మీచలవే.

నాగ : మా చలవా?

నారా : అక్షరాలా. మీరు మాట్లాడితే ఇల్లాలిమీద చెలకోల ఉపయోగించడం ఒక మగతనంగా భావిస్తారు. ఆ వీరపురుషుల గాథలు కథలల్లి మాకు చెప్తుతూ ఉంటారు. మేమూ అల్లాగే తయారవుతున్నాం. నేను అంటున్నానని కోప్పడకు చిన్నాయనా!

నాగ : పైగా కోపమెందుకు బాబూ? నీవు చెప్పిందాంట్లో అబద్ధం ఏముంది?

(నాయుడు, రామిరెడ్డి ప్రవేశం)

నాయు : వాని నెత్తురు కళ్ల చూడనిదే నిద్రపోను.

రామి : తొందరపడకు నాయుడూ! తొందరపడకు.

నాగ: ఎవడి నెత్తురు?

రామి : ఆ బాలయ్యగాడిది.

నారా : ఎందుకు?

రామి : వాడు సీతమ్మను ఏదో అన్నాడు. ఆమె చెంప పగుల గొట్టింది. ఆ కక్ష తీర్చుకోడానికి వాడు నాకూ, సీతమ్మకూ......

నారా : చాలు,. తెలిసింది. ఆ మాటలు నమ్మి నాయుడు సీతమ్మనుహింసించినాడు.

నాయు: (అక్కడే పడిఉన్న చెలకోల అందుకుంటూ) అవును. ఈ నాయుడు మనిషి కాదు నారాయణా! (చెలకోల నారాయణకందిస్తూ) మృగం. దీనితో వీడి చర్మం వొలువు. అంటూ కండ్లు మూసుకొని నారాయణ కెదురుగా నిలుచుంటాడు.

నారా: (నాయుణ్ణి క్రిందికి మీదికిపరికించి అతని వెన్ను చరుస్తూ) ఆ ద్రోహి నీకు కీడు తలపెట్టనాడు, అది మేలైంది. ఇప్పటికైనా కళ్లు తెరువు నాయుడూ! కండ్లు తెరవు.

నాగ: ఆ దొంగనాయాలే నాతో నాయుడు సీతమ్మను కొట్టినాడని చెప్పింది. అసలు ఈ కతంతా ఎట్టా గడ్డ కొచ్చింది.

రామి: ఇక్కడనుంచి పోయి తాను చేసిన ఘనకార్యం షావుకారు రంగన్నకు చెప్పుకొంటున్నాడు బాలిగాడు. సమయానికి అక్కడకు వెళ్లిన నాయుడు చాటున ఉండి అదంతా విన్నాడు.

నారా: ఎంత ఘోరం!

నాగ: పాపం బయట పడక దాగుతుందా!

రామి: ఏం బయట పడుతుంది? నాలుగు వేలకు భూమి ఆయకం పెట్టించుకొని నన్నూరు చేతిలో పెట్టినాడు రంగన్న.

నాగ: ఎవరికి?

రామి: మనవాడికే.

నారా: అవునా నాయుడూ? ఎంత పిచ్చిపని చేసినావురా!

రామి: చేసినాడు. అయిపోయింది, మళ్లీదాన్ని సాధించటం ఎట్లాగా అని?

నారా: నిజమే ఈ అన్యాయాన్ని ఆరికట్టి తీరవలె. పదిమందినీ ఏకం చేసి ఈ అన్యాయాన్ని ఎదిరించుదాం.

రామి: అవును. తప్పకుండా న్యాయం తరఫున ప్రజలు నిలబడతారు.

నాగ: నిలబడతా రేమిటి? ముందు నేను నిలుస్తా. నాయుడిభూమి నాయుడి కిప్పించే వరకు నిద్రపోను.

నాయు: నేను చేసిన పాపానికి దేవుడు నన్ను క్షమించడు.

నారా: అది తరవాత సంగతి. (నారాయణ సీతమ్మను పిలుస్తాడు. ఆమె స్టేజీలోకి వస్తుంది. ఆమెను వేలితో చూపుతూ) ముందు నిన్ను క్షమించవలసింది ఈమె.

సీత: నేను ఎంతటిదాన్ని క్షమించటానికి అన్నా! ఆయన కాలికింది చెప్పును.

నాయు: (చేతులు చాచి) క్షమించు సీతా! క్షమించు.

సీత: నేను కాదు క్షమించేది. మన ఇద్దరిని చెరొకకన్ను అనుకున్నాడు మామ. ఆ యప్పను గడప దాటమన్నావు.

నాగ: అయన్నే!

రామి: అంతమాటే!

నారా: అంతమాట అనటానికి, నీకు నోరెట్లా వచ్చిందిరా నాయుడూ! సీతమ్మ చెప్పినట్లు పోయి ఆయన కాళ్లు పట్టుకో.

నాయు: ఆయన ఈ దుర్మార్గుణ్ణి క్షమించడు. నా ముఖం చూడడు నా. గడప తొక్కడు.

నారా: రామయ్య మామ స్వభావం నీకు తెలియదు. ఆయన తప్పకుండా యిక్కడికి వస్తాడు. నేను తీసుకొస్తాను. (ముందుకు రెండడుగులు వేసి) అడుగో. రామయ్య మామ రానే వస్తున్నాడు.

సీత: నిజంగానా?

రామ: (ప్రవేశించి) సీతమ్మా! (ఆమె దగ్గరకు వెళుతుంది). (రామయ్య ఆమెతల నిమురుతూ) నిన్ను గురించి వచ్చినానుతల్లీ! లేకుంటే యీ గడప తొక్కను.

(నాయుడు తండ్రిని చూడగానే పోయి ఒక ప్రక్కన ఒదిగి నిలబడి యుంటాడు.)

సీత: అట్లనకు మామా! నీకంటె నాకు దిక్కెవరు? నన్ను వదలి పెడతావా?

రామ: లేదుతల్లీ! లేదు. ఈ రామయ్య బ్రతికి ఉండగా నీకు ఏకొరత రానివ్వడు. రా, తల్లీ! రా. నాతో పాటేనువ్వూ.

నారా: నాయుడు చేసిన తప్పుకు కుమిలిపోతున్నాడు. అతన్ని క్షమించు మామా!

నాగ: నీవు దయదలచక పోతే నాయుడు బ్రతకడు అన్నా!

రామి: నాయుడు కనులు విప్పినాడు, రామయ్య తాతా!


రామ: వాడా కండ్లువిప్పింది? అసలు వాడికి అవి వుంటేనా విప్పటానికి? నా గడప తొక్కకు అంటాడా? (వెళ్లిపోబోతాడు. ఇంతలో నాయుడు..)

నాయు: నాయనా! (అంటూ రివ్వున వచ్చి రామయ్య కాళ్లకు మెలివేసుకొంటాడు. రామయ్య కొంతతడవు గంభీరంగా చూస్తూ అట్లాగే నిల్చుంటాడు. కడకు మెల్లగా వంగి నాయుణ్ణి పైకెత్తుతాడు. ఇద్దరి కండ్లనుండి నీళ్లు జలజల రాలుతూ ఉంటాయి. సీతమ్మ కన్నీటిముత్యాలు భూమిమీద పడుతూ ఉంటాయి. మిగతా వారి కండ్లలోనూ నీళ్లు తిరుగుతాయి. రామయ్య నాయుడి తల నిమురుతూ రెండవ చేయి పక్కనే ఉన్న సీతమ్మ తల మీద వేస్తాడు.) [తెర]

"డాక్టరుగారూ, జ్ఞాపకం ఉనాన్నా? కిందటేడు నామేహ వాత నొప్పులు నయంచేశారు. సాధ్యమైనంతవరకు తడవకుండా చూసుకోమన్నారు."

"ఆవును, జ్ఞాపకం వచ్చింది. ఇప్పుడు మీకేం సహాయంకావాలి?"

"మరేంలేదు. ఎప్పుడు స్నానం చెయ్యొచ్చునంటారో కనుక్కుందామని."



'పరమానందయ్య శిష్యులే నయం'

శ్రీ మధురాంతకం రాజారాం

నాయుడుగారి కుమారులు
నారాయణ గోవిందులు
విద్యాగంధం ఎరుగని
పట్టి శుద్ధ దద్దమ్మలు.

కడుపు నిండుగా తినడం
కంటి నిండుగా నిద్రపోవడం
తప్ప తక్కిన లోకజ్ఞానం
తెలియని మూర్ఖాగ్రేసరులు.

ఆస్తిపరుండౌ నాయుడుగారు
అన్ని ఊర్లనూ గాలించీ
చక్కని చుక్కల నిద్దరి దెచ్చీ
సుతులకు పెండ్లిని జరిపాడు.

నాయుడుగారి కోడళ్లూ
నీరజ పద్మా దేవులు
సుగుణశోభితలు, విద్యావతులు,
సౌందర్యములో రతి దేవులు.

ఇంట కాలిడిన రెండు దినాలలో
భార్యలు భర్తల మంద బుద్ధినీ
పసికట్టా, రొక నీతిపాఠమును
బోధించాలని తలిచారు.

"ఏమేమండీ! ఇటు రారండీ!
బుద్ధిని మీరు బృహస్పతులండీ!
మెడ్రాస్ వెళ్ళి మీరు మాడర్న్ ఫేషన్
చీరలు రెండు తెచ్చియ్యండి!"

అనగానే మన బుద్ధిమంతులు
అంతా తెలిసిన సర్వజ్ఞులవలె
'వెళ్తామే, మరి తెస్తామే'
అంటూ పయనం గట్టారు.

పొగరు బట్టిన గుర్రంబులపై
జీనులువైచి కూర్చొన్నారు.
ఖనను ద్రొక్కుచూ హయరాజంబులు
వడిగా రోడ్డున దౌడు తీసినవి.

పుట్టినదాదిగ ఇల్లు వీడని
సోదరు లిద్దరు కండ్లు తిరుగగా
చెమటలు కారగ ఆయాసముతో
హయములపైనే మూర్ఛిల్లారు.

అడవిదారిలో గుంటనక్కలూ
'హోహో' యనుచూ పర్వులెత్తగా
గుర్రాల్ రెండూ బెదిరిపోయినవి,
తిరిగి యింటికే దారి పట్టినవి.

రాత్రిరి రెండుఝాముల వేళకు
హయములు స్వంతయూరు చేరినవి
ఆ గ్రామములో నా రాత్రంబున
హరికథ యొకటీ జరుగుచుండినది.

పట్ట పగటివలె దీపాలెన్నో
ఉజ్వలకాంతితో వెల్గుచుండినవి.
అప్పటికప్పుడె తెల్వివచ్చిన
అన్న తమ్ముని తట్టిలేపెను.

"లేరా? లేరా! లేచి చూడరా!
చెన్నపట్టణము వచ్చి చేరితిమి!"
తమ్ముడు లేచి దిక్కు తెలియకా
'అన్నా ఉదయము చూడవచ్చులే

ఎటనైనా పడి నిద్రింతామనె.
నిద్రమత్తుచే తూలిపోవుచూ
సోదరు లిద్దరు స్వంత యింటికే
పోయి, అరుగుపై కూర్చొని హరికథ

వినెడి భార్యలతో అతి వినయముగా
"అమ్మా! భార్యలు మమ్ము బంపగా
చీరలు కొనుటకు చెన్నపట్టణము
వచ్చితిమమ్మా! ఈ రాత్రంబున

మేను వాల్చుటకు తావివ్వండమ్మా!"
నీరజ పద్మాదేవిని జూచెను,
పద్మయు నీరజముఖము గాంచెను.
కత్తి వ్రేటునకు నెత్తురు లేకా

ఇద్దరి ముఖములు వాడిపోయెను.
నాయుడుగారు లోపలనుండీ
ఎవ రచ్చట యని కేక వేసిరి.
'ఎవరో మామా! పరదేశులటా!

వచ్చి చూడు'డని నీరజ పిలచెను.
చుట్ట కాల్చుచూ నాయుడుగారు
సరసరసరమని బయటకు రాగా
వంగి దండములు పెట్టుచు కొడుకులు

సంగతి నిట్లని విన్నవించిరి:
"భార్యలకొరకై చీరలు కొనగా
చెన్నపట్టణము వచ్చితిమండీ!
తామరకుంటను గ్రామం బండీ!

రామానాయుడు మా నాన్నండీ!
రాత్రికి మాత్రము తావివ్వండీ!
నిస్తబ్ధుండగు నాయుడుగారిని
కోడండ్రిట్టుల దెప్పిపొడిచిరి:

'మామయ్యా! నీ కుమారు లిద్దరు
పరమానందయ శిష్యులను
మించిపోయిన మేధావంతులు."

అపూర్వాపహ్నవః

శ్రీ నమాణ వీరభద్రం

అనగనగా ఒక వూళ్లో చిన్నబ్బాయున్నాడు. అతనితల్లి అతనికిఒక కోటు, ఫంట్లాం కుట్టించి యిచ్చింది. ఫంట్లాం ఆకుపచ్చ రంగుది, కోటు పసుప్పచ్చ రంగుది. ఇంక మాటల్లో చెప్పలేనంత అందంగానుసుకుమారంగానూ వున్నాయా దుస్తులు. ఆకోటుకు పెట్టిన బొత్తాలు కొత్తవేమో, ధగధగ మెరిసి పోతున్నాయి. వాటిని ధరించి మొట్టమొదటిసారిగా అద్దంముందు నిలుచుంటే, యికతిరిగి రాబుద్ధి పుట్టందే అతనికి! తనకేగదా, యింత అందమైన దుస్తులు లభించాయని మహా గర్వపడ్డాడు.

ఎప్పుడూ అవే తొడుక్కోవాలనీ, అందరికీ చూపించాలనీ అతడనుకున్నాడు తాను యిదివరలో ఏఏ స్థలాలికి వెళ్లేడో అవన్నీ జ్ఞాపకం తెచ్చుకొని, యీ మెరుస్తూన్న దుస్తులు ధరించి తిరిగి ఆప్రదేశాలకే వెళ్లి నిలుచుంటే ఎలా వుంటుందో అనుకున్నాడు. అతని అమ్మమాత్రం వల్లకాదంది. ఆదుస్తులు • జాగ్రత్తగా వుంచుకోవాలని, యిక ముందెప్పుడూ అటువంటివి అతనికి దొరకడం అసంభవమనీ, మరీ మరీ చెప్పింది. దాచుకు దాచుకు ఏవైనా ముఖ్యకార్యాలు వచ్చినప్పుడు వాటిని ధరించాలని కూడా చెప్పింది. అతని పెళ్లికికూడా అవేదుస్తులని హెచ్చరించింది. కోటు బొత్తాలుతీసి మాసిపోతాయేమోనని ఒకరకం వుల్లిపొర కాగితం చుట్టింది. కోటుగాని, ఫంట్లాంగాని ఎక్కడెక్కడ చిరిగిపోయే అవకాశంవుంధో అక్కడ ఏవేవో జాగ్రత్తలు ఏర్పాటు చేసింది. ఇవన్నీ అతడికి యిష్టం లేదు. కాని ఏం, చెయ్యడం? ఆఖరికి ఆమె అదలింపులు అతని మీద ఎంతవరకూ పనిచేశాయంటే "యీదుస్తుల్ని చక్కగా మడతపెట్టి, పెట్టెలోపెడితే బాగుండును" అనిపించి దతనికి. ఇంచు మించు తొడుక్కోవడమే మానుకున్నాడతను. కాని తొడుక్కుందామన్న ఆలోచనమాత్రం వుంది. అందుకు అనువయ్యే అవకాశాలికి ఎదురు చూస్తున్నాడతను. ఒక షరతు మాత్రం వుంది అప్పుడు మాత్రం ఆదుస్తుల్ని ధరించేటందుకు అమ్మచేత అదలింపులు, లేనిపోని అడ్డంకులు మాత్రం వుండకూడదట! అంతా తన యిష్టంమీదే జరిగి, స్వేచ్ఛగా ఆనందంగా వుండాలట!

ఒక రోజురాత్రి అతనికి కల వచ్చింది. కోటుబొత్తాముకి తగిలించిన కాగితాన్ని కొంచం తీసినట్లు, బొత్తాం మెరుపు కొంచెం తగ్గినట్లుచూచి చాలా విచారించాడు ఆకలలోనే. దాన్ని మెరుగు పెట్టడానికి ఎన్నో ప్రయత్నాలు చేసేడు, కాని అది యింకా మాసిపోయింది.

బొత్తాము లన్నిటిలోనూ ఒకటి మాసిపోవడం, తాను ఆ దుస్తుల్ని ధరించే శుభ సమయం హఠాత్తుగా వస్తే, యీ మాసి పోయిన బొత్తాం కోటుకు వుండవలసిన పరిస్థితి ఏర్పడడం, అన్న విచారపుటాలోచన అతని మనస్సుకు హత్తి పోయింది. అతని తల్లి, తిరిగి దుస్తులు ధరించడానికిచ్చినప్పుడు, బొత్తాముకి చుట్టిన, కాగితాన్ని తీసి ఎంతవరకూ మెరుగు పోయిందో చూదామన్న బుద్ధి పుట్టింది. ఈఆలోచనతోనే చర్చికి వెళ్లేడు. అతని తల్లి యిటీవలే, ఎన్నో చెప్పి ప్రత్యేకంగా వానగాని, ధూళిగాని, విపరీతపు ఎండగాని, కనీసం వానవచ్చే సూచనలుగాని లేకుండా చూసి అతనికి దుస్తులు యిచ్చి, చర్చినుంచి తిరిగిరాగానే విప్పించి పెట్లో పెడుతూంది.

ఇన్ని ఆజ్ఞలకు బద్ధుడై అతడు ఆదుస్తులను అప్పుడప్పుడు ధరిస్తూనే వున్నాడు. ఒకరోజు అతడు హఠాత్తుగా ప్రక్కమీద లేచి కూర్చున్నాడు. అతడికి ఆరాత్రి అన్ని రాత్రుల వంటిది కాదని, ఆవెన్నెల సాధారణ వెన్నెలకాదని ఎందు

చేతో తట్టి, అలాగే బద్ధకంగా ఆలోచిస్తూ కూర్చున్నాడు. అతని గుండెకొట్టుకో నారంభించింది. రక్త ప్రసరణలో చురుకు పుట్టింది. అతడు దుస్తులు ధరించ వలసిన శుభ సమయమిదే అనుకున్నాడు. అందులో ఏమాత్రం సందేహం లేదనుకున్నాడు. అతన్ని భయం, సంతోషం రెండూ పెనవేసుకున్నాయి. లేచి కిటికీలోనుంచి వెన్నెలతో నిండినతోటవైపు చూస్తున్నాడు. కీచురాళ్ళ ధ్వనిమాత్రం వినిపిస్తూంది. మెల్లిగా, ఎవరైనా లేస్తారేమో అన్న భయంతో కాలి బొటనవ్రేళ్లమీద నడచి, బీరువా దగ్గరకువెళ్లి చప్పుడు చెయ్యకుండా బీరువా తెరిచి బట్టలక్రిందదాచిన తనకోటు ఫంట్లాం తీసి బొత్తాలకి చుట్టిన కాగితాలు వూడదీసి, తనకు నచ్చిన స్థితిలో వున్నాయన్న నమ్మకం కుదిరిన తరువాత ధరించేడు. వెళ్లి కిటికీ దగ్గర నిల్చున్నాడు, తోటలోని వెన్నెలవైపు చూస్తూను. బొత్తాములు నక్షత్రాల్లా మెరుస్తున్నాయి. మెల్లిగా తోట దారిలోకి వచ్చేడు. అతని తల్లి పడుకున్న గది దగ్గర కొచ్చాడు. వెన్నెలేమో, యిల్లంతా తెల్లగానూ, ప్రతీతలుపు మూసిన కన్నులాగా కనిపిస్తున్నాయి.

పగలు చూసిన తోటకీ, యీ వెన్నెల రాత్రిలో చూస్తూన్న తోటకీ ఎక్కడా పోలికేలేదు. ప్రతీ ఆకుమీదా ముత్యాల్లా మంచు బిందువులున్నాయి. అన్ని రాత్రుల కన్నా ప్రత్యేకంగా యీ రాత్రి భాగమందు వెచ్చదనం కూడా వుంది. ఆకాశం ఎందుచేతో రోజూ కన్న దగ్గరగా వున్నట్లు కనుపించిందతనికి. దంతంతో చేయబడిన పెద్ద పళ్ళెంలా చంద్రుడు కనుపించినా, నక్షత్రాలు కూడా ఆకాశం అంతా అల్లుముకున్నాయి.

ఆ అబ్బాయి మాత్రం పట్టలేనంత ఆనందంచేత అరవడంగాని, పాడడంగాని చెయ్యలేక పోయాడు. ఆశ్చర్యంతో భయంతో చిన్న అరుపు అరుస్తూ యీ ప్రపంచాన్ని కౌగలించుకుందామన్న ఆతృతతో పరుగెత్త నారంభించేడు. తోటలో తీర్చి దిద్దిన దారుల వెంబడి అతను పరుగెత్తలేదు. పొదల వెంబడి, తయారుచేసిన ముళ్ల వెంబడి, పరుగెత్త నారంభించేడు. పొదలలోని ముళ్లు అతనికి గ్రుచ్చుకోవడమే గాకుండా అతని అపురూపపు దుస్తులుకి ముళ్లు గ్రుచ్చుకొని వాటి దారాలుకూడా బయటికి వచ్చినా అతను లెక్ఖ చెయ్యలేదు. ఎందుచేతంటే అతడు ధరించడమే అందుకు. ఏప్రతి బంధ

(36-వ పేజీ చూడండి)



గారడీవాడు

మూలం ఎనటోల్ ఫ్రాన్సు

పూర్వం ఫ్రాన్సు దేశంలో ఒక గారడీ వాడుండేవాడు. అతని పేరు బార్నబస్; చాలబీద వాడు; తనబలం, నేర్పు ప్రదర్శిస్తూ పట్టణాలన్నీ తిరిగి, తిండి, గుడ్డసంపాదించుకొంటూ ఉండేవాడు. నాలుగు రోడ్లుకలిసే చోట చిరిగిపోయినపాత కంబళీ పరిచేవాడు; చక్కటిపాటలు పాడి చిన్నపిల్లల్ని, కులాసాగా తిరిగే సోమరుల్ని ఆకర్షించేవాడు. మొదట్లో నవ్వుపుట్టించే రకరకాల చేష్టలు చేసేవాడు; ముక్కు చివర పళ్లెం నిలబెట్టేవాడు.

బాగాజనం పోగైన తరువాత తల కిందుగానుంచునేవాడు; ఆరు రాగి బంతులు గాలిలోకి విసిరేసి కాళ్లతో పట్టుకునేవాడు. ఈవిధంగా చాలా సార్లుచేసేవాడు. తరవాత వెనక్కి వంగి రెండుపాదాలమధ్యగా తల నిరికించేవాడు; ఆభంగిమంలో ఉండి పన్నెండు కత్తులతో గారడీ చేసేవాడు. ఈప్రదర్శనాలు చూసి భయంతో, ఆశ్చర్యంతో స్తబ్ధులై పోయేవారు. చింకికంబళీ మీద రాగిడబ్బుల వర్షం కురిసేది.

కాని ఆసంపాదన బార్నబస్‌కు సరిపోయేదికాదు. తిండికీ, బట్టకీ చాలా కష్టపడేవాడు. పైగా శీత కాలం వచ్చిందటే అతనిగారడీకి వేళ అనుకూలంగా ఉండేదికాదు. శీత కాలమంతా చలితోను, ఆకలి తోనూ బాధ పడేవాడు.

కాని అతడుతన కష్టాలను శాంతంగా, పల్లెత్తుమాట లేకుండా అనుభవించేవాడు. ప్రపంచంలో ధనవంతులు, దరిద్రులు అనే ఈ రెండు రకాల మనుషులు ఎందుకు వచ్చారు? అని అతడెప్పుడు ఆలోచించలేదు. తను ఈ లోకంలోకష్టపడ్డా, స్వర్గంలోనైనాసుఖపడతానని అతనికి ఒక గట్టి నమ్మకంవుంది. పాపంచేస్తే డబ్బు వస్తుందని తెలిసినా అతడెప్పుడూ ఏ పాపమూ చెయ్యలేదు. దేవుని స్మరిస్తూ తన బాధలు మరిచి పోయేవాడు. అతనికి ఏసుక్రీస్తు తల్లియైన మేరీ అంటే పరమ భక్తి. చర్చికి వెళ్ళినప్పుడల్లా మేరీ విగ్రహం ఎదట మోకరించి, "అమ్మా! నేను చచ్చిపోయేదాకా నన్ను రక్షించు. చనిపోయిన తర్వాత నాకు స్వర్గసౌఖ్యాలు రుచి చూపించు," అని ప్రార్థించే వాడు.

2

ఒక రోజు పగలంతా వానకురిసింది; చీకటిపడింది. బార్నబస్ తనకత్తులూ, బంతులూ కంబళీలో చుట్టుకుని ఒంటరిగా వెడుతున్నాడు. ఆ రాత్రి పడుకోటానికి చోటెక్కడ దొరుకుతుందా అని ఆలోచిస్తున్నాడు. ఇంతలో ఆదోవనే వెడుతున్న ఒక క్రైస్తవ సన్యాసి కనిపించాడు. బార్నబస్ ఆయనకు నమస్కరించాడు.

"అదేమిటి స్నేహితుడా! ఆకుపచ్చ బట్టలు తొడుక్కు పోతున్నావు? ఎక్కడైనా హాస్యగాడి వేషం వేస్తున్నావా?" అని సన్యాసి అడిగాడు.

"కాదు స్వామీ నా పేరు బార్నబస్. గారడీచేసి బతుకుతూ వుంటాను. రోజూతిండికి దొరికితే గారడీ విద్య కంటె గొప్ప విద్య

ప్రపంచంలో లేదని నానమ్మకం," అన్నాడు బార్నబస్.

"స్నేహితుడా! అలాగనబోకు. సన్యాసాశ్రమం అన్నిటి కంటె ఉత్తమమైనది. సన్యాసి జీవితం భగవంతునికి హారతివంటిది."

"స్వామీ! నేను అజ్ఞానంగా మాట్లాడాను. గారడీ విద్యలో కొంత గొప్పతనమున్నా, మీజీవితమంత గొప్పదికాదు. నాకు మేరీ మాతఅంటే పరమ భక్తి. మీకు మల్లెరోజూ ఆమెను కీర్తిస్తూ పాడాలనివుంది. ఈ దేశమంతటా నాకు పేరు తెచ్చిన నావిద్యను వదిలేస్తాను. మీలో నన్నుకూడా ఒకణ్ణిగా చేర్చుకోండి," అని వేడుకున్నాడు బార్నబస్.

గారడీవాని అమాయికత్వం చూసి సన్యాసికి జాలికలిగింది. బార్నబస్ మంచి హృదయం గలవాడని ఆయన గ్రహించాడు.

"బార్నబస్! నాతోరా. నేనొక మఠాధికారిని. మామఠంలో నిన్ను చేర్పిస్తాను. అక్కడవుంటూ నువ్వు దైవ సేవ చెయ్యవచ్చు," అన్నాడాయన.

ఈవిధంగా బార్నబస్ సన్యాసాశ్రమం స్వీకరించాడు. ఆమఠంలోని భక్తులందరూ మేరీమాతను పూజించేవాళ్లే. ప్రతివాడూ తనకు దేవుడిచ్చిన విద్యను మేరీ మాత సేవకే వినియోగిస్తున్నాడు.

మఠాధికారి మేరీమాతనుగూర్చి పుస్తకాలు వ్రాసేవాడు.

మరొకాయన ఈ పుస్తకాలకు నకళ్లు వ్రాసేవాడు.

వేరొక భక్తుడు దేవతలని, మేరీ మాతని అందమైన బొమ్మల్లో చిత్రించేవాడు.

మరొకడు రాళ్లుచెక్కి దేవతా ప్రతిమలు తయారు చేసేవాడు. ఆ మఠంలో చాలమంది కవులుకూడా ఉన్నారు. వాళ్లు లాటిన్ భాషలో చక్కటి గీతాలు వ్రాసేవారు. గాయకులు వాటిని శ్రావ్యంగా గానం చేసేవారు.

3

మఠంలో ఇందరు గొప్ప కళాకారులు ఉండి, తమ కళలను మేరీ మాతకు కైంకర్యం చేస్తూండగా, తనకు అలాటి కళలేమీ రానందుకు బార్నబస్ చాలా చింతించాడు.

"నా స్నేహితులందరి మల్లే నేనుకూడా మేరీమాతను కీర్తించలేక పోతున్నానుగదా!

"ఓ దేవీ! నాకు ఏకళా చేతకాదు. నేను పుస్తకాలు రాయలేను; పాటలు అల్లలేను, పాడలేను; చిత్రకళ చేతకాదు. నిన్నెల్లా సేవించగలను?" అని దుఃఖించేవాడు ఒంటరిగా.

ఒక రోజున సన్యాసులు ఏదో మాటల సందర్భంలో ఉండగా ఒక సన్యాసి ప్రసక్తి వచ్చింది: ఆ సన్యాసికి "మేరీమాతా!" అనే మాట పలకటం తప్ప మరేమీ చేతకాదు. ఎప్పుడూ ఆ నాలుగక్షరాలే పలికేవాడు. కాని అతడు చనిపోయినప్పుడు అతని నోటిలోనుంచి నాలుగు గులాబిపువ్వులు బయటికి వచ్చాయి. ఆ నాలుగు పువ్వులూ నాలుగక్షరాలన్నమాట. ఆ విధంగా అతడు గొప్ప భక్తుడని ఋజువైంది.

ఈ కథ బార్నబస్ విన్నాడు. మేరీమాత ఎంత దయామయి, అనుకున్నాడు. కాని అతనికి ఊరట కలగలేదు. తను ఏవిధంగా మాతను సేవించాలో తెలియలేదు.

ఒకనాటి ఉదయం బార్నబస్ చాలా సంతోషంగా నిద్రలేచాడు; చర్చికి పరిగెత్తాడు; అక్కడ ఒంటరిగా గంటసేపు ఉన్నాడు; తరువాత తిరిగి మఠానికి వచ్చేశాడు.

ఆ రోజు నుంచి ప్రతిఉదయం ఆ చర్చికి వెళ్లేవాడు; ప్రార్థనలు ముగిసి అందరూ వెళ్లిపోయాక అక్కడే ఒంటిగా చాలా సేపు గడిపేవాడు. అతనికి పూర్వపు దిగులు, విచారం పూర్తిగాపోయి ఎప్పుడూ సంతోషంగా ఉండేవాడు.

మిగతా సన్యాసు లందరికీ ఆశ్చర్యం కలిగించింది విషయం. అందరూ కలిసి చర్చించారు బార్నబస్ తరుచుగా ఎక్కడికి వెడుతున్నాడూ, అని.

సన్యాసుల ప్రవర్తనను నిత్యమూ కనిపెడుతూ వుండే మఠాధికారి బార్నబస్ ను ఒక రోజున వెంబడించాడు. బార్నబస్ చర్చిలోకి వెళ్లి తలుపులు మూసుకున్నాడు. మఠాధికారి, మరిద్దరు సన్యాసులతో కలిసివచ్చి తలుపు కన్నాలగుండా లోపల జరిగేది చూశాడు.

మేరీ మాత విగ్రహం ఎదుట బార్నబస్ తల నేలమీద, కాళ్లు పైనపెట్టి ఆరు రాగి బంతులతోనూ, పన్నెండు కత్తుల తోను గారడీ

చేస్తున్నాడు. ఫ్రాన్సుదేశమంతటా ఏ అద్భుతవిద్యలు ప్రజలని ఆకర్షించాయో ఆవిద్యలను మేరీ మాత గౌరవార్థం బార్నబస్ ప్రదర్శిస్తున్నాడు.

మఠాధికారి వెంటవచ్చిన ఇద్దరూ సన్యాసులు ఈతతంగం చూసి "దేవికి ఇదితీరనిఅవమానం," అని అరిచారు. బార్నబస్ అమాయకుడు, మంచివాడు అని మఠాధికారికి తెలుసు; కాని అతనికి పిచ్చెత్తి ఉంటుందని నిశ్చయించుకున్నాడు. తలుపులుతెరచి బార్నబస్‌ను ఇవతలకు తీసుకురాబోతుండగా, మేరీ మాత స్వయంగా మెట్లు దిగివచ్చింది. బార్నబస్ గారడీ చేసి చేసి అలిసి వున్నందున అతని నుదురు చెమటతో తడిసి వుంది. మేరీ మాత తన చెరగుతో అతని నుదురు తుడిచింది.

మఠాధికారి మోకరించి, మెట్ల మీద తల ఆన్చి ఇలాగన్నాడు.

"నిర్మల మైన హృదయం గలవారే అదృష్టవంతులు; వారికే భగవంతుడు సాక్షాత్కరిస్తాడు."

(అనువాదం: ఎన్నార్)

★

అపురూపపు దుస్తులు

(33-వ పేజీ తరువాయి)

కాన్ని అతడు లెఖ్ఖచెయ్యదలుచుకోలేదు.

"నా అపురూపపు దుస్తులు నేను ధరించేను, నాకు అదే కావాలి" అని పొంగిపోతున్నాడు. తోపు అవతలనున్న చిన్న దొరువు దగ్గర కొచ్చాడు. అది కొంచెం నీరు కలిగిన దొరువే. రాత్రిమాత్రం వెన్నెలతో మలామా చేసిన వెండి పాత్రలా వుంటుంది. కప్పల సంగీతాలతో నిండిన ప్రదేశం. మన చిన్నబ్బాయి వెర్రెత్తినట్లు పరుగెత్తగానే నీరు కదిలి, మెరిసే నక్షత్రాల ప్రతిబింబాలు నల్లగావున్న చెట్లనీడల్లో యిరుక్కుపోయాయా అనిపించింది. నీటిమొక్కలను దాటి రెండవ వొడ్డు చేరుకున్నాడు. తిరిగి రస్తాలో పడ్డాడు. నేను దుస్తులు ధరించవలసిన శుభసమయమిదే అనుకున్నాడు. తన అమ్మ తయారు చేసి యిచ్చిన దుస్తులు ధరించి, ఆనందంతో పాడుతూ గెంతుతూ వెళుతున్నాడు. ఆ రోడ్డు మీద దుమ్ము విపరీతంగా వుంది. కాని అతనికి మెత్తని వెన్నెలగా తోచింది. అతడు అలాగ వెళుతూంటే ఒక కీటకం ఎగురుతూ కనిపించింద తనికి. మొదట అతడు దాన్ని చూడనేలేదు. చూసిన తరువాత అది తనచుట్టూ తిరుగుతూ వుంటే తను నృత్యం చెయ్యడం మొదలుపెట్టేడు.

"ఎంత చక్కని కీటకానివి. నీలాగే యీ రాత్రి కూడా చాలా ఆశ్చర్యాన్ని కలగజేస్తోంది.

"నువ్వు గాని నా దుస్తులు చాలా అందంగా వున్నాయనుకుంటున్నావా? నీ రెక్కలెంత అందంగా వున్నాయో, వాటితో సరిపోల గల వనుకుంటున్నావా?" అన్నాడు. ఆ కీటకం అతని చుట్టూ తిరుగుతూ మరీ దగ్గరగా రానారంభించింది. చివరికి అతని పెదిమల్ని కూడా తాకింది.


మర్నాడు అతడు ఆదొరువులో చచ్చిపడి వుండడం అందరూ చూశారు. అతని మెడ విరిగిపోయింది. అపురూపపు దుస్తులు రక్తపు మరకలతో నిండివున్నాయి.

అతని ముఖం మాత్రం మీరూ చూచి వున్నట్లయితే, అందులో ఎంత ఆనందంవుందో ఎంత తృప్తివుందో ఎంత సంతోషంతో ప్రాణం విడువగలిగేడో మీకే అర్థమౌతుంది.

★

ప్రొడ్యూసరు భార్య: ఏమండీ, మన కొత్తపిక్చర్లోకి కుక్క కావాలిటగా? మన జాకీని ఉపయోగించరాదు?

ప్రొడ్యూసరు: ఎందుకే, పిచ్చిదానా? బోలెడన్ని ఎక్స్‌ట్రా కుక్కలు ఊరికే వేషంవెయ్యడానికి సిద్ధంగా ఉన్నాయి.



పూర్వము నేపాళ రాజ్యాన్ని సింహకేతు డనే రాజు పరిపాలిస్తూవుండేవాడు. ఆయనకు సమస్తఐశ్వర్యములు ఉన్నప్పటికి సంతానములేదు. ఆ కారణంచేత సింహకేతుడు ఎన్నో యజ్ఞయాగాదులు చేసాడు, ఎన్నో సార్లు తీర్థయాత్రలు చేశాడు, ఎంతో మందికి ధనధాన్యాలు దానం చేశాడు. కాని వాట్లఫలితం కనిపించక పోవడము వల్లన కలిమి ఉన్నా కుమిలి పోజొచ్చాడు. ఇంతలో ఒక సన్యాసి సింహకేతుని, కొలువుకు వేంచేసి, సంతానము లేనందులకు సంతాపమునొందుచున్న సింహకేతునకి, నీకు "సుగుణవతియగు పుత్రిక జన్మిస్తుంది. ఆమె అందచందాలకుగాని, గుణగణాదులకుగాని ఈప్రపంచంలోనున్న ఏపిల్లా సమానముకాదు, ఆమెను అల్లారుముద్దుగా, పెంచి, యుక్తవయస్సు రాగానే మంచి వరునకిచ్చి వివాహంచేయి" అని చెప్పి వెడలిపోయాడు. సన్యాసి మాటలు వినగానే సింహకేతుని సంతోషానికి మేర లేదు.

సన్యాసి చెప్పిన ప్రకారము, ఆ మరుచటి సంవత్సరము సింహకేతునకు ఒక కుమార్తె కలిగింది. ఆ పిల్లకు చంద్రకళ అను పేరు పెట్టాడు. చంద్రకళ పుట్టగానే, సింహకేతునకు అంతులేని ఐశ్వర్యము కూడా కలిగింది. చంద్రకళ, దినదినాభి వృద్ధిగాంచుతూ, అల్లారుముద్దుగా పెరిగి పెద్దదవగానే, ఆమె నవ్వితే నవరత్నాలు, పరిగెడితే పచ్చలు, ఏడుస్తే నీలకంఠాలు రాలడము మొదలు బెట్టాయి. సింహకేతుడు సన్యాసి చెప్పినట్లు చంద్రకళకు మంచి రాజకుమారుణ్ణిచ్చి వివాహం చేయాలని నిశ్చయించుకొన్నాడు.

మహాసముద్రమునకు మధ్యనున్న దీవిపై ఒంటిస్తంభం మేడ కట్టించి దానిలో చంద్రకళనుంచి "ఎవరైతే సముద్రము ఒడ్డునుంచి ఈదుకొని చంద్రకళ ఉన్న ఒంటిస్తంభము మేడదగ్గరకు వెళతారో, వారికి చంద్రకళ నిచ్చి వివాహం చేస్తానని" ఊరూరా చాటించాడు.

చాటింపు వినగానే, చెప్పలేనంతమంది రాజకుమారులు సముద్రాన్ని ఈదడము ప్రారంభించి—పాపం మధ్యవరకూ వెళ్ళకుండా మునిగి చచ్చిపోయారు. చిట్టచివరకు ధర్మపురి యువరాజయిన విజయుడు సముద్రాన్ని ఈది, ఒంటిస్తంభాన్ని చేరుకొన్నాడు. సింహకేతుడు చంద్రకళకు తగిన వరుడు దొరికాడని మహానందంతో చంద్రకళను విజయుని కిచ్చి వివాహం చేశాడు.

వివాహము పూర్తిగానే విజయుడు చంద్రకళను తనవెంట తీసుకొని వెడతాననగానే సింహకేతునకు. చంద్రకళనువిడచి ఎలా ఉండడమా, అని గుండెల్లో రాయి పడింది.

సింహకేతుడు చంద్రకళ మీద వుండే మమకారమువల్ల, విజయునితో ఒకనెలరోజులు పోగానే పంపిస్తానని చెప్పాడు. విజయుడు మామగారు కోరిన ప్రకారము నెలపూర్తి

కాగానే పంపించమని చెప్పి తన రాజధానయిన ధర్మపురికి వెళ్ళిపోయాడు.

నెల రోజులు, గిర్రున తిరిగిపోయాయి. సింహకేతునకు కుమార్తెను విడచి వుండ్డానికి బెంగ పట్టుకొంది. కానిఏం చేస్తాడూ?— ఆడపిల్లలు ఎప్పుడూ ఇంకొకరిసొత్తే. దాసీపిల్లయిన చండికనిచ్చి చంద్రను అత్తవారింటికి సాగనంపాడు. కాని చండిక మధ్యదారిలో చంద్రకళకు కత్తి చూపించి చంపేస్తానని భయపెట్టి ఆమె దుస్తులు, ఆభరణాలు తీసుకొని; తను ధరించి తన బట్టలు చంద్రకళకిచ్చి, ఆమెను దగ్గరగా నున్న నేలబారు నూతిలోత్రోసి ధర్మపురికి వెళ్ళింది. చంద్రకళను ఇదివరకు సరిగా చూడకపోవడమువలన విజయుడు, చండికను తన భార్య చంద్రకళఅనుకొనిఉప్పొంగిపోయాడు. ఆనాటినుంచి చండిక చంద్రకళను పేరుతో రాణీ అయింది.

ఇక మధ్య మార్గంలో నూతిలోకి చండికవల్ల త్రోయబడిన చంద్రకళ ఏమయిందో తెలుసా— మునిగి చావలేదు. వరలు గట్టిగా పట్టుకొని నుంచుని, దారి వెంబడి వెళ్ళేబాటసారు లెవరైనా కేకవిని నూతినుండి తీస్తారనే తలపుతో చంద్రకళ కేకలు వేయడము మొదలుబెట్టింది.

మరునాటి ఉదయము ఆదారి వెంబడి ధర్మపురి పోతూన్న విజయుని సైనికుడు రఘువర్మ, చంద్రకళ కేకవిని, చంద్రకళనునూతినుండి బయటకుతీసి, తనకూడా ధర్మపురికి తీసుకొనివెళ్ళి తన ఇంట్లో ఉంచుకొన్నాడు. చంద్రకళ మాత్రము రఘువర్మకు, తన వృత్తాంతమేమి తెలుపక, "నేనొక అనాధను నన్ను దొంగలు నూతిలో పడేశారని" చెప్పింది.

చంద్రకళ నవ్వుతే నవరత్నాలు రాలడము ఏడుస్తే నీలకంఠాలు రాలడమువలన. పరిగెడితే పచ్చలు పడడము రఘువర్మ చూస్తూవుండగానే మహాధనవంతుడయ్యాడు. రఘువర్మ చంద్రకళ ఒక దేవతాస్వరూపిణి అనుకొని, ఆమెను తనఆప్త సోదరీమణివలె చూచుకొంటూ వుండేవాడు.

రఘువర్మ చెల్లిలు రాగానే అతని ఇల్లంతా నవరత్నమయమయిందని విజయునికి తెలిసింది. తక్షణం అతనికి తన భార్యకూడా నవ్వుతే నవరత్నాలు పడుతాయని జ్ఞాపక మొచ్చింది. అంతఃపురములోకివెళ్ళి చండికకు చక్కలిగింతలు పెట్టాడు. కాని నవరత్నాలు రాలడానికి ఆమె చంద్రకళవుతేగా—

"రఘువర్మ చెల్లెలికి నవ్వుతే నవరత్నాల పడతాయిట, నీకు పడవేమి" అన్నాడు విజయుడు.

"నాకు ఇష్ట మయినప్పుడే నవరత్నాలూ" పడతాయి అని సర్ది చెప్పిండి చండిక.

చండిక రఘువర్మ ఇంటికి వచ్చినది చంద్రకళని,నిర్ణయించుకోగానే ఆమె ఒళ్ళంతా చెమట్లు పోసినయి. తక్షణం ఊరి వెలుపల నున్న కోయవాణ్ణి పిలిపించి రఘువర్మ ఇంటిలో నున్న చంద్రకళను చంపమని చెప్పింది.

కోయవాడు "అమ్మా నాకు మనుష్యుల్ని మంగుపెట్టి చంపడము చేతకాదు. పైగా అది ఈమె విషయంలో అంత సులభము కాదు. కావలిసినట్లయితే ఆమెను ఒక అనాకారపక్షి క్రింద మార్చేస్తాను, అన్నాడు. చండిక" సరే, రేపు సాయంత్రములోపుగా, ఆమెను అనాకారపక్షి కింద మార్చేయి. "అనిచెప్పి మెడలోని రత్నాలహారమొకటి వాడికిచ్చింది.

కోయవాడు రత్నాల హారము చూచి మురిసిపోతూ ఇంటికివెళ్ళి, మరునాటి ఉదయమే ఒక భిక్షగాడివేషము వేసుకొని రఘువర్మ ఇంటికి వెళ్ళాడు.

చంద్రకళ కోయవాడికేక విని, కొన్ని రత్నాలు వాడికివ్వడానికి వీధులోనికి వచ్చింది. కోయవాడు, చంద్రకళ, చేరువగా రాగానే, ఆమె చెంపని ఒక మంత్రపుముల్లు గుచ్చాడు. ఇంకేముందీ?- చంద్రకళ అనాకారపక్షియి ఆకాశంలోనికి ఎగిరిపోయింది.

రఘువర్మ ఇంటికి వచ్చి చూసేసరికి చంద్రకళ ఏదీ? ఆమెకోసం వూరూరా తిరిగాడు కాని ఆమె ఎలాకనిపిస్తుందీ- నిరాశతో ఇంటికి వచ్చి మంచంపట్టాడు.

ఇక అనాకారపక్షయిన చంద్రకళ, ఊరి వెలుపల నున్న చాకలివాని ఇంటిముందున్న చింతచెట్టుపై గూడు కట్టుకొని నివాసమేర్పచుకొంది.

రోజూ ఉదయాన్నే ఆచాకలిని చూచి "అంత రాజు కూతుర్ని.

ఇంత రాజుపెళ్ళాన్ని, అయినా ఎంతగతి పట్టిందో చూచావా చాకలి" అని అనాకారపక్షి ఏడ్వగానే నీల కంఠాలు రాలేవి. చాకలికి అనాకారపక్షి మాటలు వింతగా వుండేవికావు, ఆ పక్షి ఏడుపువల్ల రాలిన నీలకంఠాలన్నీ ఏరుకొని తట్టలతో తీసుకొని వెళ్ళి బజారులో చౌకగా అమ్మేస్తూవుండేవాడు. ఓరోజున విజయుడు నగర సంచారమునకు బయలుదేరాడు. ఓచోట మనచాకలి తట్టెడు నీల కంఠాలు రెండు రూపాయలకు అమ్మటం చూడగానే ఆశ్చర్యపోయి విజయుడు, చాకలిని సమీపించి, "నీకీ నీలకంఠాలన్నీ ఎలావచ్చాయి, నిజముచెప్పు, లేకపోతే నీ బుర్ర ఎగుర గొడతాను" అని నిలదీసి అడిగాడు.

చాకలి విజయుని మాటలు వినగానే వణకుతూ, "ప్రభూ నెల రోజుల నుంచీ మాసింత సెట్టుమీద ఒక పక్షి గూడు కట్టుకొని ఉంటూండాది. అదోమి విచిత్రమో గాని రోజూ అది నన్ను చూసి "అంతరాజు కూతుర్ని, ఇంతరాజు పెళ్ళాన్ని, అయినా ఎంతగతిపట్టిందో చూచావా చాకలి" అని ఏడుస్తుంది. అలా అది ఏడ్చినప్పుడు ఇవి తట్టలకొలది పడతాయి" అని అంతా పూచ గుచ్చినట్లు చెప్పాడు. విజయుడు చాకలివానిమాటలు వినగానే ఆశ్చర్యపడి "ఆపక్షిని ఏవిధంగానైనా పట్టుకోవాలను కొని మరునాడు తన సేవకులను వెంటబెట్టుకొని, అనాకారపక్షిని చంపకుండా, వలలు పన్నించి, పట్టుకొన్నాడు.

ఆఅనాకారపక్షికి ఉన్న ముల్లు చూచి విజయుడు దానిని ఊడ పీకాడు. ఇంకేముందీ? మంత్రపు ముల్లు ఊడగానే అనాకారపక్షి-అందమైన చంద్రకళగామారింది. విజయుడికి చంద్రకళనుచూడగానే అంతులేని ఆశ్చర్యము కలిగింది.

"ఎవరు నీవు - ఎందుచేత ఇలా అనాకారపక్షయ్యావు" అని చంద్రకళను ప్రశ్నించాడు.

చంద్రకళ, చండిక చేసిన ద్రోహము, రఘువర్మ చూపిన ఆదరణ, అంతా పూసగుచ్చినట్లు చెప్పగానేవిజయుడు ఆమెతనభార్య, నిజమైన చంద్రకళని, గుర్తించి చంద్రకళనుతన వెంట అంతఃపురము లోనికి తీసుకొనివెళ్ళాడు.

విజయుడు చండికను ముక్కలు ముక్కలుగా నరికించి, కాకులకు గ్రద్దలకు వేయించాడు. చంద్రకళ కొరకు మంచముపట్టిన రఘువర్మకు జబ్బుతగ్గగానే అతనికి విజయుడు ఉన్నత పదవిచ్చాడు. చంద్రకళను మరల ఇంకొక సారి మహావైభవంగా వివాహంచేసుకొని చక్కలిగింతలు పెట్టాడు. ఈమారు ఆమె నోటినుండి పడిన నవరత్నాలు విజయుడు ఏరుకోలేకపోయాడు. ★


"మీరు చిన్నతనంలో పెట్టుకున్న ఆశలు ఏమైనా ఇప్పటికి నెరవేరాయా?"

"ఆ. చిన్నప్పుడు మాఅన్నయ్య నాజుట్టు తెగపీకేవాడు. జుట్టు లేకుండా ఉంటే ఎంత బాగుండు ననుకునేవాణ్ణి. అదొక్కటిమాత్రం ఇప్పటికి నెరవేరింది."

* * * *

పోలీసులకి దొరకవలసివున్న ఒక నేరస్థుడి తాలూకు ఆరు రకాల ఫోటోలు అధికారులు ఒక వూరి పోలీసుస్టేషనుకు పంపించారు. ఆ స్టేషను అధికారి కొన్నిరోజుల తర్వాత ఇలా ఉత్తరం రాశాడు.

"మీరు పంపిన ఆరుగురు నేరస్థుల ఫోటోలు అందాయి. అందులో అయిదుగుర్ని ఇప్పటికి అరెస్టు చేశాను. ఆరోవాణ్ణి కూడా త్వరలో అరెస్టు చెయ్యగలను."



ఏరియన్ కథ

శ్రీ రాసూరి శ్రీనివాసరావు

చాలకాలం క్రిందట గ్రీసుదేశంలో కొరింత్ అను పట్టణం ఉండేది. అచట ఏరియన్ అనే బీదవాడు నివసిస్తూ ఉండేవాడు. అతనికి సంగీతమంటే ఎంతో యిష్టం, ఇష్టమే కాకుండా పియానోపై తన పాటను ప్రజలకువినిపించి వారిని మైమరపించేవాడు. ఇంత బాగుగాపాడిన ఏరియన్ దగ్గరకు అనేకమంది ప్రజలు అతని పాట వినాలనే ఆశతో వచ్చి పాట పాడినతరువాత వారికి తోచిన ధనాన్ని కానుకగా యిస్తూఉండేవారు. ఇలాగు కొంతకాలానికి ధనము సంపాదించి ఏరియన్ ధనవంతు డయ్యాడు. కొంతకాలానికి ఏరియన్ పేరు దేశంలో వ్యాపించింది. ఆ దేశాన్ని పాలిస్తూఉండే పెరియాండ్రస్ అనేరాజు ఏరియన్ యొక్క పేరునువిని ఆతనికి తనవద్ద నివాస మేర్పరిచాడు.

ఇలాగ పెరియాండ్రసు యింటిలో నివసిస్తూఉన్న ఏరియన్ కి తానింతకు ముందు చూడనటువంటి దేశాలని చూడాలనిపించింది. అందుచేత పెరియాండ్రసు అనుమతిపై పడవలో యిటలీ, సిసిలీ మొదలగు దేశాలను చూడడానికి బయలుదేరాడు. వారాలు, దినాలుగా పోతూన్న పడవలో కొంతకాలానికి ఇటలీని చేరుకున్నాడు. ఇటలీ దేశాన్ని నెలల తరబడి సందర్శించి తన పాటను వారికి వినిపించాడు. అచటి ప్రజలు యితని పాటను విని సంతోషించి వానికి తగిన కానుకలిచ్చారు. ఇలాగు కానుకల మూలంగా వచ్చిన ధనాన్ని ఏరియన్ ప్రోగు చేసుకున్నాడు. ఆ దేశాన్నంతటిని సందర్శించినతరువాత ఏరియన్ కు తన దేశానికి మరలిపోదామని బుద్ధి పుట్టింది. తన ధనాన్ని మోసుకు పోవాలనే ఉద్దేశంతో ఏరియన్ తన స్వదేశీయులతోనే ప్రయాణించా లనుకున్నాడు. ఇట్లు చేయడం వల్ల తను క్షేమంగా చేరగలనని తలచాడు ఏరియన్.

కొన్నాళ్ళకి స్వదేశీయులఓడ ఒ' బయల్దేరుతుండగాదానిలోతనుకూ బయలుదేరడానికి సిద్ధపడ్డాడు ఏరియన్. ఆ ఓడలో తన ధనాన్నంతటిని ఏరియన్ ఎక్కించాడు. ధనం ఎంతటివారికైనా దుర్బుద్ధి పుట్టిస్తుందిగదా! అందుచేత దురాశపరులైన వర్తకులు ఏరియన్ ధనాన్ని చూచి అతనిని చంపి అతని ధనాన్ని లాక్కుందామనే ఉద్దేశంతో తమ ఉద్దేశాన్ని ఏరియన్ కి ఎఱిగించారు. ఇదంతా విన్న ఏరియన్ చాల విచారించి యిటువంటి ఉద్దేశం పుట్టినవాళ్ళు ఎలాగైనా తనను చంపకుండా ఉండరని తను సంపాదించిన ధనాన్ని అంతటినీ వారికిచ్చి తన ప్రాణాన్ని రక్షించుకోవాలనుకున్నాడు. కాని ఏరియన్ను ప్రాణాలతో విడిచిపెట్టి అతని యొక్క ధనాన్ని తీసుకోడానికి ఆ వర్తకు లంగీకరించలేదు.

అందుచేత ఏరియన్ చాల దుఃఖించి తన ప్రియమైన

పాటను కడసారి మనసార వాయించి ఆఖరుకి సముద్రంలోబడి ప్రాణాలను విడుస్తానని వర్తకులతో చెప్పాడు. ఆ వర్తకులు దాని కంగీకరించటంతోనే తన పాటను పియానోపై వాయించి వారిని ముగ్ధుల్ని చేశాడు. ఏరియన్ పాడుతూన్నంతసేపు ఆ వర్తకులు "యింతటి పాటగాడిని మనం చంపగడగితిమిగదా" యని మనస్సులో చింతించారు. కాని ఏం లాభం ధనాశ ఒకప్రక్కకు లాగుతూంటే ఏరియన్‌నుఎలాచంపక ఉండగలరు? అందుచేత వాళ్లు ఎలాగైతేనేం చంపటానికి నిశ్చయించుకున్నారు. వీళ్ళిలా చంపటానికిఆలోచిస్తున్నంతలో ఏరియన్ తన పాట ముగించి సముద్రంలోఒక్క గంతువేశాడు.

ఏరియన్ సముద్రంలోకి గెంతిన తరువాత ఆ ప్రశాంత సముద్రంలో కొరింత్ వర్తకుల ఓడ మెల్లగా నడుస్తోంది. సముద్రంలో దూకిన ఏరియన్ కొంతవరకు ఈది అలసిపోయాడు. ఇంతలో డాల్ఫిన్ అనే ఒక పెద్దచేప దైవవశాత్తు గబుక్కున వచ్చి ఏరియన్‌ని తన వీపుపై ఎక్కించుకొని వర్తకుల ఓడకంటె ముందుగా వచ్చి కొరింత్‌ను చేరింది. అచట ఏరియన్‌ను దింపి తిరిగి సముద్రంలో చొరబడిపోయింది. ఏరియన్ కొరింత్ చేరిన తరువాత తిన్నగా తన స్నేహితుడైన పెరియాండ్రస్ యింటికి వెళ్ళేడు. తడిసిన బట్టలతో అలసి సొలసిన ఏరియన్‌ని పెరియాండ్రస్ చూడడంతోనే ఆశ్చర్యపడి ఏరియన్‌ని జరిగిన సంగతిగూర్చి అడిగి తెలుసుకున్నాడు. కాని ఏరియన్ చెప్పినదంతా పెరియాండ్రస్ నమ్మలేకపోయాడు. వర్తకులు వచ్చినతరువాత నిజమైన సంగతి గూర్చి తెలుసుకోడానికి నిశ్చయించాడు.

పడవ ప్రశాంతంగా సముద్రంలో కొరింత్ వైపు నడుస్తోంది. ఒకనాడు సాయంత్రం పెరియాండ్రస్, ఏరియన్‌లు షికారుకుపోతూ సముద్రపుటొడ్డుకు వచ్చారు. కొరింత్ వైపు ప్రయాణిస్తున్న ఓడను ఏరియన్ గుర్తుపట్టి పెరియాండ్రసుకు "అదియే వర్తకుల యొక్క ఓడ" అని ఎఱిగించాడు. పెరియాండ్రసు వెంటనే తన దర్బారుకు పోయి రక్షకభటులను పిలచి వర్తకుల ఓడ కొరింత్ చేరినవెంటనే అందులో నున్న వర్తకుల నందరినీ తెమ్మని ఆజ్ఞాపించాడు. వెంటనే వారు పోయి ఓడ ఒడ్డుకు చేరిన వెంటనే రాజాజ్ఞ వర్తకుల కెరిగించి వారినందరిని రాజు వద్దకు చేర్చారు. రాజు వర్తకులను చూచి క్షేమసమాచారాలన్ని తెలుసుకొని వారు బయలుదేరిన స్థలాన్ని గూర్చి ప్రశ్నించాడు. వారి సమాధానాలన్నిటిని పెరియాండ్రసురాజు విన్నతరువాత "ఏరియన్ గూర్చి మీకేమైనా తెలుసునా? అని అడిగాడు. వెంటనే వారు టారెంటమ్ అనే పట్నంలో కులాసాగా ఉన్నాడని అతడచట ధనాన్ని ఆర్జించుకుంటున్నాడని తన స్వదేశానికి తిరిగి రావడానికి యిష్టంలేదని రాజుకు తెలియచెప్పారు.

ఈ మాటలు వర్తకులు రాజుతో చెపుతూండగా ఆ ప్రక్క గదిలో ఉన్న ఏరియన్ బయటికి వచ్చాడు. ఏరియన్‌ని చూచినతోడనే వర్తకులు నిర్ఘాంతపోయి చూస్తూ నిలబడిపోయారు. అపుడు పెరియాండ్రస్ ఏరియన్ చెప్పినదంతా నిజమని నమ్మి వారిని క్రూరంగా శిక్షించడానికి నిశ్చయించాడు. అతడు ఓడలోనున్న ఏరియన్ యొక్క ధనాన్నంతటిని ఏరియన్ కిచ్చివేసి ఆ ఓడను మిగతా వర్తకుల ధనాన్నంతటిని తన ప్రభుత్వానికి చెందేటట్టు ఆజ్ఞాపించాడు.

ఆ వర్తకులను "ఏరియన్‌ను చంపతలపెట్టిన మోసకాండ్రని కొరింత్ పురవీథులలోకట్టి యీడ్చమని" ఆజ్ఞాపించాడు. రాజుయొక్క కఠిన దండనకు వారు నిశ్చేష్టులై నిలబడిపోయారు. ఇంతలో ఆ భటులు వచ్చి రాజాజ్ఞప్రకారం వారిని పురవీథులలో త్రిప్పి అవమానించారు. అప్పటినుండీ ఏరియన్‌ను పెరియాండ్రసు గొప్పగా గౌరవించి తన నివాసంలోనే అతనికి కూడా నివాస మేర్పరచాడు. తానొకటి తలచిన దైవమొకటి తలచును.

★

ఉజ్జీలు

(17-వ పేజీ తరువాయి)

"శెలవు పెట్టాడా?"

"అవున్రా"

"హాయిగా వేసవిలో పెట్టక, శీతాకాలంలో పెట్టాడేమే... సరే... ఏదో కోర్టుపనిమీద వచ్చాను. అయితే అందరం కలిసే వెళ్దాం" అన్నాడు శంకరం.

"నెల్లాళ్ళక్రితమేగా ఇంటినుంచి వచ్చిం ది" అంది లలిత.

"శెలవుపెట్టి ఇక్కడ ఉండటమేమిటే! ఈ శేషనుతిళ్లా మీరూను. నెల్లాళ్లు ఇంటి పట్టున హాయిగా పాతబియ్యమూ పాలు, పెరుగు పోసుకోవచ్చు... బావగారితో కూడా చెప్పతాను... పోదాం" అని, క్లీడ గుకు కనబడి వస్తానని చెప్పి, శంకరం వెళ్లి పోయాడు.

"మా తమ్ముడు వచ్చాడండీ!"

"ఏడి?"

"ప్లీడరుదగ్గరకు వెళ్లాడు.... ఏదో కోర్టు పనిట... మీరు శెలవుపెట్టారని చెప్పాను.

"శెలవా?" అన్నాడు గోపాలం.

"అవును..." అంది లలిత, తన ప్రజ్ఞకు మురిసిపోతూ.

"అవునేమిటె నీ మొహం! రేపటినుంచి ఆఫీసుకు పోవాలి" అన్నాడు గర్వం చాటున చిఱునవ్వు ఆపుకుంటూ.

"చెప్పరేమండీ మరి.... ఏమిటే రేపటి నుంచి రమ్మన్నారా?" అని అడిగింది, తొందరగా, లలిత.

"ఆ! రేపటినుంచే... నే చెప్పలేదూ.. తొందరపడి పది కొబ్బరికాయలూ దేవుడికి తాకట్టు పెట్టవద్దే అని"

"ఛా... అలా అనకూడదు... జీతం.."

"ఇదివరకటి ఆఫీసులోకన్న పది రూపాయలెక్కువ" అన్నాడు, కోటు విప్పుతూ.

ఆమెసంతోషాని కంతు లేకపోయింది.

దగ్గర ఉండి భర్తకు వేడినీళ్లు కాగబెట్టింది. భర్త నీళ్లు పోసుకుంటున్నంతసేపూ, అతనితో ఏవో కబుర్లు చెప్తూనేఉంది.

శంకరం విషయం విని సంతసించాడు. కాని బావగారి ఈ ఉద్యోగం మార్పుల గురించి కేవలం సంతోషమేకాక, కొంచెం శ్రద్ధకూడా చూపించవలసినఅవసరం కనిపించింది అతనికి.

"అయితే మరి.... అక్కా... ఆ మూడు వందలూ"

ఇలాంటి ఒడుదుడుకులను ముందుగానే పసిపట్టి, భర్త చెప్పిన పాఠాన్ని గుర్తుకు తెచ్చుకుంది.

"ఇంకా కొంతకాలం పట్టుతుందిట్రా.. ఆడిపాజిట్టు రావటానికి... అయినా మళ్లీ ఈ ఉద్యోగానికీ కట్టాలిట" అని అంది.

కోర్టుకు వెళ్తూ, "అక్కా... ఆమూడు వరసల గొలుసు తీసి బైటఉంచు...ఇంటి దగ్గర చాలా ఇబ్బందిగా ఉంది. నాన్నగారు తెమ్మన్నారు... మళ్లీ పంటల్లో ఇచ్చేస్తాంటే" అని. "ఇదిగో ఆందాకా... ఈ గోల్డుగోల్డు గొలుసుంచుకో." అని జేబులోంచి, పొట్లం తీసి ఇచ్చాడు.

ఊరికి వెళ్లిపోయే ముందు,అక్కను మళ్లీ హెచ్చరించాడు తమ్ముడు. "బావగారికి తెలియనివ్వకుసుమా... మన ప్రాణం తీస్తాడు."

తను కెప్పుడూ ఆదుకుంటున్న పుట్టింటి వారికి అవసరం వచ్చినప్పుడు తానుమటుకు కాదని ఎలా అంటుంది?

*   *   *

"ఏముండి పర్సులో ఏభయ్యే ఉన్నాయే మండీ!" అనిఅడిగింది, భర్త రాగానే పర్సు తీసి నోట్లు లెక్కబెట్టి.

"ఆ!" అన్నాడు.

"ఆ... అంటారేమిటి?... ఇదివరకటి ఉద్యోగంకన్న పదెక్కువకూడా అన్నారుగా, మరి వందా ఏవి?" అంది లలిత.

"సరే... ఇవ్వాళింటి చిలకా గోరింకల్లా ఉన్నాం. రేపు మీ తాతో, మామామో పుట్టుకొస్తే ...కొంచెం ఏమైనా వెనక వేసుకోవాలంటావా?"

"అయితే" అని అంది లలిత, కొంచెం సిగ్గుగా

"అయితే... ఏముంది....మరి బ్యాంకులో వేశాము... మిగతాది."

భర్తదూరదృష్టికి లలిత తృప్తిచెందింది. నెలకు ఏభయ్ నిల్వచేస్తే, ఏడాదికి ఆరువందలు... ఓహ్! ఇంకేమి కావాలి?

భార్యముఖంలో ప్రసన్నత, తృప్తి గమ

నించాడు. అంతతో ఊరుకోలేదు గోపాలం.

"ఎబ్బే... ఈ చీరె లేమీ బాగా లేవు నీకు... వచ్చే నెల మంచివి కొంటాను."

"ఆ! నా చీరెల కేంగాని, మీరింకా రెండుకోట్లు కుట్టించుకుందురూ!"

ఆఫీసులో తన పనిచూసి మేనేజరు ఎలా మెచ్చుకుంటాడో, తోటివాళ్లంతా తన్నెలా గౌరవిస్తారో అన్నీ వర్ణించి చెప్పాడు.

"అయితే ఈ ఆఫీసులోనూ అకౌంటెంటు ఉన్నాడా?" అని అడిగింది.

"ఆ! కాని నీలకంఠుడు కాదులే. మంచివాడు. దయానిధి అని పేరు పెట్టాను." అన్నాడు.

* * * *

"ఏమండీ... లలితగారూ.... మంచి చీరెలు వచ్చాయ్" అని పిలిచింది శారదాంబ, పొరుగామె.

అప్పుడే నడుంవాల్చిన లలిత గభుక్కున లేచి, గబగబా వెళ్లింది. మూటవిప్పి రకరకాల చీరెలు చూపిస్తున్నాడు, బేరగాడు.

"చాలా... చౌకండీ... ఎనిమిది రూపాయలు... తొమ్మిదిన్నర..."

శారదాంబ ఎనిమిది రూపాయల చీరెను ఆరురూపాయల కివ్వమంటోంది.

లలిత కిదేం నచ్చలేదు.

"కొంచెం మంచివి ఉంటే చూపించవోయ్." అంది.

"ఆ! అలాగే తల్లీ.. ఊ ఇదిగో....ఇది పన్నెండున్నర... అదా అది పదిహేను. ఊ... ఇది... ఇరవయ్."

లలిత ధరాలు చూసి శారదాంబ విస్తుపోయింది. ఎంత ఇదైనా, అతంతధరలు పెట్టా... పొరుగామె ఆశ్చర్యం చూసి లలిత మరింతతృప్తి చెందింది.

"ఈ పది రూపాయల చీరె చూడండి.. లలితగారూ! బాగానే ఉంది" అంది పొరుగామె.

"ఆ! ఏం బాగు...కొంటే, నాలు గెక్కువైనా మంచివే కొనాలి." అని, "బేరం చెప్పవయ్యా... ఆ ఇరవయ్యది పదిహేను కివ్వు" అంది లలిత.

"అలా శెలవిస్తే ఎలా తల్లీ? మీకు కాబట్టి ఇరవయ్ చెప్పా." అన్నాడు బేరగాడు.

"ఆవిడ పదిహేను కాదు, నీ ఇరవయ్యీ కాదు. పదహారున్నరకూ ఇచ్చెయ్యి..." అంది శారదాంబ.

"తీసుకోటాని కేం రెండు తీసుకుంటాగాని, పదహారున్నరకూడా ఎక్కువే" అంది లలిత.

ఒకటికూడా కాదు. రెండుట-లలితకింత లక్ష్మీప్రసన్నం ఎప్పుడైందా అనే కుతూహలంతో శారదాంబకు ఊపిరాడలేదు.

"అలా అనకమ్మా... ఆ అర్ధ వేసుకొని, పదిహేడుకు తీసుకోండి." అని మడత పెట్టి రెండు చీరెలూ లలితముందు పెట్టాడు.

లోపలకు వెళ్లారు లలిత, శారదాంబ. లలిత మెల్లగా అంది. "ఇవ్వాళ మావారు బ్యాంకునుంచి డబ్బు తెస్తారు. ప్రస్తుతం మీదగ్గర పైకం..."

"అయ్యో... అంత మాత్రంకూడానా.. అలా అయితే ఎనిమిది రూపాయల చీర రెండుకూ బేరంచెయ్యటం?... నే ఎరిగిన కొట్టువాడేలెండి... రేపు రమ్మంటాను." అంది శారదాంబ.

ఈ ఏర్పాటుకు సంతోషించి, రెండు చీరెలూ తీసుకొని, లలిత "మంచి జాకెట్టు గుడ్డలు ఉంటే రేపు తీసుకురా వచ్చేప్పుడు" అని బేరగాడిని పురమాయించింది.

* * * *

ఇంట్లో అడుగుపెట్టుతూనే, "ఏమిటీకుర్చీ ఇక్కడ" అని నోరూ వాయూ లేనికుర్చీని ఒక తాపుతన్నాడు గోపాలం. లోపలనుంచి గబగబా ఎంతో ఉత్సాహంతో, ముఖం కలకలాడుతూ లలిత వచ్చి గుమ్మంలో నుంచుంది. ఎలెక్ట్రిక్ దీపం వెలుతురులో జరీఅంచు గళ్లచీరె మెరుస్తోంది. ఆమె అతని ముఖంకేసి చూసింది—సంతోషంగా.

అతని ముఖంలో కోపం ఎరుపెక్కింది. గభుక్కున జేబులోంచి ఏదో తీసి మూలకు విసిరాడు. లలిత విస్తుపోయింది.

అతను ఇక ఆరంభించాడు.

"ఇంత మోసగాళ్లనుకోలేదు... మీవాళ్లు... ఇవ్వాళ నా పరువంతా బుగ్గిపాలయింది...ఇంకా నాడెం...రేపిపాటికి జైలులో కూడా ఉండేవాడిని. ఇక అదొక్కటే తక్కువైంది..." అన్నాడు.

ఆమె ఆపాదమస్తకం వణుకుతూ, "మీ రెక్కడకు తీసుకొని వెళ్లారు గొలుసు? ఎందుకు తీశారు?" అని కంపితస్వరంతో అడిగింది.

"ఎప్పుడు తీసేయేం? బ్యాంకువాళ్లకు ఇద్దామనగదా, చాల్లేవయ్యా... పెద్దమనిషివి.. పో...పో .. అని గొలుసు నా మీద పారేశారు." అన్నాడు హుంకరిస్తూ.

"బ్యాంకులో మన డబ్బుండగా...గొలుసెందుకూ?"

"ఆ... ఉంది... నీ తాతది, నా తాతదీని... బంగారపు గొలుసని ఇవ్వటమెందుకు? ఇంక మళ్లీ మీనాన్న ఈ గడప తొక్కుతాడా?"

అంతవరకూ అదృష్టమే అనుకుంది లలిత. తన్ను వీధిలోకి గెంటకపోతే అదే చాలు.

భోజనాలమధ్యలో, "ఏం... మా పసందైన చీరె కట్టావే...మీ తమ్ముడు...వెళ్తూ డబ్బేమన్నా...." అన్నాడతను. నిజానికిప్పుడతడు భార్యను చూసి ముగ్ధుడయాడు.

ఆమె ఏమీ మాట్లాడలేదు.

"పోన్లే పాపం గొలుసేది స్తేయేం...మంచి చీరైనా పెట్టాడు..." అన్నాడు.

"ఎవళ్లూ పెట్టలేదు. నేనే రెండు చీరెలు కొన్నాను. ఇదిన్నీ... గదిలో ఒకటి ఉంది...."

"డబ్బు!" అన్నాడతను ఆశ్చర్యంతో,

"మీ రివ్వాళ బ్యాంకునుంచి డబ్బు తెస్తామన్నారుగా..."

అతని ముఖాన నెత్తురుచుక్క లేదు. అన్నంకూడా మింగుడుపడట్లేదు...

"రెండూ చెరి పదిహేడు" అంది ముక్తసరిగా లలిత.

అతనికి వళ్లు ఒక్కమాటు చల్లబడ్డట్టయింది.

ఆమె నేత్రాంచలాలు చెమ్మగిలటం చూసి, అతనికి ఏడవాలో నవ్వాలో తెలియక, "బాగా ఉంది" అన్నాడు.

★

కౌంట్ ఆఫ్ మాంట్ క్రిస్టో

(8-వ పేజీ తరువాయి)

తీరని కోర్కెలు, అణచబడిన వాంఛలు వారి హృదయాలలో తలెత్తేవి. అప్పుడు గాఢ నిశ్వాసాలు విడిచేవారు.

ఒకనాటి రాత్రి డాంటె నిద్రలోనుంచి ఉలిక్కిపడిలేచాడు. తనన్నెవరో పిలుస్తున్నట్లు అతనికి తోచింది. కన్నులు తెరిచి చుట్టూ గాఢంగా అలుముకున్న చీకటిని చీల్చి చూడ్డానికి ప్రయత్నించాడు. ఎవరిదో ఆర్తనాదం, అందులోనే తనపేరు వినవచ్చినట్లయింది. పడకపైనుంచి లేచాడు డాంటీ. ముఖమంతటా చెమటపట్టింది. జాగ్రత్తగా చెవులొగ్గి ఆలకించాడు. నిస్సందేహంగా పిలుపు తన మిత్రుని గదివద్దనుంచే వచ్చిందనుకున్నాడు.

"అయ్యో దేవుడా! అదేనా?" అనుకున్నాడు డాంటీ. రాతి నెత్తి సొరంగంగుండా గబగబా వెళ్లాడు. రెండో చివర రాతిపలక తీసేసి ఉంది. రెపరెప లాడుతున్న కొవ్వొత్తిదీపం వెలుగులో, పడకను కరిచి పట్టుకుని గజగజ వొణికిపోతున్న వృద్ధుడు కనిపించాడు. వృద్ధుడు పాలిపోయి ఉన్నాడు. మెలికలు తిరిగిపోతున్నాడు.

వృద్ధుడు నీరస స్వరంతో విషాదభావంతో అన్నాడు: "చూశావా డాంటీ! నా పనేమైందో? ఏం జరిగిందో నీకు వేరే చెప్ప నవసరం లేదు."

ఎడ్మండ్‌కి మతిపోయి నట్లయింది. తన ఉనికినే మరిచిపోయి, ద్వారంవద్దకు పరుగెత్తి "రండి! రండి! త్వరగా రండి" అని సహాయం కోసం అరిచాడు.

ఫెరయా లేని సత్తువ తెచ్చుకొని "ఆగాగు. ఏమిటా పిచ్చి పని?" అన్నాడు. "ఇలాగయితే మన పని ఆఖరే ఇంక. ఇప్పుడింక మనం ఆలోచించవలసింది నిన్ను గురించే. నాయనా! ఇంక నీ చెర నీకు దుర్భరం కాకుండా ఉండాలంటే, నువ్వు తప్పించుకోవాలంటే ఏం చెయ్యాలో అదే ఆలోచించాలి. నేనిక్కడ చేసిన పనంతా నువ్వొక్కడవూ మళ్లీ చెయ్యాలంటే అనేక సంవత్సరాలు పట్టుతుంది. అంతే కాదు. నేను విడిచిపెట్టబోతున్న ఈ కూపం ఖాళీగా ఉండిపోదు. మరొక నిర్భాగ్యుణ్ని ఎవరినో ఇక్కడికి తీసుకొస్తారు. వచ్చే కొత్తబందీకి నువ్వు దేవతలా దొరుకుతావు. అతను బహుశా యువకుడై ఉండవచ్చు. నీ మాదిరిగానే బలశాలి, ఓర్మి కలవాడు కావచ్చును. నావల్ల జాప్యమైన నీ పరారీకి అతను తోడ్పడవచ్చును. భగవంతుడే నీ శ్రమకి ప్రతిఫల మివ్వగలడు. నష్టపరిచే దానికంటె దేవుడు ప్రసాదించేదే ఎప్పుడూ అధికం. ఇంక నేను మరణించే సమయం ఆసన్నమయింది."

డాంటీ చేతులు జోడించి "అయ్యయ్యో! అలా అనకండి" అని మాత్రం అనగలిగాడు. వృద్ధుని మాటలవల్ల ఉబికి వచ్చిన దుఃఖాన్ని అణుచుకుని ఇలా అన్నాడు: "ఇంతకు ముందొకసారి మిమ్మల్ని రక్షించాను. మళ్లీ రక్షించగలను." పడక నెత్తి కాళ్ల దిక్కున గోతిలో సీసాతీశాడు. అందులో మూడో వంతు ఔషధం ఇంకా ఉంది. "ఇదిగో చూడండి. ఈ అద్భుత సంజీవి ఇంకా ఉంది. చప్పున చెప్పండి. ఈమాటు దీంతోనే నేం చెయ్యాలి? కొత్తగా చెయ్యవలసినదేమైనా ఉందా? చెప్పండి. మిమ్మల్ని కాపాడతాను."

"ప్రయత్నించు. కాని అప్పుడే నా ఒళ్లు చల్లబడి పోతోంది. మళ్ళీ వొణుకు ఎక్కువగా వచ్చేస్తోంది పళ్లు విరిగి పోతున్నాయి. ఎముకలు బిగిసిపోతున్నట్లున్నాయి. అయిదునిమిషాల్లో మూర్ఛ పూర్తిగా వచ్చేస్తుంది. పావుగంటలో ఇక్కడింక నేనుండను. శవం మాత్రం మిగుల్తుంది."

"అయ్యయ్యో" అన్నాడు డాంటీ దుఃఖిస్తూ.

"మొదటిసారి ఏంచేశావో ఇప్పుడూ అదే చెయ్యి. అయితే ఈమాటు అంత సేపు వేచి ఉండద్దు. జీవతంత్రులప్పుడే మూగపోతున్నాయి." స్వాధీనంలో లేని కాలుచేతుల వంక కళ్లతో చూపుతూ, "మృత్యుదేవతకి అట్టే కష్టం ఉండదు. ఈమారు పదికి బదులు పన్నెండు చుక్కలు నాగొంతుకలో పొయ్యి. అప్పుడు నేను తేరుకోకపోయినట్లయితే, ఇంక నువ్వు నన్ను విడిచి వెళ్ళిపోవచ్చును. ఇంక నేను నిలవలేను. నన్ను పడకమీదికి చేర్చు" అన్నాడు.

ఎడ్మండ్ వృద్ధుని రెండు చేతులతోనూ ఎత్తి పడకపై పరుండపెట్టాడు.

ఫెరయా మెల్లిగా చెప్పాడు: "చూడు డాంటీ! ఇంక నిన్ను శాశ్వతంగా విడిచి వెళ్లిపోతున్నాను. నాయనా! నీకు సర్వ సౌఖ్యాలూ, సర్వ సౌభాగ్యం లభించాలని ఆశీర్వదిస్తున్నాను."

యువకుడు మోకాళ్లపై వొంగి ముఖాన్ని పడకలో దాచుకుని దుఃఖించ నారంభించాడు.

"డాంటీ! ఈ తుదిక్షణంలో, నాకు పరమ విశ్రాంతి లభించనున్న క్షణంలో, నేను చెప్తున్నమాట శ్రద్ధగా విను. నాకన్నులపై కమ్మిన మాయతెర లన్నిటినీ భగవంతుడు తొలగించాడు. స్పాడా వంశస్థుల ధననిక్షేపం నిజంగానే ఉంది. నామాట నమ్ము. నువ్వు తప్పించుకో గలిగినట్లయితే, వెంటనే, జాప్యం చెయ్యకుండా, మాంట్ క్రిస్టో ద్వీపానికి వెళ్లు. ఆభాగ్యమంతటినీ స్వాధీనం చేసుకో. నువ్వనుభవించిన కష్టాలింక చాలు. ఆభాగ్యంతో సౌఖ్యాలనందుకో."

వృద్ధుని శరీరం ఒక్కసారి గట్టిగా కంపించింది. డాంటీ తలెత్తి చూశాడు. వృద్ధుని నేత్రాలు రక్తరాగ రంజితాలైనాయి. తరవాత తెరిచిన కన్నులు చలనం లేకుండా ఉండిపోయినాయి. అతని పెదవులేవో మాటలు చ్చరిస్తున్నాయి.

"అయ్యయ్యో. నన్నప్పుడే విడిచిపోకండి. అయ్యో దేవుడా! ఆయనకి సత్తువనిచ్చి రక్షించు."

మరణోన్ముఖుడైన వృద్ధుడు డాంటీని వారించాడు. "బిగ్గరగా అరవకు. జాగ్రత్త! ఎవరైనా వినగలరు. అప్పుడు నన్ను రక్షించినా ప్రయోజనం ఉండదు. మనల్ని విడదీసేస్తారు. జాగ్రత్త."

"అవును. మీరు చెప్పినది నిజం. నేను నిశ్శబ్దంగ ఉంటాను. మిమ్మల్ని రక్షిస్తాను. మీరు బాధ పడుతున్నారే కాని, ఈమారు మూర్ఛ కిందటి మారు వచ్చిన దానికంటె తక్కువే."

"నాయనా! మోసపోతున్నావు. ఇప్పుడు తక్కువే బాధ పడుతున్నాను. కారణం, నిరోధించడానికి నాలో సత్తువ ఉడిగిపోయింది. నీవయస్సులో ఉన్న వారికైతే, ప్రాణాలపై తీపి, ఆత్మ విశ్వాసం ఉంటాయి. కాని వృద్ధులికి మృత్యువు స్పష్టంగా కనిపిస్తుంది. అదుగో, వస్తోంది. నాచూపు తగ్గిపోతోంది. నా మెదడు కల్లోలమై పోతోంది. నీచెయ్యేది డాంటీ! వెళ్లిపోతు న్నాను."

వృద్ధుడు ఒంటిలో మిగిలిన సత్తువనంతనూ తెచ్చుకుని ఒళ్లు బిగపట్టి, పడకపైనుంచి కొద్దిగా లేచి, "మాంట్ క్రిస్టో మాట మరిచిపోకు." అని అరిచి వెనక్కి వాలిపోయాడు.

ఈమారు మూర్ఛ భయంకరంగా వచ్చింది. కాలుచేతులు వంకర్లు తిరిగిపోయాయి. కనురెప్పలు వాచాయి. పెదవులమధ్య నురుగు వచ్చింది. చివరికి పడకపై నిశ్చలమైన శరీరం మిగిలింది. కొద్ది క్షణాలకుముందు అద్భుత మేధా సంపదగల ప్రజ్ఞాపురుషుని స్థానంలో చలనం లేని కట్టె మిగిలింది. డాంటీ దీపంతీసి, తలవంక ఒక రాతిపై పెట్టాడు. నిశ్చలదృష్టితో డాంటీ వృద్ధుని పరి

కించాడు. మెల్లిగా వృద్ధుని నోరు తెరిచి, కత్తి అడ్డుపెట్టి, సరిగ్గా పన్నెండు చుక్కలు ఔషధం పోశాడు. ఇంకా సీసాలో ఔషధం మిగిలిఉంది. ఏం జరుగుతుందోనని నిరీక్షిస్తూ కూచున్నాడు డాంటీ. పది నిమిషాలు గడిచింది. పావుగంట గడిచింది. అరగంట గడిచింది. కాని వృద్ధుని శరీరంలో కదలిక లేదు. డాంటీ కంపించిపోతున్నాడు. అతని జుట్టు నిక్కపొడుచుకుంది. ముఖమంతా చెమటపట్టింది. గుండె గబగబ కొట్టుకుంటోంది. తుది యత్నం చెయ్యాలనుకున్నాడు. ఈమారు మిగిలిన ఔషధమంతా వృద్ధుని గొంతుకలో పోశాడు. వెంటనే వృద్ధుని శరీరం గిజగిజలాడింది. కనుగ్రుడ్లు గిరగిరా తిరిగాయి. ఏడ్పువలె వినవచ్చిన నిశ్వాసం ఒకటి వెలువడింది. కొంతసేపటికి గిజగిజ కొట్టుకుంటున్న శరీరం కర్రవలె బిగిసిపోయింది. కన్నులు తెరుచుకుని ఉండిపోయినాయి. అరగంట గడిచింది, గంట గడిచింది. డాంటీ వృద్ధుని గుండెలపై చెయ్యి వేసి గంటసేపూ దుర్భర మనోవేదనతో నిరీక్షిస్తున్నాడు. క్రమక్రమంగా వృద్ధుని హృదయస్పందన క్షీణించింది. శరీరమంతా చల్లబడిపోయింది. చివరికి వృద్ధుని ప్రాణాలు ఎగిరిపోయినాయి.

అప్పటికి ఉదయం ఆరుగంటలయింది. తెల్లవారుతోంది. కొవ్వొత్తి దీపపు వెలుగు, కిటికీలోనుంచి వస్తున్న వెలుగులో క్షీణించి పోతోంది. చీకటి వెలుగులమధ్య సంఘర్షణ సాగుతున్నంతసేపూ డాంటీ ఆశతో పెనుగులాడుతూనే ఉన్నాడు. కాని గది పొద్దుటి వెలుగుతో నిండిపోగానే అతని ఆశలన్నీ అడుగంటాయి. ఇంక పడకపైనున్నది శవంమాత్రమే నని నిర్ధారణయింది. అతన్ని భీతి ఆవహించింది. డాంటీ కొవ్వొత్తి దీపాన్ని ఆర్పి, జాగ్రత్తగా దాచి, సొరంగం ప్రవేశించి, రంధ్రాన్ని రాతి పలకతో కప్పివెళ్ళిపోయాడు. జైలర్ వచ్చే వేళయింది. జైలర్ ముందుగా డాంటీ గదికి వచ్చాడు. తరవాతనే ఫెరయా గదికి వెళ్ళాడు. అక్కడేం జరుగుతుందో చూడాలని డాంటీకి గట్టికోరిక కలిగింది. మెల్లిగా సొరంగంలోకి వెళ్ళి, రాతిపలక చాటున నిలబడి సవ్వడి ఆలకించాడు. జైలర్ సహాయంకోసం కేకలు వెయ్యడం విన్నాడు. వార్డర్లు కొందరు వచ్చారు. తరవాత సిపాయిలు వచ్చారు. చివరికి గవర్నర్ వచ్చాడు. తరవాత పడక కదిలిన చప్పుడయింది. ముఖంపైన చన్నీళ్లు చల్లాలని గవర్నర్ ఆజ్ఞ ఇచ్చాడు. ఫలితం లేకపోడంవల్ల కాబోలు డాక్టర్‌ని పిలిపించడానికి గవర్నర్ ఆజ్ఞ ఇచ్చాడు. గవర్నర్ గదివిడిచి వెళ్ళాడు. వెళ్లేముందు మొరటుపరిహాసంతో కూడిన సానుభూతి వాక్కులు పలికాడు.

"చివరికి పిచ్చివాడు తన ధనంకోసం వెతుక్కుంటూ వెళ్లాడు." అన్నాడొకడు.

"ఎన్ని లక్షలుంటే ఏం లాభం? పాపం శవంమీద కప్పడానికి గుడ్డేనా లేదు" అన్నాడు మరొకడు.

"అబ్బే! ఇఫ్ కోటలో శవాలు కప్పే గుడ్డలకి లోటేమిటి?" అన్నాడింకొకడు.

ఎడ్మండ్ అతి జాగ్రత్తగా విన్నాడు. చివరికి మనుషుల మాటలు ఆగిపోయాయి. అందరూ వెళ్లిపోయారనుకున్నాడు. కాని అక్కడెవరినైనా కాపలా ఉంచి ఉంటారనే భయంవల్ల డాంటీ గది ప్రవేశించడానికి సాహసించలేదు. గట్టిగా ఊపిరైనా విడవకుండా డాంటీ మౌనంగా నిరీక్షిస్తూ అక్కడే ఉండిపోయాడు. గంటసేపటికి మళ్లీ అడుగుల చప్పుడు వినబడింది. డాక్టర్‌తోనూ కొందరు ఆఫీసర్లతోనూ కలిసి గవర్నర్ మళ్లీ వచ్చాడు. అంతా నిశ్శబ్దంగా ఉన్నారు. డాక్టర్ పడక సమీపించి శవాన్ని పరీక్ష చేశాడు. కొన్ని ప్రశ్నలు వేసి రోగలక్షణాలు పరిశీలించాడు. చివరికి బందీ మృతుడైనాడని నిర్ధారణచేసి చెప్పాడు.

గవర్నర్ అన్నాడు: "పాపం. చాలా నెమ్మదైనవాడు. ఎవరికీ అపకారం తలపెట్టేవాడు కాదు. తన భ్రమల్లో తను ఆనందించేవాడు. అదుపులో ఉంచడానికి కష్టమే లేకపోయింది."

"అవునండి పాపం" అన్నాడు జైలర్. "అసలు అతన్ని కనిపెట్టి చూడవలసిన అవసరమే లేకపోయేది. ఏభై యేళ్లు ఖైదులో ఉంచినా సరే తప్పించుకుని పారిపోయే రకం కాదు."

"నువ్వెంత నమ్మకంగా చెప్పినా సరే, వాడు చచ్చిపోయాడని నిర్ధారణగా తేల్చవలసిందే. అప్పుడు కాని నాబాధ్యత తీరదు." అన్నాడు గవర్నర్.

కొద్దిసేపు అందరూ నిశ్శబ్దంగా ఉన్నారు. శవాన్ని డాక్టర్ మళ్ళీ పరీక్షచేస్తున్నాడని డాంటీ భావించాడు.

"ఇతను నిశ్చయంగా చచ్చిపోయాడు. నాది జవాబుదారీ" అన్నాడు డాక్టర్.

గవర్నర్ అన్నాడు: "ఇటువంటివిషయాల్లో మామూలు నాడి పరీక్షల్తో మాకు తృప్తికలగదని మీకు తెలుసును డాక్టర్. పైకి ఎలా కనిపించినప్పటికీ, మా నియమాలప్రకారం అన్నీ జరిపి మరీ నిర్ధారణచెయ్యండి."

"తప్పకుండా, అలాగే. ఇనపకడ్డీలు ఎర్రగా కాల్చి తెప్పించండి. నిజానికిదంతా అనవసరమే."

కాల్చిన ఇనపకడ్డీల మాట వినిపించేసరికి డాంటీ కంపించి పోయాడు. గబగబ అడుగుల చప్పుడు, తలుపులు తీసినచప్పుడూ వినవచ్చాయి. తరవాత కొంతసేపటికి జైలర్‌మాటలు వినిపించాయి. "ఇవిగోనండి ఇనపకడ్డీలు."

తరవాత కొంతసేపు నిశ్శబ్దంగా ఉంది. ఆపైన చిటపటమన్న చప్పుడు వినవచ్చింది. దానితోపాటు చర్మం కాలినవాసన వేసింది. డాంటీకి నరాలపట్లు తప్పినట్లయింది. తరవాత డాక్టర్ మాటలు వినవచ్చాయి. "చూశారా! ఇతను చచ్చిపోయాడు. మడమలు కాల్చడమే దీనికి నిర్ధారణ. పాపం ఇతని పిచ్చికుదిరిపోయింది. చెర ఆఖరయింది. ఇంక శవానికి జరిపించవలసిన క్రియలన్నీ సవ్యంగా జరిపించవచ్చును."

"అవునవును. మా దగ్గరున్న గోనెసంచుల్లో కొత్తది తెచ్చి అందులో అతన్ని కప్పుతాం. ఆచారాలన్నీ అనుసరించబడతాయి."

"శవాన్ని గోనెలో చుట్టమంటారా?" అని అడిగాడు జైలర్.

"అవును. వెంటనే కానియ్యి. నే నిక్కడ రోజంతా కనిపెట్టుకుని ఉండలేను."

తరవాత మళ్ళీ పదధ్వనులు వినవచ్చాయి. పడక చప్పుడయింది. తరవాత ఎవరో బరువు మోస్తున్నట్లు బరువైనపదధ్వనులు వినిపించాయి. తిరిగి బరువును దించిన చప్పుడయింది.

"సరే. ఇది ఇవాళ సాయంకాలం చూదాం" అన్నాడు గవర్నర్.

"అంత్యక్రియలు జరిగేచోట ప్రార్థన లుంటాయా?" అని ఒక ఆఫీసరు అడిగాడు.

"అబ్బబ్బే అదెలాగ?" అన్నాడు గవర్నర్. "చాప్లెన్ (క్రైస్తవ ప్రార్థనలు చదివేవాడు) వారంరోజులు సెలవడిగాడు. ఒప్పుకున్నాను. అంత్యక్రియల సమయంలో ప్రార్థనలు జరపాలని కోరుకున్నవాడైతే, ఈ ఫాదరీని ఇంత తొందరపడి ఎవరు చావమన్నారు?"

అందరూ ఫకాలున నవ్వారు.

"సరే ఇది ఇవాళ సాయంకాలం జరుగుతుంది" అన్నాడు గవర్నర్.

"ఎన్ని గంటలకండి?" అని అడిగాడు జైలర్.

"పది, పదకొండు గంటలకి"

"శవందగ్గిర ఎవరైనా కాపలా ఉండాలా?"

"అక్కర్లేదు. మామూలుగానే గదికి తాళంవెయ్యి."

తరవాత అందరూ వెళ్లిపోయారు. తలుపులు మూయబడినాయి. గదిఅంతటా భారమైన నిశ్శబ్దం వ్యాపించింది. ఈ నిశ్శబ్దంలో యువకుని హృదయం దుఃఖంతో బ్రద్దలౌతున్నట్లుంది. మెల్లిగా రాతి పలకనెత్తి గదిలోకి తొంగిచూశాడు. తరవాత గది ప్రవేశించాడు.

20

కిటికీలోనుంచి వస్తున్న వెలుతురులో చూశాడు. పడకపైన నిలువెల్లా ఆక్రమించిన గోనెసంచి కనపడింది. ఇదే ఫెరయా శరీరాన్ని కప్పిన తుది ఆచ్ఛాదన. డాంటేకీ అతని మిత్రునికీ మధ్య ఇప్పుడొక ఆచ్ఛాదన అడ్డుగా ఉంది. డాంటే పడకచివర కూర్చుని దుఃఖిస్తున్నాడు. ఇప్పుడతను ఒంటరి. మళ్లీ ఒంటరైనాడు. మళ్ళీ ఘోర నిశ్శబ్దం అతని జీవితాన్ని ముంచివేస్తుంది. ఇంక అతను ప్రాణమిత్రుని చూడలేడు. అతనిని కుమారునివలె ప్రేమించి ఉపదేశాలిచ్చిన ఫెరయా కంఠస్వరం ఇంక వినరాదు. ఇంక ఫెరయావలనే తన మనుగడసమస్యను కూడా పరిష్కరించుకుంటే మేలు కాదా అని ప్రశ్నించుకున్నాడు. మొదట శారీరకబాధ ననుభవిస్తే మాత్రమేం? ఫెరయా మైత్రివల్ల మానుకున్న ఆత్మహత్యాభావం తిరిగి అతని మనస్సులో ఉత్పన్నమయింది. మిత్రుని కళేబరం సన్నిధిలో తిరిగి ఆత్మహత్య పీడకలవలె పొడగట్టింది.

"నేను చనిపోయినట్లయితే, అతనెక్కడికి వెళ్లాడో నేనూ అక్కడికే వెళ్లాలి. కాని ఎలా మరణించడం? అయినా అది చాల సులువైనదే ననిపిస్తోంది. నేనిక్కడే ఉండిపోయి, తలుపు తీసి లోనికి వచ్చే వ్యక్తిపైన పడి, గొంతు పిసికి చంపినట్లయితే, నన్ను ఉరితీస్తారు."

కాని ఇటువంటి నీచమైన మరణాన్నిగురించి తల్చుకున్నప్పుడు డాంటే మనస్సు ఒడబడ లేదు. స్వేచ్ఛాజీవనం గడపాలనే వాంఛ వచ్చి ఈ తలపుల్ని మరపింపచేసింది.

"చచ్చిపోడమా? ఊహు. వొద్దు. వొద్దు" అనుకున్నాడు. "ఇన్నాళ్లు బతికి, ఇంతకాలం కష్టా లనుభవించి, ఇప్పుడు చచ్చిపోడమా? ఇదివరలో, కొన్ని ఏళ్ల కిందట అటువంటి నిశ్చయం చేసుకున్నానంటే, అది అప్పటికి మంచిదే. కాని ఇప్పుడు చావుకి యత్నించడం అంటే, దుర్విధికీ, దుఃఖానికీ లొంగిపోడమన్న మాట. అలా వీల్లేదు. నేను జీవించాలి. బలాత్కారంగా నిర్మూలించబడిన నా సౌఖ్యాన్ని నేను తిరిగి జయించి తెచ్చుకోవాలి. నేను చనిపోయేముందు, నన్నీ యాతనలకు గురిచేసినవారిని శిక్షించాలి. కొందరు మిత్రులున్నారేమో! ఎవరికి తెలుసును? వారికి ప్రతిఫలమివ్వాలి. ఇక్కడే నిర్బంధంలో ఉండిపోయి, ఫెరయావలె సమాధికి వెళ్లడమా? అలా జరగకూడదు!"

ఈమాట లనుకుంటూ ఉండగా, ఎడ్మండ్ ఉలిక్కిపడ్డాడు. తరవాత నిశ్చలంగా ఉండిపోయాడు. అకస్మాత్తుగా ఏదో భయంకరమైన యోచన తట్టినవానివలె, గుడ్లు వెళ్లబెట్టి చూస్తూ ఉండిపోయాడు. మెల్లిగా లేచాడు. తల దిమ్మెక్కినట్లు కణతలు నొక్కిపట్టుకున్నాడు. రెండుమూడుసార్లు ఇటూ అటూ పచార్లు చేశాడు. పడకవద్ద నిలిచాడు. "ఆ! ఇటువంటి ఆలోచన నాకెలా కలిగింది? ఎవరు కలగచేశారు? అయ్యో! భగవంతుడా! నువ్వే ఈ ఆలోచన నాకు కలిగింప చేశావా? మృతినొందినవారు తప్ప ఈచోటు విడిచివెళ్లలేరు కాబట్టి, మృతిచెందినవారి స్థానం ఆక్రమించరాదా?"

రెండోసారి ఆలోచించడానికి ఆగకుండా, డాంటే వెంటనే గోనెసంచిమీదికి వంగి, కత్తితో తాళ్లు కోసి తెరిచాడు. కత్తి ఫెరయా తయారుచేసినదే! జాగ్రత్తగా శవాన్ని సంచిలోనుంచి తీశాడు. సారంగ మార్గంగుండా శవాన్ని తన గదికి తీసుకువెళ్ళి తన పడకపై పరుండబెట్టాడు. ఆఖరుసారి వృద్ధుని నుదుటిని చుంబించాడు, శిరస్సుపై గుడ్డకట్టాడు. తెరిచి ఉన్న కళ్లను మూయడానికి ప్రయత్నించాడు కాని విఫలుడైనాడు. ముఖం గోడవైపుకు తిప్పి పడుకోబెట్టాడు. జైలర్ ఆహారం తీసుకువచ్చినప్పుడు డాంటేయే నిద్రపోతున్నాడని భావించడానికి, ఒంటిపైన గుడ్డ కప్పాడు.

సారంగం ప్రవేశించి, పడకను గోడకుదగ్గరగా లాగి, రంధ్రాన్ని రాతితో మూసేశాడు. రెండోగది ప్రవేశించి, గోతిలో దాచబడిన సూదీ, దారం తీసుకున్నాడు. తన వస్త్రాలు విడిచేసి వానిని చేతపట్టి గోనెసంచిలో దూరాడు. కాళ్లుచాచి, సంచిని పైన మూసి, లోపలినుంచి సూదీదారంతో కుట్టేశాడు. ఇప్పుడు గోనెసంచి తాకేవారికి లోపల నగ్నమైన శరీరమే ఉన్నట్లు చేతికి తగుల్తుంది. అసలు జైలర్ వచ్చివెళ్ళేవరకూ వేచి ఉండేవాడే. కాని ఈలోగానే గవర్నర్ మనస్సు మార్చుకుని రావచ్చునని డాంటే భయపడ్డాడు. అలా జరిగితే, డాంటే తుదిఆశకూడా భగ్నమైపోతుంది. నిశ్చయించుకున్న కార్యాన్ని వెంటనే నెరవేర్చాడు. ఇకముందు ఏం చెయ్యాలో డాంటే ఆలోచించడం మొదలుపెట్టాడు. శవాన్ని సమాధివద్దకు తీసుకువెళ్లేదారిలో, శవవాహకులు తాము మోస్తున్నది సజీవియైన వ్యక్తి అని అనుమానించినట్లయితే, వాళ్లకి పరిశీలించడానికి కూడా అవకాశ మివ్వకూడదనుకున్నాడు. సంచిని కత్తితో ఒక్కవేటున చీల్చి, బైటపడి వాళ్ళు బెదిరిపోయిన అదనులోనే పారిపోవాలి. వాళ్లు పట్టుకోడానికి ప్రయత్నించినట్లయితే కత్తినెత్తి వాళ్ల నెదిరించాలి. అలా జరక్కుండా వాళ్లు అతన్ని సమాధివద్దకు తీసుకువెళ్లి పాతిపెట్టినట్లయితే, మాట్లాడ కూరుకుంటాడు. వాళు మన్నుపోసి పూడ్చిపెడతారు. రాత్రి చీకటిపడేవరకూ నిరీక్షించి, తరవాత లేచి తప్పించుకుని వెళ్లిపోవాలి. పూడ్చిపెట్టిన మట్టి బరువై, ఊపిరాడక చచ్చిపోతే, మరీ మంచిది. అప్పుడంతా ఆఖరైపోతుంది.

ఇంకొక ప్రమాదం కూడా ఉందనుకున్నాడు డాంటే. జైలర్ డాంటే గదిలో శవాన్ని కనిపెట్టి, మోసం బైటపెట్టవచ్చును. కాని తరుచు డాంటే నిద్రిస్తున్న సమయంలోనే జైలర్ ఆహారం తెచ్చిఇవ్వడం జరిగేది. జైలర్ మాట్లాడకుండా ఆహారాన్ని ముక్కాలిపీటపైన పెట్టి వెళ్లిపోయేవాడు. ఈమారు జైలర్ పలకరించాలనుకుంటే? సమాధానం రాక, అతను పడకవద్దకు వెళ్లి చూసినట్లయితే? అప్పుడంతా తెలిసిపోతుంది.

ఏడుగంటలు కొట్టింది. జైలర్ వచ్చేవేళయింది. డాంటే మనోవేదన ఇనుమడించింది. ఒక చేతితో ఛాతీ నొక్కిపట్టి, గుండె దడ నణుచుకోడానికి ప్రయత్నించాడు. రెండో చేతితో, ధారలు కట్టి కారుతున్న చెమటను నుదుటినుంచి తుడుచుకుంటున్నాడు. మాటిమాటికీ అతని శరీరం కంపించ నారంభించింది. గంటలు మెల్లిగా నడుస్తున్నాయి. ఎక్కడా కలకలం వినరావడం లేదు. అందువల్ల తనగదిలో మోసాన్ని జైలర్ కనిపెట్టలేదు.

డాంటే గ్రహించాడు. చివరికి పదిగంటలవేళ ద్వారంవద్ద అడుగుల చప్పుడయింది. డాంటే ధైర్యం చిక్కబట్టుకుని, ఊపిరి బిగబట్టాడు. హృదయస్పందన ఆగిపోతే బాగుండు ననుకున్నాడు. ఇద్దరు మనుష్యులు వచ్చి ద్వారంవద్ద ఆగినట్లు డాంటే ఊహించాడు. ఇద్దరూ శవవాహకులనుకున్నాడు. శవాలను మోసే బల్లచెక్కను కిందపడేసిన చప్పుడు విన్న తరవాత అతని ఊహ స్థిరపడింది. తలుపులు తెరుచుకున్నాయి. పెద్ద కాగడావెలుగులో ఇద్దరి ఆకారాలు డాంటేకి గోనెగుడ్డగుండా కనపడ్డాయి. ఆ ఆకారాలు పడకవద్దకు వచ్చాయి. మూడో ఆకారం ద్వారంవద్ద ఉంది. కాగడా అతని చేతిలో ఉంది.

ఇద్దరు శవవాహకులూ వచ్చి గోనెసంచిని చెరొక చివరా పట్టుకున్నారు. తలవంక నున్నవాడు సంచీని ఆచివరనెత్తి, "అరే ! ముసలాడు బక్కచిక్కి ఉండేవాడే ! కాని ఎంత బరువున్నాడో !" అన్నాడు.

కాళ్లపక్క మరొకడు సంచీ నెత్తి, "ఏడాదికి అర పౌను లెక్కని ఎముకలు బరువెక్కుతా యంటారు" అన్నాడు.

"ముడేశావా?"

"ఇప్పుడెందుకులే. బరువెక్కుతుంది. అనవసరం. తరవాత ముడేస్తాలే."

"ముడా? ముడెందుకు? అనుకున్నాడు డాంటే తనలో.

శవం అనుకున్నదాన్ని ఇద్దరూ మోసి బల్లమీదికి చేర్చారు. ఎందుకేనా మంచిదని డాంటే ఒళ్లు బిర్ర బిగించాడు. శవవాహనం మెల్లిగా మెట్లెక్కింది. ముందొకడు కాగడా పట్టుకుని నడుస్తున్నాడు. అందరూ ఆవరణలోకి వచ్చారు. డాంటేకి చల్లని గాలి తగిలింది: శుభ్రవాయువు సోకగానే డాంటేని ఆనందం, ఆందోళన ఒక్కసారి ముప్పిరిగొన్నాయి. శవవాహకులు ఇరవై అడుగులు నడిచి బల్లను నేలకు దించారు. ఒకడు నడిచి వెళ్లిపోయాడు. ఇటుకరాళ్లపైన అతని అడుగులు స్పష్టంగా వినపడ్డాయి డాంటేకి. వెంటనే లేచి పారిపోవాలనిపించింది అతనికి. కాని ఆ కోరికను అణుచుకున్నాడు.

తరవాత పక్కగా ఒక బరువైన వస్తువుని పడవేసిన చప్పుడైంది. వెంటనే కాళ్ళకు ఒక పగ్గం గట్టిగా బిగించి ముడివెయ్యడింది. డాంటేకి నొప్పి కలిగింది.

"మాడు. ముడి సరిగ్గా బిగిసిందా?" అన్నాడొకడు.

"ఓ ! బలేగా బిగిసింది."

"సరే నడు."

మళ్లీ బల్లనెత్తి శవవాహకులు మోసుకువెళ్లారు. కొద్ది దూరంలో ఆగి ఒక ద్వారం తలుపులు తీశారు. ద్వారం దాటగానే రాళ్లగుట్టలపై పడి విరుగుతున్న సముద్ర కెరటాల ఘోషణ డాంటేకి వినవచ్చింది.

"మబ్బు పట్టింది. గాలిపాటు బాగుండలేదు. సముద్రంలో మునకలకి మంచి వేళ కాదు" అన్నాడొకడు.

"పాపం ఫాదరీకి ఒళ్లు తడిసి ముద్దౌతుంది" అన్నాడు మరొకడు. ఇద్దరూ నవ్వుకున్నారు.

ఈ పరిహాసం డాంటేకి బోధపడలేదు. భయంతో అతని ఒళ్లంతా గగుర్పొడిచింది.

"ఆ! ఇంక దించు" అన్నాడొకడు.

"కాదు కాదు. ఇంకొంచెం దూరం నడు" అన్నాడు మరొకడు. "జ్ఞాపకం లేదూ ? కిందటిసారి శవం మధ్యలోనే రాళ్ళమీద పడిపోయింది. గవర్నర్ మనల్ని ఒట్టి సోమరిపోతులన్నాడు కూడా."

ఇద్దరూ ఇంక కొంచెం దూరం వెళ్లారు. అక్కడ బల్ల దించి, కాళ్ళొకడు, తలొకడు పట్టుకుని డాంటేని లేవదీశారు. ఆపైన గంజికావడి పట్టినట్లు ఇటూ అటూ ఊపడం మొదలుపెట్టారు.

"ఒకటి, రెండు, మూడు, ఊ!" అన్నారు శవవాహకులు. ఒక్క ఊపున గాలిలోకి విసరబడినట్లయింది డాంటేకి. తుపాకి దెబ్బతిన్న పక్షిలాగ గాలిలో జారిపోతున్నాడు. గుండె ఆగిపోయినట్లయిందిఅతనికి. పెద్ద బరువొకటి వేలాడుతున్నందువల్ల మరింత వేగంతో పడిపోతున్నాడు. పడిపోడానికి ఒక యుగం పట్టుతున్నట్లుంది. తరవాత నరాలు బిగిసే చలినీళ్లలో తభాలున పడ్డాడు. అతని ఆర్తనాదం నీటిచప్పుడులో మణిగిపోయింది.

డాంటేని సముద్రంలోకి విసిరేశారు. కాళ్లకు కట్టిన ఇనప గుండు అతన్ని అతివేగంతో కిందికి లాక్కుపోతోంది.

ఇఫ్ కోటలో బందీలకి సమాధి సముద్రమే !

★

★ అదీ - ఇదీ ★

రష్యాలో ధరల తగ్గింపు

ఈ మార్చి నెలారంభంనుంచి సోవియట్ యూనియన్‌లో కొత్త ధరలు అమలు జరుగుతాయని మాస్కోలో ప్రకటింపబడింది. ఈ వార్తను బ్రిటిష్ పత్రికలు సవతితల్లి ప్రేమతో ప్రకటించినప్పటికీ ఆర్థికంగా దానికి చాలా ప్రాధాన్యమున్నది. సోవియట్ యూనియన్‌లో చిల్లరధరలు 1947 తరువాత నాలుగుసార్లు బాగా తగ్గించబడ్డాయి. ఇది నాలుగోసారి. అన్నిరకాల పదార్థాలు, సబ్బులు, సిగరెట్లు, పొగాకు, రేడియో సెట్లు, సైకిళ్లు, గడియారాలు, కుర్చీలు మొదలైన కొయ్యసామాను, ఇంకా అనేకమైన ప్రజోపయోగకారులైన వస్తువుల ధరలు నూటికి 10 నుండి 25 వంతులవరకూ తగ్గించబడ్డాయి.

యుద్ధానంతరం ప్రవేశపెట్టబడిన పంచవర్ష ప్రణాళిక అనుకున్నదానికంటె ఎక్కువ విజయం పొందినందున ఇలా ధరలు తగ్గించటానికి వీలైంది. 1940 లో జాతీయాదాయం 100 ఉండగా ఇప్పుడది 160 అయినది. పారిశ్రామిక ఉత్పత్తి 1940 లో 100 ఉండగా, 1948 లో 118, ఇప్పుడు 174 ఉన్నది. సోవియట్ యూనియన్‌లో ప్లాన్ ప్రకారం జరుగుతున్న ఉత్పత్తిలో యంత్ర పరికరాలు, ట్రాక్టర్లు మొదలైన భారీసామగ్రికే ఎక్కువ ప్రాధాన్యమివ్వబడుతున్నది. కాని తాజాగా జరిగిన ధరల తగ్గింపునుబట్టి చూస్తే, ప్రజావసర వస్తువులను కూడా క్రమంగా ఎక్కువ ఉత్పత్తి చేస్తున్నట్లు స్పష్టమవుతున్నది. ఆయుధనిర్మాణానికి చేస్తున్న ఖర్చు జాస్తిగా ఉంటే- ఉండవచ్చుగాక— (మొత్తం బడ్జెట్‌లో అయిదోవంతు) కాని ప్రజావసర వస్తూత్పత్తికి కూడా అమితంగా వినియోగిస్తున్నట్లు ఒప్పుకోవాలి.

(న్యూస్టేట్స్‌మన్ ఎండ్ నేషన్‌లో సంపాదకీయం)

*** "** ***

ఆంధ్రకాంగ్రెస్

(5-వ పేజీ తరువాయి)

(రాయబారాల మధ్యలో గోపాలరెడ్డిగారు అకస్మాత్తుగా ఎందుకు మానుకున్నారో తిమ్మారెడ్డిగారు ఆశ్చర్యపడ్డారట.) తమలో ఎవరిని నిలబెట్టడమో వెతుక్కున్నారు. వెతుక్కోవచ్చేసరికి మంత్రులలో తప్ప, ఇతరత్రా ఈ పదవికి నిలబెట్టడానికి ఎవరూ దొరకలేదుట. అంతేకాదు. ఈ మాటు రాయలసీమకి రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షపదవిని ప్రసాదిస్తేగాని, వస్తేగిస్తే ఆంధ్రరాష్ట్ర సమస్య వివాదలో రాయలసీమ నాయకులు ఎదురుతిరుగుతారని కొందరు భయపెట్టారుట. కొందరు నిజంగా భయపడ్డారు; కొందరు భయపడినట్టు నటించి, భయపడకపోతే (లేని) ఆంధ్రరాష్ట్రం భగ్నమైపోక తప్పదని, ఇతరుల్ని భయపెట్టడానికి ప్రయత్నించారు. (కీడు తప్ప మరొకటి తగలని ఆంధ్రరాష్ట్రానికి ఇంక ఇంతకంటె వచ్చే ముప్పేమిటో, ఆ పేరునా, ఈ మిషమీదా రాజకీయ తంత్రాలు నడిపే నాయకులికే తెలియాలి.) మంత్రివర్గం అంతా వెతుక్కుంటూ వెడితే పూలమాల (అప్పుడే) సంజీవిరెడ్డిగారి మెడలో పడింది.

మంత్రివర్గంలో "ఐక్యత"కోసం రాయబారాలు జరిపినవాళ్లల్లో ప్రకాశంగారు కూడా ఒకరు ఉన్నారనేమాట మరిచిపోయిన రంగాగారికి, ఇంక తాము నిలబడాలంటే పోటీ తప్పదని స్థిరపడిన తరవాత, ప్రకాశంగారున్నారని అకస్మాత్తుగా జ్ఞప్తికి వచ్చింది.

ప్రకాశంగారిని ఒకసారి ఒకరు, ఈ రాయబారాల్లో మీరు ఎటున్నారండీ అని ఒకరడిగితే, "నే నెవరి పక్షమూ ఉండను. మిగతావాళ్లే నా దగ్గిర కొస్తారు" అనో, ఈమాదిరిగానో అన్నారు. ప్రకాశంగారి దగ్గిరికి మంత్రివర్గంవారెవరూ రాలేదు. రాయబారాల తంతు ముగిసిన తరవాత రంగాగారు వచ్చారు. ఇద్దరి వర్గాలూ ప్రకాశంగారింట్లో శుక్రవారం నాడు సమావేశమైనాయి. అప్పుడు ప్రకాశం వర్గంవారొకరు లేచి ఒక ధర్మసందేహం వెలిబుచ్చారు. "ఇప్పుడిక్కడ ఉన్నవారు ఒక వర్గమా? లేక రెండు వర్గాలా?" తనమట్టుకు తాను ఒక్కవర్గంగానే భావిస్తున్నట్టు రంగాగారు చెప్పుకున్నారట. రెండు వర్గాలున్నాయనుకుంటే మాత్రమేమిటి, పోయిందేమీ లేదని ప్రకాశం వర్గంవారొకన్నారు. ఇదివరలో మంత్రివర్గంతో రాయబారాల్లో రంగావర్గం తమకు 10, మంత్రివర్గానికి 8, ప్రకాశం వర్గానికి 2 చొప్పున కార్యవర్గంలో స్థానాల పంపిణీ సూచించి ఉన్నారు. అలా ఎవరు పంపిణీచేశారని అడిగితే రంగాగారు తమకి తెలియదన్నారుట.

ఏమయితేనేమి, ఈ రెండు వర్గాలూ గతాన్ని మరిచిపోయి ఏకమైనాయి. మంత్రివర్గం పోటీమానుకోడాని కొప్పుకుంటే ప్రకాశంగారినీ, లేకపోతే రంగాగారినీ నిలబెట్టడానికి ఒప్పుదల కుదిరింది. రంగాగారు ఎన్నికైతే కార్యవర్గాన్ని ప్రకాశంగారు నియమించాలని కూడా అనుకున్నారు. మంత్రివర్గం పోటీలేకుండా ప్రకాశంగారిని ఎన్నుకోడానికి ఒప్పుకోలేదు. ఒప్పుకోకపోతే నిష్కర్షగా అలా చెప్తే బాగానే ఉండేది కాని దానికి పదిమంది పదివిధాల సంజాయిషీ ప్రకటనలు చేశారు. ఐకమత్యం కోరినవారైతే ప్రకాశంగారు తమ వర్గాన్ని కూడా వారి ఇంటిలో సమావేశానికి ఆహ్వానించి ఉండవలసిందన్నారు. రంగాగారు ప్రకాశంగారిని జేబులో వేసుకున్నారన్నారు. (ఆర్. సూర్యనారాయణరావుగారు కాంగ్రెస్‌లో ఉన్నట్లయితే, రాయలసీమని గోపాలరెడ్డిగారు జేబులో వేసుకున్నారనేవారే.)

వెంకట్రావుగారి ప్రకటనమాత్రం ఆలిండియా కాంగ్రెస్ కార్యదర్శికి తగినట్లు ఉంది. నియమవర్తనకు పేరుపడినవారే రాష్ట్రకాంగ్రెస్ అధ్యక్షపదవికి నిలబడాలని, అప్పుడే ఐకమత్యం సార్థకమౌతుందనీ అన్నారు. అంటే ప్రకాశంగారూ రంగాగారూ కూడా వారికి నచ్చలేదని అక్షరాలా మాత్రం చెప్పలేదన్నమాట. నియమవర్తనన్ని బట్టి పదవి నివ్వాలంటే ఆంధ్రరాష్ట్ర కాంగ్రెస్‌కి ఎన్ని జన్మలెత్తినా అధ్యక్షుడు దొరకడు. నియమోల్లంఘనలో ఎవరు గొప్ప అని పోటీ పెడితే వెంకట్రావుగారు, రంగాగారే కాదు, అనేకమంది దొరుకుతారు. ★

అదీ-ఇదీ

"సమష్టి భద్రత"

1939 లో "సమష్టి భద్రత" పట్ల బ్రిటిష్ ప్రజలు ఏ వైఖరి అవలంబించారో ఆ వైఖరిని 1951 లో ఎందుకు అవలంబించటం లేదో అర్థంకాక చాలమంది అమెరికన్ లిబరల్ వాదులు తికమక పడుతున్నారు. దీనికి సూక్ష్మంగా ఒకటే సమాధానం వుంది. ఆరోజుల్లో స్పెయిన్, ఇటలీ, జర్మనీల ప్రమాదాన్నెదుర్కోటానికి "సమష్టి భద్రతా" ప్రయత్నాలు జరిగాయి. ఆరోజుల్లో యుద్ధాన్ని నివారించటానికే అధికార కేంద్రీకరణం తలపెట్టబడింది. కాని ఈరోజుల్లో "సమష్టి భద్రతా" ప్రయత్నాల పేరుతో యుద్ధం ప్రారంభించటానికి చూస్తున్నట్లు, తద్వారా కమ్యూనిజమ్‌ను నిర్మూలించాలనే పిచ్చి ఊహలు పెట్టుకున్నట్లు తోస్తుంది. కమ్యూనిజము జర్మన్ మిలిటరీ బలసిద్ధాంతము వంటిది కాదు. కమ్యూనిజమ్ ప్రపంచమంతటా వేళ్లు పాతుకున్న సాంఘిక ఉద్యమం. సోవియట్ సైన్యసహాయం లేకుండానే అది అలా వేళ్లు పాతుకున్నది. జర్మనీ, జపాన్, స్పెయిన్ వంటి దేశాలతో సహా కమ్యూనిస్టు వ్యతిరేక ప్రపంచాన్నంతటినీ యుద్ధసన్నద్ధంచేసి ఆర్థికంగాను, నైతికంగానూ మనం పతితులం కావటం సాగితే కమ్యూనిజమ్ తప్పక భూగోళమంతటా విస్తరించుకుంటుంది............

బ్రిటిష్ ప్రజలకు కమ్యూనిజంమీద సానుభూతి లేదు. కాని ఐక్యరాజ్యసమితిని గూర్చి అమెరికా తన వాదాన్ని బ్రిటన్‌లో ప్రచారం చెయ్యబోతే ఇక్కడ పసిపిల్లడు కూడా ఆ మాటలు నమ్మడు. జపాన్, ఫార్మోసా, కొరియాలలో మెకార్థర్ చేసే పనులు, చైనాను జయించటానికి అమెరికానుంచి తనకు సహాయం వస్తోందని చాంగ్‌కైషేక్ కొట్టే గప్పాలు బ్రిటిష్‌వారికి బాగా తెలుసు. అందుచేత, "సమష్టి భద్రత"ను రక్షించటం కోసమే ఐక్యరాజ్యసమితి ప్రస్తుతం యుద్ధం చేస్తోందని ఎంత ప్రచారం చేసినా, నమ్మేవాళ్లు లేరు.

(న్యూస్టేట్స్‌మన్ ఎండ్ నేషన్ సంపాదకుడు కింగ్‌స్లే మార్టిన్)

జర్మనీ పునరాయుధీకరణం:

జర్మనీని పునరాయుధీకరించటానికి సంకల్పిస్తే రష్యా, పశ్చిమ జర్మని, ఫ్రాన్సులలో ఎంత ఆందోళన బయలుదేరుతుందో సరిగ్గా అంచనా వెయ్యలేక పోయినందుకు అమెరికన్ విదేశాంగశాఖ తన గూఢచారశాఖను పూర్తిగా మార్చివేసి కొత్త ఉద్యోగులను నియమిస్తోంది. గత సంవత్సరం న్యూయార్కులో జరిగిన అట్లాంటిక్ రాజ్యాల సభలో జర్మనీని పునరాయుధీకరించాలని ఒత్తిడిచేయటం తన తప్పేనని విదేశాంగ మంత్రి డీన్ అచిసన్ ఒప్పుకున్నాడు. (న్యూస్‌వీక్)

★

కళాప్రపూర్ణ కీ॥ శే॥ కాశీనాధుని నాగేశ్వరరావుగారి

ఉత్కృష్టరచన

ఆంధ్రవాఙ్మయ చరిత్ర

సరికొత్త పద్ధతిని, సంగ్రహరూపంలో నడచిన సమగ్రసమీక్ష. వెయ్యేండ్ల
వాఙ్మయ చరిత్రకు విశుద్ధదర్పణం. పాతచరిత్రల నన్నిటిని అవలోడనచేసి,
సమన్వయించి క్రోడీకరించిన సిసలైన చరిత్ర.

★

శాసనాలలోనూ వాటిలోనూ అవ్యక్తస్వరూపంలో ఉండిఉండి, నన్నయధర్మమా
అని ఒక్క ఊపున దివ్యాకారంతో బైటపడి, నానాటికీ నవనవోజ్జ్వలంగా
వికసించిన మన వాఙ్మయం పోయిన పలుపోకడలను
పొడిమితో చూపెట్టజాలిన ఉత్తమ గ్రంథం.


★

వెల రు 2-0-0 లు, తపాలాఖర్చు ప్రత్యేకము

ఆంధ్రగ్రంథమాల

పోస్టు బాక్సు నెం. 212, మదరాసు.

Regd· No. M. 4479



ఆంధ్రా: ప్రీమియర్ ఫిలిమ్సు లిమిటెడ్, విజయవాడ. | సీడెడ్: సరస్వతీ టాకీసు లిమిటెడ్, గుంతకల్.
నైజాం: ప్రీమియర్ పిక్చర్సు, సికింద్రాబాద్. | మైసూర్: విజయలక్ష్మి & కంపెనీ, బెంగుళూర్.

వివరములకు: సారథీ ఫిలిమ్సు లిమిటెడ్, మద్రాసు 17.

Edited, Printed & Published by S. Sambhu Prasad at theAndhra Patrika Press, 7,ThambuChettySt Madras.